
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 124 | విజయవాడ, శుక్రవారం 5 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Friday 5 December 2025 | Rs



రూపాయి ఘోర పతనం - పర్యవసానాలు
4



భారత హాకీజట్టుకు కఠిన పరీక్ష
- నేడు క్వార్టర్స్‌లో బెల్జియంతో ఢీ
- ఎఫ్ఐహెచ్ జూనియర్ ప్రపంచకప్ హాకీ

8

కన్వీనర్ సీట్లలో కోత?

- 70 నుంచి 50 శాతానికి కుదింపు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ తగ్గించేందుకు ప్రభుత్వం యత్నం
- కొత్తగా ఎన్ఆర్ఐ కోటా ప్రవేశపెట్టే ఆలోచన
- పేద విద్యార్థులపై తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్య, వృత్తివిద్య కోర్సుల్లో కన్వీనర్ సీట్లలో కోత పెట్టేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రయత్నిస్తుంది. పేద విద్యార్థుల చదువులపై ప్రభావం పడే విధంగా బి కేటగిరి సీట్లలో కోతలు విధించి తద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం చేసే ఈ ఆలోచన అచరణలోకి వస్తే పేద విద్యార్థులకు వృత్తివిద్య కోర్సులు దూరమయ్యే పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం ఇంజనీరింగ్, ఫార్మసి వంటి కోర్సులు అందించే కళాశాలల్లో కౌన్సిలింగ్ ద్వారా బి కేటగిరి కోటా కింద 70శాతం, యాజమాన్య కోటా కింద 30శాతం సీట్ల ప్రతిపాదికన భర్తీ చేస్తోంది. బి కేటగిరి సీట్లకు రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య పర్యవేక్షణ మరియు నియంత్రణ కమిషన్ (ఎపిహెచ్ఇఆర్ఎంసి) ఫీజులను నిర్ధారిస్తోంది. బి కేటగిరి సీట్లకు నిర్ధారించిన ఫీజుకు మూడు రెట్లు అధికంగా యాజమాన్యం కోటా కింద ప్రైవేట్ కళాశాలలు వసూలు చేసుకునే అవకాశం ఉంది. ఇప్పుడు ఈ విధానాన్ని మార్చేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. బి కేటగిరి కింద భర్తీ చేసే 70శాతం సీట్లలో 20శాతం కోత విధించి దీనిని 50శాతానికే పరిమితం చేయాలని చూస్తోంది. బి కేటగిరిలో కోత విధించిన 20శాతం సీట్లను కొత్తగా ఎన్ఆర్ఐ కోటా కింద భర్తీచేయనునట్లు సమాచారం. యాజమాన్య కోటా కింద 30శాతం సీట్లను అలానే ఉంచనుంది. బి కేటగిరి కింద భర్తీ చేసే సీట్లను తగ్గిస్తే ఇంజనీరింగ్, ఫార్మసి వంటి వృత్తి విద్య కోర్సులకు పేద విద్యార్థులు దూరమయ్యే ప్రమాదం ఉంది. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం బి కేటగిరికే అమలవుతుంది. ఈ విభాగంలో ఎక్కువగా చేరుతోంది కూడా ఎస్సి,ఎస్టి,బిసి, మైనార్టీ విద్యార్థులే. ఈ నిర్ణయం ద్వారా పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే ఆలోచనగా ప్రభుత్వం చేస్తునట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా రాష్ట్రప్రభుత్వం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. సుమారు రూ.4,500కోట్ల వరకు ప్రైవేట్ కళాశాలలకు ప్రభుత్వం ఈ పథకం కింద బకాయిలు చెల్లించాల్సి ఉంది. బకాయిలు ఉండటంతో అటు ప్రైవేట్ కళాశాలలు కోర్సులు పూర్తయినా విద్యార్థులకు సర్టిఫికేట్లు అందించడం లేదు. కొన్ని కళాశాలలు విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను లను విడుదల చేసి విద్యార్థుల చదువులకు ప్రోత్సాహకం అందించాల్సిన ప్రభుత్వం, అలా చేయకపోవడం సరికాదని విద్యావేత్తలు అంటున్నారు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం కొత్తగా నిర్మించిన వైద్య కళాశాలల్లో 107,108 జివోలను తీసుకొచ్చి పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసింది. 100శాతం పేదలకు దక్కాల్సిన వైద్య సీట్లను 50శాతానికే వైసిపి ప్రభుత్వం పరిమితం చేసింది. బి కేటగిరి కింద 50శాతం, ఎన్ఆర్ఐ 15శాతం, 35శాతం సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు అనే విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానాన్ని రద్దు చేస్తామని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్(పిపిపి) పేరుతో వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెడుతోంది. కొత్తగా ప్రవేశపెట్టే విధానంపై ఉన్నత విద్యాశాఖ త్వరలో ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మా కళాశాలల అసోసియేషన్లతో చర్చలు జరపనునట్లు సమాచారం. అయితే ఉన్నత విద్యశాఖ చేస్తున్న ఆలోచనపై ఉన్నత విద్యామండలి అభ్యంతరం వ్యక్తం చేస్తునట్లు తెలిసింది.



కౌన్సిలింగ్‌కు హాజరైన విద్యార్థులు (ఫైల్ ఫొటో)

కొత్త కళాశాల్లో పిజి ఫీజులు ఖరారు

- మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ ఏడాది జరగనున్న పోస్ట్ గ్రాడ్యుయేషన్(పిజి) ప్రవేశాలకు ఫీజులను రాష్ట్రప్రభుత్వం నిర్ధారించిందని వైద్య,ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రభుత్వ కోటా సీట్లకు రూ.30 వేలు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు రూ.9 లక్షలు, ఎన్ఆర్ఐ సీట్లకు రూ.29 లక్షలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదించారని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఏడాదిలో ఐదు కొత్త ప్రభుత్వ వైద్యకళాశాలల్లో నాలుగు కోర్సుల్లో 60 పిజి ప్రవేశాలకు భారత వైద్య మండలి (ఎన్ఎంసి) అనుమతి ఇచ్చిందని తెలిపారు. రాజమండ్రి, నంద్యాల కళాశాలల్లో 16, విజయనగరం, మచిలీపట్నం కళాశాలల్లో 12, ఏలూరు కళాశాలలో 4 చొప్పున పిజి ప్రవేశాలు జరుగుతాయని పేర్కొన్నారు.

గ్రౌండ్ అయ్యేలా చూడండి

- ఎస్ఐపిబి సమావేశంలో సిఎం చంద్రబాబు ఆదేశం
- 20,444 కోట్ల పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులద్వారా ఏర్పాటయ్యే పరిశ్రమలు త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం ముఖ్యమంత్రి నేతృత్వంలో సచివాలయంలో 13వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. రాష్ట్రంలో 20,444 కోట్ల రూపాయల కొత్త పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొత్తం 26 సంస్థలకు వారి యూనిట్లు ఏర్పాటుచేసుకునేందుకు అనుమతిచ్చారు. తద్వారా 56,278 ఉద్యోగాలు కల్పన జరుగుతుందని వివరించారు.

విశాఖ పెట్టుబడులపై చర్చ

కొద్ది రోజుల క్రితం విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సుపైనా చంద్రబాబు సమీక్షించారు. దాదాపు 13 లక్షల కోట్ల వరకు ఒప్పందాలు జరగ్గా, వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ పెట్టుబడులు త్వరగా క్షేత్ర స్థాయిలో గ్రౌండ్ అయ్యేలా చూడాలని, దీనికోసం ఆయా సంస్థలతో అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సూచించారు. సత్వర గ్రౌండింగ్ కోసం తనతోపాటు చీఫ్ సెక్రటరీ, మంత్రులు, ఇతర శాఖల అధికారులు కూడా పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. ఎస్ఐపిబి సమావేశంలో ఆమోదాలే కాకుండా ఎర్లీబర్డ్ ప్రోత్సాహకాల కింద మరో ఆరు సంస్థలకు కూడా అనుమతులు ఇచ్చినట్లు అధికారులు వివరించారు. త్వరలో దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక మండలి సదస్సుకు వెళ్లేలోగా వీలయినన్ని ఎక్కువ ఒప్పందాలు గ్రౌండ్ అయ్యేలా చూడాలని చంద్రబాబు ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిందేనన్నారు. అధికారులు సాంకేతికతపై పూర్తిగా పట్టుసాధించాలని, లేదంటే వెనుకబడిపోతామని చెప్పారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా లాజిస్టిక్స్ యూనివర్శిటీ, సివిల్ ఏవియేషన్ యూనివర్శిటీ, గ్రీన్ ఎనర్జీ యూనివర్శిటీలను ఏర్పాటు చేయాలన్నారు. క్వాంటమ్ వ్యాలీకి సలహామండలిని నియమించాలని, స్టార్టప్ సంస్థలకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ మెంటార్‌గా పనిచేస్తుందని చెప్పారు. పర్యాటక రంగానికి ప్రాధాన్యత కల్పించాలని, కాపులుప్పాడలో హెూటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల కోసం 50 ఎకరాల భూమిని కేటాయించాలని అధికారులకు సూచించారు.

ప్రభుత్వరంగ సంస్థలతో పెట్టుబడులు

రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థలే వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేలా చూడాలని చంద్రబాబు నిర్దేశించారు. విదేశాల్లో అనేక ప్రభుత్వ రంగ సంస్థలు లక్షల కోట్ల సావరిన్ ఫండ్ ఏర్పాటుచేసుకుంటున్నాయని, ఇక్కడ కూడా అదే తరహాలో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో 500 కోట్లతో ప్రభుత్వమే సావరిన్ ఫండ్ ఏర్పాటుచేయాలన్నారు.

సమావేశంలో ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే ప్రతి సంస్థనూ పూర్థి స్థాయిలో పరిశీలించిన తరువాతే అనుమతులు ఇవ్వాలన్నారు. ఇదే సమయంలో వారికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో సిఎస్ విజయానంద్, మంత్రులు టిజి భరత్, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, నారాయణ పాల్గొనగా, బిసి జనార్ధన్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, పర్యావుల కేశవ్ వర్చువల్‌గా హాజరయ్యారు.

భారత్ చేరుకున్న పుతిన్

- స్వయంగా ప్రధాని మోడీ స్వాగతం
- ఇరువురు నేతల ప్రైవేటు విందు సమావేశం



వ్లాదిమిర్ పుతిన్‌తో కరచలనం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ : ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం న్యూఢిల్లీ చేరుకున్నారు. ప్రొటోకాల్‌ను పక్కనబెట్టి ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా పుతిన్‌కు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు ఒకే కారులో ప్రధాని అధికార నివాసానికి చేరుకున్నారు. ప్రధాని మోడీ, పుతిన్‌కు ఈ రాత్రి ప్రైవేటుగా డిన్నర్ ఇవ్వనున్నారు. గతేడాది జులైలో మోడీ మాస్కోలో పర్యటించినపుడు రష్యా నేత కూడా ఇలాగే విందునిచ్చారు. కాగా గత నాలుగేళ్ళ కాలంలో పుతిన్ తొలి పర్యటన ఇదే. ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముందుగా 2021 డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత ఇప్పుడే రావడం.

శుక్రవారం హైదరాబాద్ హౌస్‌లో జరిగే భారత్-రష్యా 23వ సదస్సులో ఇరువురు నేతలు పాల్గొంటారు. దానికి ముందుగా ఆయనకు ఘన స్వాగతం లభించనుంది. సదస్సు ముగిసిన తర్వాత పుతిన్ రష్యా ప్రభుత్వ ప్రసార సంస్థ అయిన ఆర్‌టి ఇండియా చానల్‌ను కొత్తగా ప్రారంభించనున్నారు. ఆ తర్వాత పుతిన్ గౌరవార్ధం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన విందు సమావేశానికి హాజరవుతారు. అంతకుముందు రాజ్‌ఘాట్‌కు వెళ్ళి మహాత్మునికి నివాళులు అర్పించనున్నారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పడి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా పుతిన్ పర్యటన జరుగుతోంది. ఉక్రెయిన్‌పై శాంతి ఒప్పందానికి ట్రంప్ పట్టుబడుతున్న వేళ, అలాగే రష్యా నుండి ముడి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అమెరికా అదనంగా భారత్‌పై సుంకాలు మిగతా 7లో

పల్నాడులో ఘోరం

- లారీని ఢీ కొన్న కారు
- ఐదుగురు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి - చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లాలో గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాదెండ్ల మండలం గణపవరం వద్ద బైపాస్ రోడ్డుపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు విద్యార్థులు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరందరూ అయ్యప్పమాలధారణలో ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం గుంటూరులోని విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు అయ్యప్పమాల ధరించారు. వీరంతా గుంటూరు నుంచి ఒంగోలుకు కారులో బయలుదేరారు. గుంటూరు-ఒంగోలు జాతీయ రహదారి గణపవరం బైపాస్ రోడ్డు సమీపంలో ముందు వెళ్తున్న కంటైనర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థిని చిలకలూరిపేట ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయారు. మృతులు శ్రీకాంత్, వాసు, రామిరెడ్డి, మహేష్‌గా గుర్తించారు. నాదెండ్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంపై మంత్రులు గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఢిల్లీ వాయు కాలుష్యం
నియంత్రణకు తక్షణ చర్యలు

- ప్రతిపక్ష ఎంపిల డిమాండ్
- గ్యాస్ మాస్కులతో పార్లమెంట్ ఆవరణలో ఆందోళన



పార్లమెంట్ ఆవరణలో గురువారం మాస్కులతో ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష పార్టీల ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర రూపం దాల్చడంతో నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. గురువారం పార్లమెంట్ ఆవరణలో మాస్కులు ధరించిన ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేబూని నినాదాలు హెూరెత్తించారు. ఈ సమస్యను జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత సోనియా గాంధీ, రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే, ఎంపి ప్రియాంక గాంధీ, సిపిఎం ఎంపిలు కె.రాధాకృష్ణన్, జాన్ బ్రిట్టాస్, సిపిఐ ఎంపిలు పి.సంతోష్ కుమార్, సుబ్బరాయన్, డిఎంకె ఎంపి టిఆర్ బాలు, ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలేతో పాటు అనేక మంది ప్రతిపక్ష ఎంపిలు గ్యాస్ మాస్కులు ధరించి నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోనియా గాంధీ మాట్లాడుతూ వాయు కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు తీసుకోవాలని, ఇది ప్రభుత్వ బాధ్యత అని, కాలుష్యంతో పిల్లలు చనిపోతున్నారన్నారు. నాలాంటి వయసు మీరిన వాళ్లు కూడా కాలుష్యంతో ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. వాయు కాలుష్యం రాజకీయ అంశం కాదని ప్రియాంక గాంధీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలన్నారు. నెల రోజుల నుంచి తీవ్రమవుతున్న వాయు కాలుష్య సంక్షోభంపై చర్చించాలని ఉభయ సభల్లో కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష ఎంపిలు వాయిదా తీర్మానం ఇచ్చారు. ఢిల్లీ వాయు కాలుష్యంపై చర్చకు ప్రతిపక్షాల డిమాండ్ మధ్య రాజ్యసభ ఒకసారి వాయిదా పడింది. అనంతరం ప్రారంభమైన సభలో పొగాకు ఉత్పత్తులపై అధిక ఎక్సైజ్ సుంకాలు విధించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ది హెల్త్ నేషనల్ సెక్యూరిటీస్ సెస్ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే కాంగ్రెస్ ఎంపి కార్తీ చిదంబరం ఈ బిల్లు సమాఖ్య స్వభావానికి వ్యతిరేకమైందన్నారు. దీని ద్వారా వచ్చే ప్రయోజనీలేంటి, ఎంత ఆదాయం వస్తుందనే విషయాలను బిల్లులో తెలపలేదన్నారు.

రాష్ట్రాలకు సెస్‌లో 50 శాతం వాటా ఇవ్వాలి : సిపిఎం ఎంపి సచ్చిదానందం

రాష్ట్రాలకు సెస్ ఆదాయంలో 50% అందించాలని ఆర్థిక మంత్రిని తమిళనాడు సిపిఐ(ఎం) ఎంపి ఆర్. సచ్చిదానందం కోరారు. ది హెల్త్ బిల్లు అమలైతే దాని ఆదాయం రాష్ట్రాలకు జమ కాదని, ఈ బిల్లుతో ఎటువంటి ప్రయోజనం చేకూరదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు సెస్ ఆదాయంలో 50% అందించాలని ఆయన ఆర్థిక మంత్రిని కోరారు. నిత్యావసర వస్తువులపై మిగతా 7లో

గంజాయి బదులు ట్యాబ్లెట్స్

- కొత్త పుంతలు తొక్కుతున్న డ్రగ్ మాఫియా
- అనుమతి లేకుండా విక్రయిస్తున్న రెండు దుకాణాల లైసెన్స్ సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతుండడంతో గంజాయికి బదులు ట్యాబ్లెట్స్‌కు వ్యసనపరులు అలవాటుపడుతున్నారు. టాపెంటాడోల్ అనే ట్యాబ్‌లెట్స్ గోవా నుంచి గుంటూరుకు దిగుమతి అవుతున్నాయి. ఈ టాబ్లెట్స్ అక్రమ వినియోగంపై జిల్లా పోలీసు అధికారులు ఔషధ నియంత్రణ శాఖ దృష్టికి తీసుకువెళ్ళారు. వైద్యుల పిస్క్రిప్షన్ లేకుండా ఈ టాబ్లెట్లు విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో నగరంలోని పలు అనుమానిత దుకాణాలపై దాడులు చేశారు. రెండు దుకాణాలను గుర్తించి వాటి లైసెన్సును ఔషధ నియంత్రణ శాఖ అధికారులు సస్పెండ్ చేశారు.

ఈ ట్యాబెట్లు ఒక షీటు రూ.మూడు వేలుగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ట్యాబ్లెట్లను నీటిలో కరిగించుకొని సిరంజీ ద్వారా శరీరంలోకి ఎక్కించుకుంటారు. వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా ఈ తరహా ట్యాబెట్లు విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఈ అంశాన్ని రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్‌కు కూడా లేఖ రాయనున్నట్టు తెలిపారు. గుంటూరు జిల్లాలో గత 75 రోజుల్లో గంజాయి, ఎండిఎం మత్తు పదార్థాలను వినియోగిస్తున్న, విక్రయిస్తున్న, సరఫరాదారులను 150 మంది వరకు అరెస్టు చేశామని, ఇంకా 25 మందిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో వ్యసనపరులు ప్రత్యామ్నాయంగా మత్తు ట్యాబ్‌లెట్లు వినియోగిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇతర దేశాల్లో ఈ ట్యాబెట్ల వినియోగం ఎక్కువగా ఉంటోంది. కానీ మన దేశంలో ఈ ట్యాబ్లెట్లు డాక్టర్ల అనుమతి లేకుండా వినియోగించరాదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ట్యాబ్లెట్లు వినియోగించడం వల్లే శరీరంలో విపరీత పరిణామాలు దారితీస్తాయని, మనిషి మత్తులో ఏం చేస్తాడో తెలియని పరిస్థితులు ఏర్పడతాయి. విచక్షణ కోల్పోవడం, ఎదుట వారిపై దాడులకు పాల్పడటం, అధికంగా వినియోగిస్తే ప్రాణాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని వైద్యులు తెలిపారు.




అప్పుల బాధతో అరటి రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పుట్లూరు (అనంతపురం జిల్లా)

అప్పుల బాధతో అరటి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా పుట్లూరు మండల పరిధిలోని వెల్లుట్ల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రైతు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్లుట్ల గ్రామానికి చెందిన నాగలింగం (46) తన మూడు ఎకరాలతో పాటు మరో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకుని అరటి పంట సాగు చేశారు. దాదాపు రూ.15 లక్షల వరకు అప్పులు చేశారు. పంట కోత సమయంలో మార్కెట్లో ధరలు పడిపోయాయి. పంటను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలన్న మనోవేదనకు గురైన నాగలింగం.. గురువారం ఉదయం తోట వద్దకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లారు. తోటలో తనతోపాటు తెచ్చుకున్న పురుగుల మందు తాగారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆయన్ను కుటుంబ సభ్యులు నార్పల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు

- విద్యారంగం అస్తవ్యస్తం
- విశాఖ ఉక్కుపై మాట మార్చారు : మాజీ సిఎం జగన్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయాన్ని దండగలా మార్చారని, ఏ పంటకూ కనీస గిట్టుబాటు ధర లేదని మాజీ సిఎం, వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, సంక్షేమహాస్టళ్లు, పిల్లల మరణాలు, మెడికల్ కళాశాలల పిపిపి, విశాఖ స్టీలు అమ్మకం, రెడ్‌బుక్ రాజ్యాంగం, అక్రమ కేసులు, టిటిడి తదితర అంశాలపై సుమారు రెండున్నరగంటలపాటు ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పాలన చూస్తుంటే సేవ్ ఆంధ్రప్రదేశ్ అన్నట్లుగా ఉందని తెలిపారు. తుఫానులో నష్టపోయిన ఏ రైతుకూ పరిహారం అందలేదన్నారు. దాదాపు 15 లక్షల ఎకరాలు నష్టపోతే నాలుగు లక్షల ఎకరాలు మాత్రమేనష్టంలో చూపించారని అన్నారు. చంద్రబాబునాయుడు సిఎం అయ్యాక రాష్ట్రంలో 17 సార్లు తుఫాన్లు వచ్చాయని, ఒక్కసారి కూడా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని, దాదాపు రూ.1100 కోట్ల బకాయిలు ఇవ్వకుండా రైతులకు అన్యాయం చేశారని తెలిపారు. 84 లక్షల మంది రైతుల్లో 19 లక్షల మందికే పంటలబీమా సదుపాయం ఉందని వివరించారు. ధాన్యం 75 కిలోల బస్తా 1200కు అడుగుతున్నారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అనంతపురం, తాడిపత్రి నుండి ఢిల్లీకి రైళ్లు నడిపామని మిగతా 7లో

పెంచలయ్య కుటుంబానికి పోలీసు రక్షణ

- ఎస్‌పి భరోసా

ప్రజాశక్తి-నెల్లూరు

భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, అవసరమైతే పోలీసు రక్షణ కల్పిస్తామని గంజాయి మాఫియా చేతిలో హత్యకు గురైన పెంచలయ్య కుటుంబసభ్యులకు నెల్లూరు జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల భరోసానిచ్చారు. గురువారం ఎస్‌పి కార్యాలయంలో పెంచలయ్య భార్య, కుమారులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ...పెంచలయ్య హత్య ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని, ఇప్పటికే ప్రధాన ముద్దాయిలను అరెస్టు చేశామన్నారు. మిగిలిన వారి పాత్ర గురించి లోతుగా విచారణ చేస్తున్నామన్నారు. పెంచలయ్య ఆశయాలను, స్ఫూర్తిని కొనసాగించేందుకు జిల్లా పోలీసు వ్యవస్థ సహకరిస్తుందన్నారు. అనంతరం 'గంజాయి వ్యతిరేక అవగాహన పోస్టర్'ను పెంచలయ్య కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. పెంచలయ్య సతీమణి దుర్గా మాట్లాడుతూ.. తన భర్తను దారుణంగా హత్య చేసిన వారికి శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సూపర్‌సిక్స్‌పై జగన్ విషప్రచారం

- మంత్రి కొల్లురవీంద్ర

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పకడ్బందీగా అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ హామీలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విషప్రచారం చేస్తున్నారని ఎక్సైజ్ శాఖమంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలందరూ ఆనందంగా ముందుకెళ్తుంటే జగన్ విషం చిమ్మే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. వైసిపి పాలనలో అన్నదాతలను పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు.

జగన్ క్షమాపణ చెప్పాలి: వర్ల రామయ్య

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనకు క్షమాపణ చెప్పాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మరో సమావేశంలో డిమాండ్ చేశారు. పరకామణి కేసును రాజీ చేసిన న్యాయమూర్తిపై ఒత్తిడి వచ్చిందని తిరుపతి ప్రజలు అంటున్నారని, దీనిపై దర్యాప్తు చేయమని కోరారని అన్నారు. ఇందులో చంద్రబాబుకు తనకూ సంబంధం ఏముందని ప్రశ్నించారు. తనపై అసత్యాలు చెప్పినందుకు, ఏకవచనంతో సంబోధించినందుకు జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

నెల్లూరులో భారీ వర్షం

- పలు కాలనీల్లోకి వర్షపు నీరు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

దిత్వా తుపాన్ ప్రభావంతో నెల్లూరులో భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. నగరంలోని రామలింగాపురం, మాగుంట లేవుట్, విజయమహల్ గేట్, ఆత్మకూరు బస్టాండ్ అండర్ పాస్ బ్రిడ్జిలు పూర్తిగా మునిగిపోయాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటాచలం, బుజబుజనెల్లూరు వద్ద చెరువు నిండి జాతీయ రహదారిపైకి వరద నుంచి చేరింది. కొత్తూరు వైఎస్ఆర్ కాలనీ, తల్పగిరి కాలనీ, మన్సూర్‌నగర్, అయ్యప్పగుడి తదితర ప్రాంతాలతోపాటు అనేక కాలనీల్లోకి వర్షపు నీరు చేరింది. పెన్నా నదికీ వరద ప్రవాహం పెరిగింది. ముత్తుకూరు, వెంకటాచలం తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఎమ్మెల్యే సోమిరెడ్డిచంద్రమోహన్‌రెడ్డి పర్యటించారు. కండలేరు జలాశయం వద్ద నీటి ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని జలాశయ అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 60 టిఎంసిల నీరు ఉందని, ఇబ్బంది లేదని ఎస్ ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు కలెక్టర్‌కు వివరించారు. ఎగువ నుంచి వస్తున్న వరదనీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ నీటిని విడుదల చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

రాజధానికి రూ.7380 కోట్ల నాబార్డు రుణం

- గతంలో మాదిరే రెండో దశలోనూ కౌలు చెల్లింపు
- సీడ్ యాక్సెస్ రోడ్డు వంతెనకు రూ.532 కోట్లతో టెండర్
- సిఆర్‌డిఎ సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



అమరావతి రాజధాని నిర్మాణానికి నాబార్డు నుండి రూ.7380.70 కోట్లు రుణం తీసుకునేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఎ) ఆమోదం తెలిపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ మీడియాకు తెలిపారు. అమరావతిలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్‌సిటీ, రైల్వేట్రాక్స్, ఇన్నర్‌రింగ్ రోడ్డు కోసం 16,666 ఎకరాలు తీసుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సీడ్ యాక్సెస్‌రోడ్డును జాతీయ రహదారిలో కలిపేందుకు రూ.532 కోట్లతో టెండర్ల మంజూరుకు అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు. దీంతో పాటు అక్కడే స్టీలు బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. ఈ బ్రిడ్జి ద్వారా పాత మంగళగిరి రోడ్డులోకి కనెక్టివిటీ వస్తుందని, జనవరి చివరిలోపు దీన్ని పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం కరకట్టను నాలుగులైన్లుగా విస్తరించే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

రెండోదశ భూసమీకరణ (పూలింగ్)పై రైతులతో చర్చించామని తెలిపారు. రైతులకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. గతంలో భూములకు ఇచ్చిన వార్షిక కౌలు పద్ధతినే ఇక్కడ అమలు చేస్తామన్నారు. క్యాపిటల్ గెయిన్ మినహాయింపు అంశంపై ఇటీవల కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ ఇచ్చారని దానిపై చర్చిస్తున్నారని తెలిపారు. రాజధాని పరిధిలో 15 అంగన్‌వాడీ సెంటర్లు, స్కూళ్లు, హెల్త్ సెంటర్ల కలిపి 30 వరకూ నిర్మించామని డిసెంబరు చివరిలోపు వాటిని ప్రారంభిస్తామన్నారు. మార్చి చివరిలోపు అధికారుల భవనాలు పూర్తి చేస్తామని అన్నారు. ప్రస్తుతం ఎల్‌పిఎస్ కింద నిర్మించే 1500 కిలోమీటర్ల దూరం రోడ్ల పనులను ప్రారంభించామని తెలిపారు. మొత్తం 34 వేల ఎకరాల్లో 1900 ఎకరాల్లో ముళ్లకంప తొలగించామని, గురువారం 1500 ఎకరాలు పూర్తి చేశారని, నెలలోపు 34 వేల ఎకరాల్లోపు కంప తొలగిస్తామని పేర్కొన్నారు. రాజధానిలో సేకరించాల్సిన భూమి తక్కువగా ఉందని, దాన్ని కూడా పూలింగుకు ఇవ్వాలని కోరుతున్నామని చెప్పారు. గవర్నర్ బంగళా నిర్మాణానికి రూ.169 కోట్లుతో అనుమతులు ఇచ్చామని తెలిపారు. జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.163 కోట్లకు పరిపాలనా ఆమోదం లభించిందన్నారు.



సిఐటియు మహాసభను జయప్రదం చేయాలని సెల్ఫీ వీడియో చిత్రీకరిస్తున్న ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు

సిఐటియు మహాసభకు వినూత్న ప్రచారం

- సామాజిక మాధ్యమాల్లో సెల్ఫీ వీడియోలు
- ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ యూనియన్ అనుబంధ సంఘమైన ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో ప్రచారాన్ని ప్రారంభించారు. తమ ఉద్యమ అనుభవాలను చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడలోని ఎంబివికెలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మీ మాట్లాడుతూ..దేశంలో శ్రమజీవుల పక్షాన అనేక రూపాల్లో ఉద్యమిస్తున్న సిఐటియు.. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కూడా నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఆశా వర్కర్లు ఇప్పటికీ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వేతనం రూ.10 వేలకు మించి ఇవ్వడం లేదని తెలిపారు. సెలవు కూడా తీసుకోకుండా పనిచేస్తున్న ఆశా వర్కర్లకు ఆరోగ్య బీమా కూడా కల్పించడం లేదన్నారు. సంక్షేమ పథకాలు అమల్జేయడం లేదన్నారు. సిఐటియు మహాసభలో ఈ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణకు రూపకల్పన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి రమణకుమారి, కోశాధికారి ఎ కమల తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం' పనులు 88 శాతం పూర్తి

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు పనులు ఇప్పటికి 88 శాతం పూర్తి చేశామని, 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గురువారం పోలవరం ప్రాజెక్టు పనులను మంత్రి పరిశీలించారు. ప్రాజెక్టులో గ్యాప్-1, గ్యాప్-2, కుడి ప్రధాన కాలువ జంట గుహలు, హెడ్ రెగ్యులేటర్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్లు, మ్యాప్ పాయింట్లను తిలకించారు. ఇంజనీరింగ్ చీఫ్ ఎన్.నరసింహమూర్తి, ఎస్ఇ రామచంద్రరావు, మెగా ప్రతినిధులు అంగర సతీష్, గంగాధర్ మంత్రికి పనుల పురోగతిని వివరించారు. అనంతరం జలవనరులశాఖ అధికారులు, మెగా కాంట్రాక్టర్లు, ఇతర ఏజెన్సీల ప్రతినిధులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ డయాఫ్రం వాల్‌లో ఇప్పటికే 950 మీటర్ల నిర్మాణం పూర్తయ్యి, 75 శాతం పనులు ముగిశాయని తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రెండు శాతం పనులు మాత్రమే చేస్తే, కూటమి ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 12 శాతం పనులు పూర్తి చేసిందన్నారు. క్లిష్టమైన టన్నెల్స్ లైనింగ్ పనులతో ఉన్న రైట్ కనెక్టివిటీస్ 82 శాతం, లెఫ్ట్ కనెక్టివిటీస్ 62 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. వర్షాకాలంలో కూడా నిర్మాణాలు ఆగకుండా ఉండేందుకు బట్రస్ డ్యామ్ నిర్మాణం పూర్తిచేసినట్లు తెలిపారు. వచ్చే ఫిబ్రవరి నాటికి కొత్త డయాఫ్రం వాల్‌ను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. నిర్వాసితులకు ఒక్క ఏడాదిలోనే రూ.రెండు వేల కోట్లు అందజేసి వారి పునరావాసానికి అండగా నిలిచింది చంద్రబాబు ప్రభుత్వం అన్నారు. ఎడమ ప్రధాన కాలువ పనులను పూర్తి చేసి 2026 నాటికి అనకాపల్లి వరకు గోదావరి జలాలను చేర్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సలహాదారులు ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ డి.ప్రశాంతి, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి.అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ సిందూర్‌లో మృతిచెందిన జవాన్ జీవిత చరిత్రను నాటక రూపంలో ప్రదర్శిస్తున్న విద్యార్థులు



జ్యోతిబాపూలే, సావిత్రిబా పూలే జీవిత కథను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

- గిరిజన సంస్కృతి, చారిత్రాత్మక నేపథ్యాలు ప్రదర్శించిన విద్యార్థులు
- రెండో రోజు అలరించిన ఉద్భవ్ వేడుకలు
- నేడు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గిరిజన విద్యార్థుల ప్రతిభను దేశవ్యాప్తంగా చాటి చెప్పాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరో జాతీయ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ సొసైటీ సంప్రదాయ, సంస్కృతి కళా ఉత్సవం ఉద్భవ్-2025లో రెండో రోజు గురువారం వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు గిరిజన ప్రాంతాల విభిన్న సంస్కృతులను, చారిత్రాత్మక నేపథ్యాలను, కళలను ఒకే వేదికపై వైవిధ్య భరితంగా ప్రదర్శించి భారతదేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు జరిగాయి. వివిధ వేదికలపై సీనియర్ విభాగంలో గ్రూపు, సోలో విభాగంలో శాస్త్రీయ, గిరిజన పాటల పోటీలు, జూనియర్ విభాగంలో సంస్కృత శ్లోకాల పోటీ, కవితా పఠనం పోటీలు, ఆంగ్ల పద్యాల పోటీలు, క్విజ్ పోటీలు జరిగాయి. వీటితో పాటు సీనియర్ విభాగంలో ఆంగ్లంలో, హిందీలో వక్తృత్వ పోటీలు, బహిరంగ చర్చ, సీనియర్ విభాగంలో స్పెల్ బి పోటీలు నిర్వహించారు. వివిధ వేదికలపై సీనియర్ గ్రూపు, సోలో విభాగంలో జానపద గేయాల గాత్ర పోటీలు, సంగీత వాయిద్యాల కచేరి పోటీలు, నృత్య, నాటిక, సంగీత, దృశ్య కళల ద్వారా సాంప్రదాయ కథనాల వక్త పోటీలు, థియేటర్ మిమిక్రీ, క్లాసికల్ - సెమి క్లాసికల్ సంగీత గాత్ర కచేరి పోటీలను నిర్వహించారు.

దేశభక్తిని ఉద్బోధించిన నాటిక ప్రదర్శనలు

స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజన తెగల హక్కుల కోసం జరిగిన పోరాటాల్లో ప్రాణత్యాగాలు చేసిన యోధుల జీవితగాథలు, గిరిజన సంక్షేమం కోసం, సామాజిక దూరాచారాలు రూపుమాపటానికి పాటుపడిన మహోన్నత వ్యక్తుల జీవిత చరిత్రలోని అనేక ఘట్టాలను అప్పటి పరిస్థితులను వివరించేలా సెటింగ్స్, వస్త్రధారణతో ప్రదర్శనలు ఆద్యంతం కొనసాగాయి. ఆంధ్రప్రదేశ్ నుండి ఏకలవ్యుడు, ద్రోణాచార్యుడు కథాంశంతో ఆంధ్రప్రదేశ్ ఇఎంఆర్ఎస్ విద్యార్థుల ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఏకలవ్యుని త్యాగనిరతిని చిన్నారులు ఎంతో హృద్యంగా కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. తెలంగాణ నుండి దేశ సరిహద్దులలో పహల్గమ్ దాడిలో మరణించిన వారికి నివాళిగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో మృతి చెందిన ఆర్మీ జవాన్ మురళి నాయక్ యొక్క జీవిత చరిత్రని, పోరాట పటిమని నాటిక రూపంలో అద్భుతమైన ప్రదర్శనను ఇవ్వటంతో ఆడిటోరియం మొత్తం కరతాళ ధ్వనులతో మారుమోగడమే కాకుండా పోరాట స్ఫూర్తిని, దేశ భక్తిని చాటారు. మహారాష్ట్ర నుండి విద్య యొక్క ప్రాముఖ్యతను, మహిళకు చదువు ఎంత ముఖ్యమన్నది జ్యోతిబా పూలే, సావిత్రిబా పూలే జీవిత కథను నాటిక రూపంలో వీక్షకులను ఆకట్టుకునేలా ప్రదర్శించారు. ఎపి గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమీ, నెస్ట్ సహాయ కార్యదర్శి బిపిన్ రాటూరి, రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ స్మరన్ రాజ్, ఇతర గిరిజన సంక్షేమ శాఖ, చీజూబా ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.

మద్దతు ధరతో ప్రతి గింజా కొనాల్సిందే

- ప్రభుత్వానికి రైతు సంఘం, కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనేనాథుడు కరువై అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎపి కౌలు రైతుల సంఘం నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే కనీస మద్దతు ధర కల్పించి రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో గురువారం ధాన్యం రైతులతో కలిసి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధానకార్యదర్శి ఎం హరిబాబు, ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు కేశవరావు తదితరులు మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు పొంతన ఉండటం లేదని విమర్శించారు. ఉదాహరణకు మొవ్వ ప్రాంతంలో రైతులే మిల్లు వద్దకు ధాన్యాన్ని పంపుతున్నారని, రాష్ట్రంలో అన్ని చోట్లా ఇలాంటి దుస్థితే నెలకొందన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించిన నిబంధనలపై రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందికి కనీస అవగాహన లేదని ఒక తేమ శాతాన్ని పరిశీలిస్తున్నారని తెలిపారు. ధాన్యాన్ని వివిధ సాకులతో రూ.1470కే కొంటామని మిల్లర్లు చెబితే..కలెక్టరు సహా ఉన్నతాధికారులు ఎవ్వరూ స్పందించడం లేదని, దీంతో మిల్లర్లు చెప్పిన ధరకే తెగనమ్ముకోవాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల రైతులకు దక్కాల్సిన కోట్లాది రూపాయల సొమ్ము మధ్య దళారులు, మిల్లర్లు దోచేస్తున్నారని వాపోయారు.



ధాన్యం రైతులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న హరిబాబు. చిత్రంలో సీనియర్ నాయకులు కేశవరావు తదితరులు

తేమ పేరిట మిల్లర్ల దోపిడీ..అన్నదాతల ఆవేదన

కృష్ణా జిల్లా చల్లపల్లికి చెందిన కౌలు రైతు వాకా రామచంద్రరావు మాట్లాడుతూ.. తేమ పేరిట బస్తాకు రూ.1,400 నుంచి రూ.1,470 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉయ్యూరు మండలం కాటూరు గ్రామ రైతు అన్నే సుబ్బారావు మాట్లాడుతూ.. కోతలు కోయడానికి యంత్రాలు దొరకని పరిస్థితి నెలకొందన్నారు. గుంటూరు జిల్లా కౌలు రైతు ఇషాక్, చిర్రావూరు రైతు సుబ్బారావు మాట్లాడుతూ.. ధాన్యం నాణ్యత బాగున్నా రూ.1,400కే అమ్మాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రైతు పల్లె కృష్ణ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రభుత్వం చెప్పిన దానికి అనుగుణంగా జరగడం లేదని, తక్కువ ధరకే అమ్ముకుంటున్నామని తెలిపారు. విజయవాడ రూరల్ మండలం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. మద్దతు ధరకు ఇవ్వకుండా తక్కువ రేటుకే ధాన్యం కొంటున్నారని పేర్కొన్నారు.



విశాఖలో నిరసన తెలుపుతున్న నర్సింగరావు, లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

ఉక్కుపై పార్లమెంట్‌లో సమాధానం చెప్పండి

- స్టీల్‌ప్లాంట్‌లో అవినీతిపై న్యాయవిచారణ జరపండి : సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై పార్లమెంట్ సమావేశాల్లో సమాధానం చెప్పాలని కేంద్రంలోని మోడీ సర్కారును సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. భిలాయ్, బొకారో, దుర్గాపూర్‌తో సహా అన్ని ప్రభుత్వ రంగ ఉక్కు కర్మాగారాలకు, ప్రైవేటు స్టీల్‌ప్లాంట్లకూ సొంత గనులు ఉన్నాయని, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ఎందుకు లేవని ప్రశ్నించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న అవినీతిపై తక్షణమే న్యాయవిచారణ జరపాలని, ఉక్కు కార్మికులకు పూర్తి స్థాయిలో వేతనాలు చెల్లించాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిఐటియు ఆధ్వర్యాన జగదాంబ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం జగ్గునాయుడుతో కలిసి నర్సింగరావు మాట్లాడారు. మైన్స్ అండ్ మినరల్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం సెక్షన్ 17ను అనుసరించి ప్రతి ప్రభుత్వ రంగ పరిశ్రమకు సొంత గనులు సమకూర్చాల్సి ఉందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో అది అమలు కాలేదన్నారు. దేశంలో నాణ్యతలో విశాఖ స్టీల్ నెంబర్ వన్ అని, ఇతర దేశాలకు సైతం వరుసగా నాలుగు సంవత్సరాలు ఎగుమతులు చేసిన ఘనత ఈ కర్మాగారానికి ఉందని తెలిపారు. నాణ్యతలో అంతర్జాతీయ అవార్డులు అందుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ప్రైవేటీకరణ చర్యల్లో భాగంగా స్టీల్‌ప్లాంట్‌ను, ఉత్పత్తుల నాణ్యతను దెబ్బకొట్టాలని ప్రస్తుత సిఎండిగా ఉన్న సక్సేనా కంకణం కట్టుకున్నారని విమర్శించారు. నాసిరకం ముడిసరుకును వినియోగించి ఉత్పత్తిపడిపోయేలా చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ముడి ఖనిజం ఖరీదు 64 శాతం నుంచి 75 శాతం పెరిగిందని, దీనికి కారకులెవరో తేల్చాలని డిమాండ్ చేశారు. విశాఖకు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి గురువారం రానున్నారన్న సమాచారంతో ప్లాంట్‌లోని పరిణామాలను ఆయనకు వివరించాలని భావించామని, కానీ ఆయన రాలేదని తెలిపారు. ఉక్కు కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉత్పత్తితో జీతాలను ముడిపెట్టి కోతలు విధిస్తున్నారని తెలిపారు. ఇవన్నీ తప్పుడు చర్యలని, పొగబెట్టి పొమ్మన్నట్టుగా ఉందని తెలిపారు. ఇప్పటికే పది వేల మందిని తొలగించారన్నారు. వీటన్నింటికీ ఉక్కు శాఖ మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కె లోకనాథం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, పి మణి, కెఎం కుమార్ మంగళం, ఎం సుబ్బారావు, కె చంద్రశేఖర్, కృష్ణారావు, పి వెంకటరావు, లక్ష్మణరావు, ఎల్‌జె నాయుడు పాల్గొన్నారు.



నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న సిఐటియు నాయకులు

దీక్ష విరమించిన లోకో రన్నింగ్ స్టాఫ్


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఉద్యోగుల సమస్యలపై గత రెండు రోజులుగా దీక్షను సిఐటియు నాయకులు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. విజయవాడలోని రైల్వే డిఆర్ఎం కార్యాలయం వద్ద లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ నాయకులు దీక్ష చేపట్టారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు దయా రమాదేవి, ముజఫర్ అహ్మద్, ఎన్.సిహెచ్ శ్రీనివాస్‌కు దీక్ష చేస్తున్న అసోసియేషన్ నాయకులకు గురువారం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

రాజధానిలో 2500 ఎకరాల్లో స్పోర్ట్సు సిటీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధానిలో 2500 ఎకరాల్లో స్పోర్ట్సు సిటీని నిర్మిస్తున్నట్లు మంత్రి పి.నారాయణ తెలిపారు. మలి విడత భూ సమీకరణపై అమరావతి మండలం యండ్రాయి గ్రామ రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధ్యక్షత వహించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వల్ల రాజధాని నిర్మాణం ఆలస్యమయ్యిందన్నారు. ఈ బిల్లులు చెల్లించి తిరిగి పనులు చేపట్టేలోగా జాప్యం జరిగిందని, గత రెండేళ్లలో వర్షాలు అధికంగా కురవడం వల్ల పనులకు ఆటంకం కలిగిందని చెప్పారు. రాజధాని విస్తరణలో భాగంగా స్మార్ట్ ఇండస్ట్రీలు, అంతర్జాతీయ స్పోర్ట్సు సిటీని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రెండో విడత ప్యాకేజీని కూడా రైతులకు అందజేస్తామని వెల్లడించారు. మలి విడత భూ సమీకరణకు ముందే యండ్రాయి గ్రామానికి చెందిన రైతు నంబూరు బలరాం తన నాలుగు ఎకరాల భూమికి చెందిన డాక్యుమెంట్స్‌ను మంత్రికి అందజేశారు. రైతుల సమస్యలను మంత్రికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వివరించారు.



మంత్రి నాదెండ్లను కలిసిన కేరళ అధికారులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేరళ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారులు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహన్‌ను కలిశారు. పెనమలూరు మండలం కానురులోని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి నాదెండ్లను కేరళ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండి జయకృష్ణ నేతృత్వంలోని అధికారుల బృందం గురువారం మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో కొనసాగుతున్న సంస్కరణలు, లబ్ధిదారుల సేవల మెరుగుదల, ధాన్యం కొనుగోలు విధానాలు వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎపి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండి ఢిల్లీరావు, డైరెక్టర్ ఆర్.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి యువజనోత్సవాలు

- యువజన సేవల శాఖ కమిషనర్ భరణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యువజన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19, 20 తేదిల్లో రాష్ట్ర యువజన మహోత్సవం (యువ-2025) నిర్వహిస్తున్నామని యువజన సేవల శాఖ కమిషనర్ ఎస్ భరణి వెల్లడించారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వడ్డేశ్వరంలోని కెఎల్ యూనివర్సిటీలో 'యూత్ ఫర్ స్వర్ణాంధ్ర' థీమ్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు గల యువతకు రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తామన్నారు. మొదటి బహుమతి విజేతలను జాతీయ యువజనోత్సవం-2026లో పాల్గొనడానికి పంపిస్తామని చెప్పారు. యువజన మహోత్సవం(యువ)-2025 ఈవెంట్ కర్టెన్ రైజర్‌ను ఆమె ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూత్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్ కేసులో గ్లోబల్ ఆస్పత్రి సీజ్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ దందా కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. మదనపల్లె కేంద్రంగా గ్లోబల్ ఆస్పత్రిలో నిర్వహించిన కిడ్నీ రాకెట్ కేసులో ఇప్పటికే అన్నమయ్య జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు, డయాలసిస్ టెక్నీషియన్స్ మెహరాజ్, బాలరంగడు, వైజాగ్‌కు చెందిన పద్మ, సత్య, సూరిబాబు, కడపకు చెందిన ఓటి అసిస్టెంట్లు కొండయ్య, సుమన్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కిడ్నీ రాకెట్ దందాకు కేంద్రంగా నిలిచిన గ్లోబల్ ఆస్పత్రిని సీజ్ చేసేందుకు పోలీసులు కోర్టు అనుమతి కోరారు. కోర్టు నుంచి అనుమతి రావడంతో గురువారం ఆస్పత్రిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మహేంద్ర మాట్లాడుతూ గ్లోబల్ ఆస్పత్రిలో చట్ట విరుద్ధంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరగడంతో వైజాగ్‌కు చెందిన యమున అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందేనన్నారు. ఈ కేసులో ఇప్పటికీ ఎనిమిది మందిని అరెస్టు చేశామని, సర్జరీ చేసిన బెంగళూరుకు చెందిన డాక్టర్ అనంద్ పార్థసారథి పరారీలో ఉండడంతో గాలింపు చేపట్టామన్నారు. గ్లోబల్ ఆస్పత్రిలో సర్జరీకి ఉపయోగించిన పరికరాలను, ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేశామన్నారు. ఈ కేసులో సంబంధం ఉన్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. అన్ని కోణాల్లో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మన్నేరులో గల్లంతై... ఒకరు మృతి

ప్రజాశక్తి - శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

బాబాయ్ అంత్యక్రియల్లో పాల్గొని... తిరిగి వస్తుండగా.. మన్నేరులో కొట్టుకుపోయి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. ప్రకాశం జిల్లా శానంపూడి గ్రామంలో చోటుచేసుకుంది. శానంపూడి గ్రామానికి చెందిన గుంజి వెంకటేశ్వర్లు (45) హైదరాబాద్‌లో భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. శానంపూడి గ్రామంలో ఇతని బాబాయి గుంజి ముసలయ్య మృతి చెందడంతో అతని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతదేహాన్ని మన్నేరు అవతల వైపు దహన సంస్కారాలు చేసి, అంత్యక్రియల అనంతరం మన్నేరులో స్నానం చేస్తున్న సమయంలో నీటిలో కొట్టుకుపోయారు. అతనితో వచ్చిన వారందరూ ఎంతసేపు కేకలు వేసినా స్పందన లేకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు మత్స్యకారుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు నివాళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయమైన విజయవాడలోని ఆంధ్ర రత్న భవన్‌లో గురువారం నాడు మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలీ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా, ఆర్థిక శాఖ మంత్రిగా రాష్ట్రానికి కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరహరిశెట్టి నర్సింహారావు, నాయకులు ఎస్.కె అన్సారీ, వేముల శ్రీనివాస్, బేగ్, పరశురామ్, రమణ రోశయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

డ్రగ్స్, గంజాయిని పూర్తిగా రూపుమాపాలి

- పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిని పూర్తిగా రూపుమాపాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లాలో గంజాయి మాఫియాకు వ్యతిరేకంగా పోరాడి హత్యకు గురైన పెంచలయ్య ఘటనపై రాష్ట్ర హోంమంత్రి స్పందించకపోవడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచలయ్య కుటుంబానికి న్యాయం చేయాలని, అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ, ప్రజానాట్యమండలి, ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం గురువారం జరిగింది. డివైఎఫ్ఐ రాష్ట్రకార్యదర్శి జి రామన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చంద్రనాయక్, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పొలారి, పిడిఎస్‌యు నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి మాఫియా రాజ్యమేలుతోందని, టిడిపి కూటమి ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్, గంజాయి మాఫియాకు వ్యతిరేకంగా పోరాడిన పెంచలయ్యను అతికిరాతకంగా హత్య చేయడాన్ని వారంతా తీవ్రంగా ఖండించారు. ఈ కేసులో అరెస్టు చేయడానికి వెళ్లిన పోలీసులపైనా దుండగులు దాడి చేశారంటే శాంతిభద్రతల పరిస్థితి ఏ తీరుగా ఉందో అర్థం చేసుకోవచ్చు అని పేర్కొన్నారు.

ఎపి కౌలు రైతుల సంఘం కార్యదర్శి హరిబాబు, కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ప్రగతిశీల మహిళ సంఘం నాయకురాలు ఆసియా, జిఎంపిఎస్ అధ్యక్షులు బి వెంకట్రావు, విజ్ఞాన కేంద్రాల బాధ్యులు స్వరూపరాణి మాట్లాడుతూ వంద రోజుల్లో డ్రగ్స్‌ను నిర్మూలిస్తామని ప్రగల్భాలు పలికిన టిడిపి కూటమి ప్రభుత్వం ఆచరణలో ఘోరంగా విఫలమయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల అండదండలు ఉన్నందునే గంజాయి మాఫియా రెచ్చిపోతోందన్నారు.

ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ సూర్యారావు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు, అశోక్, జనవిజ్ఞాన వేదిక నాయకులు మరళీధర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో సైతం డ్రగ్స్ అందుబాటులో ఉంటున్నాయంటే ఎంతటి భయానక పరిస్థితి నెలకొందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. యువత డ్రగ్స్, గంజాయి వైపు కాకుండా ఆటలు, చదువులు, ఉద్యోగ సాధనపై దృష్టి సారించాలని హితవు పలికారు. కాగా పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలని, ఆయన కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రజానాట్యమండలి కార్యదర్శి అనిల్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీదేవి వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో ప్రజనాట్యమండలి నాయకులు రంగారెడ్డి, అప్పన్న, పట్టణ పౌరసంఘం నాయకులు పున్నారావు, జనవిజ్ఞాన వేదిక నాయకులు శ్రీనివాస్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు సూర్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభావత్, డివైఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు పి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపులకు వడ్డీ లేని రుణాలు

- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డ్వాక్రా గ్రూపుల సభ్యులందరికీ ప్రభుత్వం వెంటనే వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ వి శివనాగరాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు మంజరు చేసిందని, సంఘ సభ్యులు 25 పైసలు వడ్డీ జమ చేస్తే మిగతా మొత్తం ప్రభుత్వమే జమ చేసిందని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం ఎటువంటి మినహాయింపులు ఇవ్వడం లేదన్నారు. వడ్డీ లేని రుణాలు మంజూరు కాకపోవడం వల్ల డ్వాక్రా సంఘాల సభ్యులకు వడ్డీల భారం పడుతుందన్నారు. రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల రుణం పొందిన ఒక్కో గ్రూపుపై రూ.3.4 లక్షల వడ్డీ భారం పడుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎటువంటి షరతులు విధించకుండా, హామీ రహిత బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని, అలాగే అధికారుల వేధింపులు తగ్గించాలని కోరారు.

బంగారం ధర 30 శాతం వరకు పెరగొచ్చు

- వాల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా



న్యూఢిల్లీ : వచ్చే ఏడాది 2026లో బంగారం ధరలు మరో 15-30 శాతం వరకు పెరగొచ్చని వాల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) అంచనా వేసింది. ప్రస్తుత ధరలతో పోల్చితే ఈ స్థాయిలో ప్రియం కావొచ్చని విశ్లేషించింది. తగ్గుతున్న వడ్డీ రాబడులు, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పెట్టుబడిదారులు తమ పెట్టుబడులకు భద్రత కోసం బంగారం వైపు మొగ్గు చూపడం తదితర అంశాలు పసిడి ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని డబ్ల్యుజిసి పేర్కొంది. ముఖ్యంగా గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ ద్వారా పెట్టుబడి డిమాండ్ మరో ప్రధాన కారణమని తెలిపింది. పరిస్థితులు మారి ద్రవ్యోల్బణం ఒత్తిళ్లు పెరిగి, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచవలసి వస్తే దీర్ఘకాలిక రాబడులు, అమెరికా డాలర్ బలం పుంజుకుంటాయి. అటువంటి రిస్క్-ఆన్" పరిస్థితులలో, బంగారం ధరలు ప్రస్తుత స్థాయిల నుండి 5 శాతం నుంచి 20 శాతం వరకు పడిపోయే అవకాశం కూడా ఉందని విశ్లేషించింది. భారతదేశంలో 10 గ్రాముల సుమారు రూ.1,36,000 నుండి రూ.1,37,000కు చేరే అవకాశం ఉందని కొన్ని నివేదికలు అంచనా వేస్తున్నాయి.

77 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసులు ప్రారంభం

- చిత్తూరు నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



చిత్తూరులో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసును ప్రారంభిసున్న డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్య స్థాపనకు తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసులను గురువారం నాడు ఆయన చిత్తూరు నుంచి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ...ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో రాష్ట్రానికి కేంద్రం నుంచి తగిన సహాయం అందుతోందని, అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని తమ ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే డిడి ఆఫీసులు ప్రారంభించామని, వీటిలో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి డిడిఒ, డిఎల్‌పిఒ, ఎపిడి, డ్వామా ఇతర అధికారులు సేవలందిస్తారని తెలిపారు. గ్రామస్థాయిలో 7,244 క్లస్టర్‌లను రద్దు చేసి 13,350 గ్రామ పంచాయతీలను స్వయం పాలన సంస్థలుగా తీర్చిదిద్దామన్నారు. పదివేలు జనాభా దాటిన గ్రామపంచాయతీలకు ఒక గెజిటెడ్ ఆఫీసర్‌ను పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారిగా నియమించామని, ప్రస్తుతం ఉన్న ఐదు గ్రేడ్ల పంచాయతీ సెక్రటరీలను మూడు గ్రేడ్‌లుగా చేస్తూ పంచాయతీ సెక్రటరీ పేరును పంచాయతీ అభివృద్ధి అధికారిగా మార్చామని తెలిపారు. పంచాయతీరాజ్ సంస్థలను పటిష్టం చేయడానికి ఒక ప్రత్యేక ఐటి వింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు.

పంచాయతీరాజ్ శాఖలోనూ డివిజనల్ అధికారి..

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ విఆర్ కృష్ణతేజ మాట్లాడుతూ... మండల స్థాయిలో అభివృద్ధి శాఖకు ఎంపిడిఒలు, రెవెన్యూ శాఖకు తహశీల్దార్లు, పోలీసు శాఖకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు ఉంటారని, వీరికి సంబంధించి రెవెన్యూ, పోలీసు శాఖకు మాత్రమే డివిజనల్ కార్యాలయాలు ఉన్నాయని, ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులతో ఇకపై పంచాయతీరాజ్ శాఖకు కూడా ఒక డివిజనల్ స్థాయి అధికారి ఉంటారని వివరించారు. గ్రూప్-1 ద్వారా ఈ పోస్టులను భర్తీ చేస్తామని, యువతకు ఇది ఒక గొప్ప అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా శ్రీకాకుళం నుంచి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, తెనాలి నుంచి పౌర సరఫరాశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, నెల్లూరు జిల్లా ఆత్మకూరు నుంచి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, పెనుగొండ నుంచి బిసి సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ పాల్గొన్నారు. శ్రీకాకుళం, తెనాలి, పాడేరు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు డిప్యూటీ సిఎంతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు, పూతలపట్టు, తిరుపతి, కోడూరు ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాలో గంజాయి గుప్పు

- యువత, విద్యార్థులు లక్ష్యంగా అమ్మకాలు
- తరుచూ ఈగల్ బృందాల తనిఖీలు
- మెడికల్ షాపుల్లోనూ విక్రయాలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కృష్ణా జిల్లాలో గంజాయి గుప్పుమంటోంది. యువత, విద్యార్థులే లక్ష్యంగా జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. కొందరు అక్రమార్కులు ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని దిగుమతి చేసుకుని ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. పోలీసుశాఖ ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నా పూర్తి స్థాయిలో అరికట్టలేకపోతోంది. అడపాదడపా నిందితులను పట్టుకుని జైలుకు పంపుతున్నా తరచూ ఏదో ప్రాంతంలో దందా వెలుగులోకి వస్తూనే ఉంది. విద్యానగరంగా పేరుపొందిన జిల్లా క్రమక్రమంగా గంజాయి మత్తుకు అడ్డగా మారుతోందని నగరవాసులు చర్చించుకుంటున్నారు.

ఈ ఏడాది మొదట్లోనే గంజాయి మత్తులో ముగ్గురు యువకులు మచిలీపట్నం కాసానిగూడెం ప్రాంతానికి చెందిన బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేశారు. ముగ్గురులో ఒకరు మైనర్ బాలుడు. జిల్లాలో ప్రయివేటు విద్యకు పేరెన్నికగన్న ప్రాంతాలుగా గుడివాడ, గుడ్లవల్లేరు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గుడ్లవల్లేరులో గంజాయి విక్రయిస్తున్న తొమ్మిది మందిని సోమవారం పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 3.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం కలకలం రేపింది. దీనికి కొద్ది రోజుల ముందు గుడివాడ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి 23.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 2024లో నాగాయలంకలో విద్యార్థుల వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని అక్రమార్కులు గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారు. అవనిగడ్డలోని ఓ మెడికల్ షాపులో గంజాయి విక్రయిస్తున్న ఘటన కొద్ది రోజుల క్రితం వెలుగు చూసింది. మెడికల్ షాపు నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా కేంద్రం మచిలీపట్నం ఓజిస్‌పేట, ఉల్లింకిపాలెం, రైల్వే స్టేషన్, మల్కాపట్నం తదితర ప్రాంతాల్లో గంజాయి విక్రయించే వారిపై పలు కేసులు నమోదయ్యాయి.

గంజాయి సరఫరాకు గోడౌన్

పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కొత్త ఆటోనగర్‌లోని గోడౌన్‌పై ఈగల్ బృందాలు ఇటీవల దాడులు చేశాయి. రూ.1.20 కోట్ల విలువైన 243 కిలోల గంజాయిని, ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ సందర్భంగా బహిర్గతమైన విషయాలు గంజాయి ముఠా నెట్‌వర్క్ ఎంత పటిష్టంగా ఉందో తేటతెల్లం చేస్తోంది. అవనిగడ్డ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఒడిశా నుంచి దిగుమతి చేసుకుని ఉత్తరప్రదేశ్‌కు ఎగుమతి చేయడానికి ఈ గోదాములో గంజాయిని నిల్వ చేశాడు.

రెండేళ్లుగా పోలీసుల కళ్లు గప్పి ఈ దందా సాగిస్తున్నట్లు గుర్తించారు. నాలుగు నెలల కాలంలో గంజాయి విక్రయిస్తున్న 21 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.62 వేలు విలువైన 9.501 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అమ్మకాలతో సంబంధాలున్న 407 మందిపై రౌడీ షీట్లు తెరిచారు.

గంజాయి నియంత్రణకు చర్యలు : ఎస్‌పి

గంజాయి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి విక్రయించే వారిపై నిఘా ఉంచుతున్నాం. ఎప్పటికప్పుడు అరెస్టు చేస్తున్నాం. గ్రామాలు, పట్టణాల్లో సంబంధిత పోలీస్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కళాశాలలు, పాఠశాలల్లో 326 ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశాం. మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలను వివరిస్తున్నాం.

రైలు ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి - కలికిరి (అన్నమయ్య జిల్లా)

మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు రైలు పట్టాలపై అలాగే కూర్చుని ఉండటంతో రైలు ఢీకొని మృతిచెందారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా కలికిరి రైల్వేస్టేషన్‌కు సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కదిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ బాషా కథనం మేరకు... చిత్తూరు జిల్లా సోమల మండలం ఇరికిపెంటకు చెందిన గంధం మునికుమార్ (40), అన్నమయ్య జిల్లా కలికిరి మండలం ఆచార్యుల కొత్తపల్లికి చెందిన జి.వీరభద్రయ్య (48) కలిసి బుధవారం రాత్రి కలికిరి రైల్వే స్టేషన్‌లో మందు తాగడానికి వెళ్లారు.

సంబంధిత సిబ్బంది అక్కడ తాగకూడదని పంపించడంతో వారితో గొడవపడ్డారు. రైల్వే అధికారులు మందలించడంతో సమీపంలోని రైలు పట్టాల పైకి వెళ్లి కూర్చుని మద్యం తాగుతుండగా ఓ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టగా ఇద్దరూ మృతి చెందారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరులో స్క్రబ్ టైఫస్ కలకలం

- నెల రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి
- చికిత్స పొందుతున్న ఎనిమిది మంది బాధితులు
- ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నాయి. గత నెల రోజుల వ్యవధిలో ఇద్దరు మహిళలు మృతి చెందగా మరో ఎనిమిది మంది గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ కేసుల కోసంగుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ తెలిపారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని మోరబోయిన జ్యోతి (19) మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ గత నెలలో మరణించారు. వరి పొలంలో పురుగు కుట్టడాన్ని పెద్దగా పట్టించుకోకపోవడంతో కొద్దిరోజులకు ఆమెకు తీవ్ర జ్వరం వచ్చింది. దీంతో ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న అనంతరం జ్వరం తగ్గిపోయింది. ఆ తర్వాత వాంతులు, విరేచనాలు మొదలవ్వడం, పురుగు కుట్టిన చోట దద్దుర్లు వచ్చి పుండు ఏర్పడడం వంటి లక్షణాలతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు.

చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. ఆ తర్వాత మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించారు. ఆమె రక్త నమునాలను పరీక్షించగా స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలతో మరణించినట్లు వెల్లడైంది. రాజుపాలెం మండలం కొత్తూరు పులిచింతల పునరావాస కేంద్రంలో నివసిస్తున్న నాగమ్మ (62) 15 రోజుల క్రితం మరణించారు. ఇదే మండలం కోత్తూరులో స్క్రబ్ టైఫస్ లక్షణాలతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సాలమ్మ (72) చికిత్స పొందుతున్నారు. స్క్రబ్ టైఫస్ అనేది ఒక బ్యాక్టీరియా అని, పొలాలు, గుబురుగా ఉండే పొదలలో నల్లిసైజుల్లో ఎనిమిది కాళ్లతో ఉండే పురుగు కుడితే తీవ్ర జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు వస్తాయని డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ తెలిపారు. ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స పొందకపోతే ఇబ్బందులు వస్తాయని చెప్పారు. బ్యాక్టీరియా కుట్టిన నాలుగు నుంచి పది రోజుల తరువాత వ్యాధి లక్షణాలు బయటపడతాయని, జ్వరం, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, దద్దుర్లు, శరీరం పై నల్లటి మచ్చలు వచ్చే అవకాశం ఉందన్నారు.

విద్యుత్ చార్జీలపై చంద్రబాబు మాటలు హాస్యాస్పదం : షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ చార్జీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. సర్దుబాటు పేరిట ఒకవైపు బిల్లులు పెంచుతూ మరోవైపు ఇక పెంచనే పెంచేది లేదంటూ చెప్పడం విడ్డూరమన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ప్రజలపై రూ.15,485 కోట్లు ఛార్జీల భారం మోపారన్నారు. యూనిట్‌కు అదనంగా రూ.40 పైసలు వసూలు చేస్తూ.. చార్జీలు పెంచననే మాటకు కట్టుబడి ఉన్నానంటూ బాబు ప్రకటన ఈ దశాబ్దపు అతి పెద్ద జోక్‌గా పేర్కొన్నారు. ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంటే ట్రూ అప్ పేరుతో ఇప్పటి వరకూ వసూలు చేసిన రూ.3 వేల కోట్లను ట్రూ డౌన్ రూపంలో మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమలవుతున్న చార్జీల్లో 30 శాతం వెంటనే తగ్గించాలని కోరారు. కాగా విజయవాడలోని భవానీపురంలో సుప్రీం కోర్టు స్టే ఇచ్చినా ఇళ్లను కూల్చివేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు.

సంపాదకీయం


'నిఘా'పై వెనక్కి ...

"మీకు నేను రక్షణ కల్పిస్తాను. మీ నట్టింట్లోనే మకాం పెడతాను." అని ఎవరైనా అంటే ఎలా ఉంటుంది? "మీ ఇంట్లోనే ఉంటాను. ఇదే శాసనం" అని హుకుం జారీ చేస్తే ఎలా ఉంటుంది? కేంద్ర ప్రభుత్వం ఇటీవల సంచార్ సాథీ యాప్ పేరిట తెర మీదికి తెచ్చిన ఏకపక్ష వ్యవహారంలా ఉంటుంది. పౌరుల వ్యక్తిగత గోప్యత మీద నిఘా పెట్టినట్టు ఉంటుంది. రాజ్యాంగం కల్పించిన జీవించే ప్రాథమిక హక్కును హరించినట్టు ఉంటుంది. అందుకనే- చర్చ, సహజమైన విచక్షణా లేకుండా కేంద్రం పౌరుల జేబుల్లోకి చొప్పించాలనుకున్న నిఘా నేత్రపు నిర్వాకంపై పౌర సంస్థలూ, ప్రతిపక్షాలూ పెద్దఎత్తున అభ్యంతరం వ్యక్తం చేశాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నిర్ణయం నుంచి కేంద్రం వెనక్కు తగ్గింది. మోడీ సర్కారు ఆలోచనాధోరణికి, పౌరుల గోప్యతను హరించే నిరంకుశ విధానానికి ఈ ఉదంతం అద్దం పడుతుంది.

నేడు ప్రతి ఒక్కరి రోజువారీ పనుల్లోనూ మొబైల్ ఫోను ఒక కీలకమైన సాధనంగా ఉంది. కార్యాలయంగా, బ్యాంకుగా, వ్యక్తిగత సమాచారాల కేంద్రంగా, రాకపోకల రికార్డుగా, సర్వ సంబంధ వ్యవహారాల వారధిగా వర్థిల్లుతోంది. ఇన్ని పనులకు వేదికగా ఉంది కాబట్టే - సైబర్ నేరగాళ్ళకూ సులభ లక్ష్యంగా మారింది. ఉన్న చోట నుంచే మోసపు ఉచ్చులు విసరటం, వివిధ రూపాల్లో డబ్బును దోచేయడం మామూలై పోయింది. ప్రలోభాలు, బెదిరింపులు, సమాచార తస్కరణలు, సొమ్ము చోరీలూ యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ సరికొత్త మోసాల నుంచి రక్షణ కావాలన్నా, మోసగాళ్ల ఆట కట్టించాలన్నా మళ్లీ సాంకేతిక నైపుణ్యమే దిక్కు. దీనికి తగిన ఉపకరణాల అభివృద్ధి, వాటిపై వినియోగదారుల్లో అవగాహన పెంపు కీలకం. ఆ పనిని ప్రభుత్వ సంస్థలు ఒక పద్ధతి ప్రకారం చేపట్టాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. మన దేశంలో 120 కోట్ల మంది సెల్‌ఫోన్లను వినియోగిస్తుంటే- అందులో మూడోవంతు మందికే ఆధునిక సమాచార వ్యవస్థల మీద కాస్తయినా అవగాహన ఉందని ఒక అధ్యయనంలో తేలింది. ఇలాంటి సందర్భంలో డిజిటల్ లిటరసీని పెంచటంపై ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. కానీ, మోడీ షా ప్రభుత్వం దానికి భిన్నంగా ఏకపక్ష దూకుడుతో పౌరుల వ్యక్తిగత గోప్యతకు ఎసరు పెట్టేలా సంచార్ సాథీని రంగంలోకి తెచ్చింది. కొత్తగా వచ్చే ప్రతి మొబైల్‌లోనూ ఈ యాప్‌ని తప్పనిసరిగా ఎక్కించాలని సెల్ తయారీ కంపెనీలకు ఉత్తర్వులిచ్చింది. రానున్న మూడు నెలల్లో పౌరులు వాడుతున్న ప్రతి సెల్‌ఫోనులోనూ ఈ యాప్‌ను చేర్చాలని హుకుం జారీ చేసింది.

అనేక యాప్‌ల వలె ఇది కూడా ఒకటి కదా? దీనికి అభ్యంతరమెందుకని అనుకోవొచ్చు. వాస్తవానికి ఇది మిగతా అన్నింటిలాంటిది కాదని సాంకేతిక నిపుణుల మాట. అందుకనే ప్రముఖ తయారీ కంపెనీ ఆపిల్ - వినియోగదారుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే ఈ యాప్‌ను తాము ఇన్‌స్టాల్ చేయలేమని తేల్చి చెప్పింది. సంచార్ సాథీని మొబైల్‌లో జోడిస్తే- ఆ ఫోన్‌లోని డేటా మొత్తం దానికి షేర్ చేయటమే అవుతుంది. సంభాషణలు, సమాచారం, వినియోగదారుల కదలికలు, మొబైల్‌లో ఉంచిన సర్వ సమాచారమూ సంబంధిత అధికారుల చేతిలోకి చేరుతుంది. ఇదంతా పౌరులకు రక్షణ కల్పించటానికి, ఎవరు మోసానికి పాల్పడ్డా వెంటనే గుర్తించటానికి అని కేంద్రం సమర్థించుకునే ప్రయత్నం చేసింది. ఇది రక్షణ కాదు; వ్యక్తుల గోప్యత పరిధిలోకి చొచ్చుకురావటం, ప్రతి పౌరుడిని నిఘా నేత్రాల కిందికి తీసుకురావటం అని పౌర సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. కొద్దిమంది నేరగాళ్లను పట్టుకునే పేరుతో కోట్లాదిమందిపై కాపలా పెట్టటం పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయటమే అవుతుందని పేర్కొన్నాయి. గతంలో రాజ్యాంగ విరుద్ధంగా పాలకులు ప్రయోగించిన పెగాసస్ నిఘాలు, టెలిఫోను ట్యాపింగులూ వివాదాస్పదం అయ్యాయి. ప్రశ్నించే పలువురు మేధావుల ల్యాప్‌ట్యాపుల్లోకి, మెయిళ్లలోకి ప్రభుత్వం తాము అనుకున్న సమాచారాన్ని ప్రవేశపెట్టిందన్న ఆరోపణలు ఉన్నాయి. పాలకుల అణచివేతలు, పక్షపాత ధోరణులు అనేక సందర్భాల్లో వెల్లడయ్యాయి కనుకనే సంచార్ సాథీ మీద ఇంత అనుమానం, అభ్యంతరం. కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గటం ప్రజా విజయమే కానీ, అది మరొక దొంగ దారిలో చొచ్చుకురాదని చెప్పవేం. కాబట్టి పాలకుల ప్రతి ప్రజావ్యతిరేక చర్య మీదా పౌరులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాల్సిందే!

మహనీయుల మాట



పరిశుద్ధం కావలసిన అవసరం 'అంటరానివారికి' లేదు. అగ్రవర్ణాలు అని చెప్పకునే వారు మాత్రమే పరిశుద్ధమవ్వాలి. ఏ దుర్లక్షణమూ, మురికి, అనారోగ్యకరమైన పరిసరాలు కూడా కేవలం అంటరానివారికి మాత్రమే ప్రత్యేకించి లేవు.

- గాంధీజీ


MKGandhi

విశ్లేషణ

రూపాయి ఘోర పతనం - పర్యవసానాలు

వి. రాంభూపాల్

మన రూపాయి విలువ ఎన్నడూ లేనంతగా నేడు పతనమైంది. ఒక డాలర్‌కు 90 రూపాయలు చెల్లించాల్సిన స్థితికి విలువను కోల్పోయింది. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు డాలర్‌తో రూపాయి విలువ రూ.62.33 ఉండగా.. ఈ గురువారానికి రూ.90.37 పైసలకు పతనమైంది. ఒకవైపు దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) పెరిగి, ప్రపంచ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం దూసుకుపోతుందని కేంద్ర పాలకులు, వారి అనుచరగణం గగ్గోలు పెడుతుంటే, రూపాయి విలువ మాత్రం వేగంగా దిగజారిపోతున్నది. రూపాయి విలువ పతనంపై ఆర్థిక నిపుణులు, రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన ఎగుమతుల కంటే దిగుమతులు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ డిమాండ్ పెరగడంతో పాటు, మన దేశం నుండి మదుపుదారులు చైనాకు తమ డబ్బును తరలిస్తుండడం, దేశ ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోవడం, మోడీ ప్రభుత్వం అమెరికాతో జరుపుతున్న వాణిజ్య చర్చలు ఇందుకు తక్షణ కారణాలుగా వీరు చెబుతున్నారు. వీటికి తోడు మన దేశ సంపన్నులు తమ సంపదను మన రూపాయలలో కాకుండా అమెరికన్ డాలర్లలో, బంగారంలో ఉంచుకోవడానికి ఎగబడుతున్న ధోరణి ఇటీవల బాగా పెరిగింది.



"రూపాయి విలువ పడిపోతే మనం విదేశాల నుండి దిగుమతి చేసుకునే అన్ని సరుకుల ధరలు పెరిగిపోతాయి. మన దేశ అవసరాల్లో 80 శాతం ముడి చమురును విదేశాల నుండి డాలర్ రూపంలోనే కొనుగోలు చేస్తున్నాము. ఏటా సుమారు 170 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు మనకు విదేశాల నుండి దిగుమతి అవుతుంది. 2022-23లో అప్పటి రూపాయి విలువ రూ.82.60 పైసల ప్రకారం ముడి చమురు దిగుమతి కోసం 12 లక్షల కోట్లు ఖర్చు అయ్యింది. ఇప్పుడు అంతే మొత్తం దిగుమతి చేసుకోవాలంటే సుమారు 2 లక్షల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. కోట్లమంది గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఖర్చు చేస్తున్న సుమారు 48 వేల కోట్లకు నాలుగు రెట్లు ఖర్చు చేయాలి. ఈ భారం పెట్రోలు, డీజల్, గ్యాస్ ప్రత్యక్షంగా, పరోక్షంగా వినియోగిస్తున్న 140 కోట్ల మంది భారతీయలపై పడుతుంది. నిత్యావసర సరకుల ధరలు భారీగా పెరుగుతాయి."

విదేశీ ఇన్వెస్టర్లు ఈ రెండు రోజుల్లో రూ.4,335 కోట్ల షేర్లు అమ్మేశారు. 2025 జనవరి నుండి డిసెంబర్ 2వ తేదీ నాటికి 1.5 లక్షల కోట్ల విలువ చేసే షేర్లను అమ్మి సంపదను తరలించుకుపోయారు. విదేశాల నుండి మన దేశంలోకి బంగారం దిగుమతులు గత ఐదు నెలల్లో మూడు రెట్లు పెరిగాయి. ఇదే సమయంలో ట్రంప్ సుంకాల వల్ల అమెరికాకు మన ఎగుమతులు 28 శాతం పడిపోయాయి. రష్యాకు బదులు అమెరికా నుండి అధిక ధరకు చమురు దిగుమతి చేసుకోవడం పెరిగింది. సంపద సృష్టించేది సంపన్నులే అని నిత్యం జపించే పాలకులు నేడు రూపాయి పతనానికి కారణమవుతున్న ఈ సంపన్నుల గురించి మాట్లాడడంలేదు. ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలవిల కొట్టుకుంటుంటే ప్రధానమంత్రి మాత్రం ప్రధాని కార్యాలయం పేరు మార్పు, ప్రతిపక్షాలపై 'డ్రామా' విమర్శలు చేయడంలో బిజీగా వున్నారు. ఆయనను కీర్తించే వార్తాపత్రికలు, మీడియా సంస్థలు 'మరక కూడా మంచిదే' అన్నట్లుగా రూపాయి పతనం కూడా మంచిదే అని కథనాలు ఇచ్చే సాహసం చేస్తున్నాయి.

స్వంత కరెన్సీ అనేది ఆ దేశ సార్వభౌమత్వానికి ఒక ముఖ్యమైన కొలమానం. అన్ని దేశాలు తమ స్వంత కరెన్సీతో వివిధ దేశాలతో వ్యాపారాలు చేస్తాయి. ప్రపంచ మార్కెట్‌లో ఆయా దేశాలు చేసే సరుకుల ఎగుమతులు, దేశ అంతర్గత ఆర్థిక స్థిరత్వాన్ని బట్టి కరెన్సీ విలువ పెరగడం, తగ్గడం జరుగుతుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత స్థూలంగా అమెరికా డాలర్ ప్రపంచ కరెన్సీగా చెలామణిలోకి వచ్చింది. ఈ ఆధిపత్యాన్ని ఉపయోగించుకుని అనేక దశాబ్దాలుగా అమెరికా ప్రపంచంపై ఆర్థిక, సైనిక పెత్తనం చేయగలిగింది. ఈ పెత్తనాన్ని ప్రతిఘటించేందుకు అనేక దేశాలు ప్రయత్నిస్తూనే వున్నాయి. ఏమైనా ఇప్పటికీ అమెరికా డాలర్ పెద్దన్న స్థానంలోనే వుంది. అమెరికా అధ్యక్షుడు మన ప్రధానికి ప్రియమైన మిత్రుడు. వీరి మైత్రీ కాలంలోనే మన రూపాయి పతనం మరింత తీవ్రమైంది. స్వతంత్రం వచ్చిన తొలి 25 సంవత్సరాల తర్వాత మన రూపాయి డాలర్‌తో ఐదున్నర రూపాయల విలువను కోల్పోగా, ట్రంప్ రెండవసారి అధికారంలోకి వచ్చిన కేవలం ఈ పది నెలల్లో సుమారు ఆరు రూపాయల విలువను కోల్పోయింది.

ట్రంప్ ఒత్తిళ్ళకు లొంగుతున్న కేంద్ర పాలకులు

గత కొన్ని సంవత్సరాలుగా అమెరికా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. పారిశ్రామిక ఉత్పత్తి తగ్గింది. డాలర్‌కు పోటీ పెరిగింది. ఉపాధి అవకాశాలు కోల్పోయిన అమెరికా యువత పెద్ద ఎత్తున నిరసనలు చేస్తున్నారు. రాజకీయ రంగంలో దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సంక్షోభం నుండి అమెరికా కంపెనీలు, వారి పెట్టుబడి బయటపడాలంటే ఇన్నేళ్ళుగా ప్రపంచానికి చెప్పిన సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలకు భిన్నమైన విధానాలను అమలు చేయాలి. అందుకు ట్రంప్‌ను ఎన్నుకున్నారు. ఆయన అసంతృప్తితో వున్న యువతను ఆకర్షించేందుకు అనేక హామీలు, ఆందోళనలను పక్కదారి పట్టించేందుకు జాతి విద్వేషాలను రెచ్చగొట్టే ప్రకటనలతో ఎన్నికల్లో గెలిచాడు. తమ డాలర్ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి, ఖర్చు లేకుండా సంపద పోగేసుకోవడానికి ప్రపంచంపై టారిఫ్ టెర్రరిజం ప్రకటించాడు. కరెన్సీ విలువను తగ్గించుకోవాలని వివిధ దేశాలపై ఒత్తిళ్ల తెస్తున్నాడు. తాను చెప్పినట్లుగా చమురును దిగుమతి చేసుకోవాలంటున్నాడు. అమెరికాలోని విదేశీ ఉద్యోగులను, వీసాదారులను రకరకాలుగా వేధిస్తున్నాడు. వారి నుండి అధిక ఫీజుల వసూళ్లకు సిద్ధమయ్యాడు. అనేక దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నాడు. వీటిని అనేక దేశాలు ప్రతిఘటిస్తున్నాయి. మన దేశ బిజెపి పాలకులు మాత్రం ట్రంప్ విధానాలకు లొంగిపోతున్నారు. మన వ్యవసాయ రంగంలోకి అమెరికా కంపెనీలకు ప్రవేశించేందుకు వాణిజ్య చర్చలు సాగిస్తున్నారు. చౌకగా రష్యా నుండి వస్తున్న చమురు దిగుమతులను నిలిపివేసారు. 'మేక్ ఇన్ ఇండియా', 'మేడ్ ఇన్ ఇండియా' నినాదాలు ఉత్పాదక రంగాన్ని అభివృద్ధి పరచకపోగా గత 19 నెలల కనిష్ట పతనానికి కారణమయ్యారు. బెల్లం వున్నచోటే ఈగలు వుంటాయన్నట్లుగా ఇక్కడ లాభపడిన దేశీయ సంపన్నులు తమ సంపదను తరలించుకపోవడమే కాకుండా పౌరసత్వాన్ని కూడా రద్దు చేసుకుని లాభాలు వచ్చే చోటికి వెళ్ళిపోతున్నారు. ఈ పరిణామాలన్నీ రూపాయి పతనానికి కారణాలయ్యాయి.

ప్రజలపై పెరగనున్న భారాలు

రూపాయి విలువ పడిపోతే మనం విదేశాల నుండి దిగుమతి చేసుకునే అన్ని సరుకుల ధరలు పెరిగిపోతాయి. మన దేశ అవసరాల్లో 80 శాతం ముడి చమురును విదేశాల నుండి డాలర్ రూపంలోనే కొనుగోలు చేస్తున్నాము. ఏటా సుమారు 170 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు మనకు విదేశాల నుండి దిగుమతి అవుతుంది. 2022-23లో అప్పటి రూపాయి విలువ రూ.82.60 పైసల ప్రకారం ముడి చమురు దిగుమతి కోసం 12 లక్షల కోట్లు ఖర్చు అయ్యింది. ఇప్పుడు అంతే మొత్తం దిగుమతి చేసుకోవాలంటే సుమారు 2 లక్షల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. కోట్లమంది గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఖర్చు చేస్తున్న సుమారు 48 వేల కోట్లకు నాలుగు రెట్లు ఖర్చు చేయాలి. ఈ భారం పెట్రోలు, డీజల్, గ్యాస్ ప్రత్యక్షంగా, పరోక్షంగా వినియోగిస్తున్న 140 కోట్ల మంది భారతీయలపై పడుతుంది. నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరుగుతాయి. కోట్లమంది ప్రజలకు పౌష్టికాహారం కాదుకదా కనీస ఆహారం కూడా అందుబాటులో వుండదు. అలాగే విదేశీ ముడిపదార్థాలపై ఆధారపడిన ఆటోమొబైల్, రసాయన పరిశ్రమలు ఎక్కువ డబ్బు చెల్లించి దిగుమతి చేసుకోవలసి వస్తుంది. పెరిగిన ఉత్పత్తి ఖర్చుకు తగ్గట్టుగా అమ్మకాలు వుండకపోవడంతో పరిశ్రమలు మూత పడతాయి. నిరుద్యోగం పెరుగుతుంది. మన ఎగుమతులు మరింతగా తగ్గి దిగుమతి ఖర్చులు పెరుగుతాయి. విదేశాలకు చెల్లించాల్సిన అప్పుల భారం పెరిగిపోతుంది. విదేశీ వాణిజ్య లోటును మరింతగా పెంచుతాయి. దీన్ని భర్తీ చేసుకోవడానికి షరతులతో కూడిన అప్పుల కోసం ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ దగ్గరకు క్యూ కట్టాల్సి వస్తుంది.

రూపాయి బలపడాలంటే!

విదేశీ, స్వదేశీ కార్పొరేట్ అనుకూల ప్రపంచీకరణ విధానాలను విడనాడాలి. దేశాభివృద్ధికి తోడ్పడే వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. దేశంలో అత్యధికమంది ఆధారపడిన వ్యవసాయ రంగం గత కొన్ని దశాబ్దాలుగా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించాలి. ఇటీవల అన్ని రకాల పంటలు గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధర ప్రకటించడమే కాకుండా అమలు చేసే బాధ్యత తీసుకోవాలి. ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వ పరిశ్రమల్లో ఉత్పత్తి చేసి సరసమైన ధరలకు రైతులకు అందుబాటులో వుంచాలి. సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. తద్వారా గ్రామీణ ప్రజల కొనుగోలుశక్తి పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరమైన పునాదిని ఏర్పాటు చేస్తుంది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అనేక రాయితీలు ఇచ్చి ఉత్పత్తులను పెంచడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విద్య, వైద్యంతో పాటు అనేక సేవా రంగాలను ప్రభుత్వం నిర్వహించాలి. కార్పొరేట్ కంపెనీలు, సంపన్నుల కోసం ట్రంప్ ముందు సాగిలపడుతున్న ప్రస్తుత పాలకులు ఈ విధానాలను అమలు చేయలేరు. కావున రూపాయి బలపడాలన్నా, విధానాలు మారాలన్నా పాలకులే మారాలి.

★

నివాళి

అంబేద్కర్ దార్శనిక దృష్టి రాజ్యాంగ సృష్టి



ఆత్మగౌరవం, విద్య ద్వారానే నైతికత, హేతుబద్ధత కలుగుతాయని, ఆ జ్ఞానమే మనిషిని వివేకవంతంగా మలుస్తుందన్న వ్యక్తి డా॥బి.ఆర్.అంబేద్కర్. నాటికి డెబ్బై శాతం భారతీయులు వ్యవసాయంపై ఆధారపడుతున్నారని, అటువంటి సేద్యం ద్వారా సమకూరే ఆదాయం ప్రజా జీవనానికి సరిపోవడం లేదని..జీవన ప్రమాణాలను పెంపొందించుకోవడానికి దేశంలో సమృద్ధిగా ఉన్న నీటి వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరిగితే తద్వారా పారిశ్రామిక అభివృద్ధి దిశగా దేశప్రగతి సాధ్యపడుతుందన్నారు అంబేద్కర్.

స్త్రీ విముక్తి ద్వారానే సమాజాన్ని సంస్కరించగలమని, తాను నమ్మిన సిద్ధాంతం కోసం మంత్రి పదవిని తృణ ప్రాయంగా ఎంచి, పార్లమెంటు నుంచి బయటకు వచ్చారు. తన జీవితపు అన్ని దశల్లోనూ అవమానాలను ఎదుర్కొని, తన వాళ్ల కోసం అహర్నిశలు కష్టపడి రాజ్యాంగంలో హక్కులు కల్పించి, వారికి భరోసా ఇచ్చారు.

మా ఆవాసాలు మురికి వాడలు. మాకు బడి చదువులు నిషేధం. గౌరవప్రదమైన జీవనానికి మేము పనికిరాము. మేము తీసుకునే ఆహారంలో, తాగే నీటిలోనూ పోషకాలుండవు. నాణ్యమైన చదువు అందాలంటే పౌష్టికాహారం కూడా శరీరానికి కావాలి కాబట్టి, నా జాతి ప్రజలు చదువు కోవడానికి వసతి గృహాలు అవసరమని మొట్టమొదటి హాస్టల్ కాన్సెప్ట్ తెచ్చారు. ఒక సమాజ పురోగతిని ఆ సమాజంలోని స్త్రీ అభివృద్ధిని బట్టి నిర్ణయిస్తానని చెప్పారు.

అణగారిన కులంలో పుట్టడం నేను చేసిన తప్పు కాదు. నేను చెయ్యని తప్పుకి నన్నెందుకు వివక్షకు గురిచేస్తున్నారంటూ...వివక్ష అనే విష వృక్షాన్ని కూకటి వేళ్లతో పెకలించి సమానత్వాన్ని నెలకొల్పేందుకు భారత రాజ్యాంగాన్ని అందించారు.

సమాన అవకాశాలు, సమాన విలువలు, సమాన గౌరవం, సమాన హోదా కలిగిన సమూహాలుగా జీవించడమే ప్రజాస్వామ్యమని నిర్వచించారు. సమానత్వం కోసం అన్ని స్థాయిలలోనూ ప్రతిఘటన అవసరమని, నిరంతరం పోరాడి సమానత సూత్రానికి చట్టబద్ధత (ఆర్టికల్ 14) కల్పించారు.

ఒక మనిషి-ఒక ఓటు సాధించాం కానీ, సాధించాల్సింది 'ఒక మనిషి ఒక విలువ' అని, ఈ ఆదర్శం రాజ్యాంగం ద్వారా మాత్రమే సాధ్యమన్నారు.

సమాజంలో ముఖ్యంగా మనిషికి కావాల్సింది స్వేచ్ఛగా జీవించే హక్కు, తన అభిప్రాయాన్ని నిర్భయంగా వ్యక్తపరిచే స్వేచ్ఛ, ప్రజాస్వామ్యానికి మూలమైన ప్రజాభిప్రాయాన్ని భారత పౌరుని ప్రాథమిక కర్తవ్యంగా, ప్రాథమిక హక్కులుగా దేశ ప్రజలందరికీ అందించారు. అటువంటి రాజ్యాంగ హక్కుల వల్ల చాయ్‌వాలా ప్రధాని అయ్యాడంటారు. ఒక సామాన్యమైన వ్యక్తి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారంటారు. ఇవన్నీ వాస్తవాలే కాని, చదువు కోసం బడి ఆవరణానికి ఆవల, తరగతికి దూరంగా మెట్ల మీద కూర్చున్న వ్యక్తి ఈ దేశానికి అత్యున్నత రాజ్యాంగాన్ని అందించారన్న విషయం ఇవాళ దేశంలో ఎంత మందికి తెలుసు?

ఎక్కడ పుట్టామన్నది కాదు? పుట్టాక ఎవరి పక్షాన వున్నామన్నదే ముఖ్యం. అదే జీవితానికి పరమార్థం అంటారు అంబేద్కర్. దేశ ప్రజల్లో సోదరభావం కొరవడిందని, పెంపొందించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని అంబేద్కర్ తరచుగా చెబుతుండేవారు.

ఏ దేశ ప్రజలనైనా కాపాడేది ఆ దేశ న్యాయస్థానాలు కాదు, మిలిటరీ సిబ్బంది కాదు, మత పెద్దలు అసలే కాదు, చైతన్యపూరితులైన ప్రజలు మాత్రమే. సలక్షణమైన, సుశిక్షితులైన నైతిక జీవన పునాదుల మీద తీర్చిదిద్దబడిన ప్రజలే దేశానికి రక్షా కవచంగా ఉంటారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలను క్రమబద్ధంగా అధ్యయనం చేస్తూ సమసమాజ నిర్మాణానికి, పరిరక్షణకి చోదక శక్తులుగా నిలిచే నవతరానికి రాజ్యాంగం వజ్రాయుధమే.

(డిసెంబర్ 6న డా॥బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి)

- పి. సాల్మన్ రాజు,
విద్యుత్ యస్.ఇ, ఏలూరు, సెల్ : 9550338387


అవీ ఇవీ

డ్రామాకు బ్రేక్..భజనలకు షాక్

పీపీ

పార్లమెంటు సమావేశాల ప్రారంభంలోనే ప్రధానమంత్రి మోడీ సుభాషితాలు వినిపించారు. దాంతోపాటే వార్నింగ్‌లూ ఇచ్చారు. జోకులు పేల్చారు. అన్నిటిలోనూ తాండవించింది అహంభావమే. ప్రతిపక్షాలు పార్లమెంటులో డ్రామాలు ఆడవద్దని దానికి, వేరే స్థలాలు వున్నాయని ఆయన చెప్పిన డైలాగ్‌కు వందిమాగధులు ఊగిపోయారు. బిజెపి యేతర రాష్ట్రాలలో ఓటమి తట్టుకోలేక ప్రతిపక్షాలు ఇలా చేస్తున్నాయని కూడా ఆయన అపహాస్యం చేశారు. కావాలంటే తానే వాటికి టిప్స్ అంటే టెక్నిక్స్ చెబుతాననడం మోడీ దాడికి పరాకాష్ట. ఎవరైనా సరే ఇక తమకు ఎదురు లేదనుకున్నప్పుడు ఇలాగే నోరు పారేసుకుంటారు. పురాణాల్లో గర్వభంగం సీన్లు అందుకే వుంటాయి. మోడీ మాట్లాడ్డమే కాదు. ఉభయ సభల్లో 'సర్'తో సహా కీలకాంశాలపై చర్చకు మొండిగా నిరాకరించారు కూడా. ప్రతిపక్షాలు 'ఓట్ చోరీ' పేరిట బయట గొడవ చేయవలసిందేగానీ సభలో ఏమీ చెల్లబోదని మోడీ భక్తబృందం ఇంకా చెలరేగింది. నిజానికి 2024 ఎన్నికల్లోనే మోడీ మెజార్టీ కోల్పోయారనే పరమ సత్యంలోనే చాలా సంకేతాలున్నాయి. అయితే మోడియా అనే మీడియా వాటిని గట్టిగా చెప్పదు. ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఊపు తగ్గిన మోడీజీ ఏకఛత్రాధిపత్యం ఎలా సాగుతుంది? పార్లమెంటు సమావేశాల రెండవ రోజునే 'సర్'పై చర్చకు తలవంచక తప్పలేదు. అయితే దాన్ని ఎన్నికల సంస్కరణలలో కలిపి చర్చకు పెడతామని పరువు కాపాడుకునే తంటాలు పడుతున్నారు. ఇక 'సంచార్ సాథీ' పేరిట అందరి మొబైల్స్‌లో నేరుగా నిఘా పరికరం వంటిది పెట్టడానికి జారీ చేసిన హుకుం పైనా తోక ముడిచారు. కనుక మోడీకి తిరుగే లేదని పొగిడేవాళ్లు ఒకింత నిజాలసు గమనిస్తే సేఫ్ కదా.

"ఉభయ సభల్లో 'సర్'తో సహా కీలకాంశాలపై చర్చకు మొండిగా నిరాకరించారు కూడా. ప్రతిపక్షాలు 'ఓట్ చోరీ' పేరిట బయట గొడవ చేయవలసిందేగానీ సభలో ఏమీ చెల్లబోదని మోడీ భక్తబృందం ఇంకా చెలరేగింది. నిజానికి 2024 ఎన్నికల్లోనే మోడీ మెజార్టీ కోల్పోయారనే పరమ సత్యంలోనే చాలా సంకేతాలున్నాయి. అయితే మోడియా అనే మీడియా వాటిని గట్టిగా చెప్పదు. ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఊపు తగ్గిన మోడీజీ ఏకఛత్రాధిపత్యం ఎలా సాగుతుంది? పార్లమెంటు సమావేశాల రెండవ రోజునే 'సర్'పై చర్చకు తలవంచక తప్పలేదు. అయితే దాన్ని ఎన్నికల సంస్కరణలలో కలిపి చర్చకు పెడతామని పరువు కాపాడుకునే తంటాలు పడుతున్నారు. ఇక 'సంచార్ సాథీ' పేరిట అందరి మొబైల్స్‌లో నేరుగా నిఘా పరికరం వంటిది పెట్టడానికి జారీ చేసిన హుకుం పైనా తోక ముడిచారు. కనుక మోడీకి తిరుగే లేదని పొగిడేవాళ్లు ఒకింత నిజాలసు గమనిస్తే సేఫ్ కదా."



సనాతన సర్కస్.. సేనాని దిష్టి స్టోరీతో

తెలుగు రాష్ట్రాల్లో బిజెపి జనసేన నేతల సనాతన సర్కస్‌లు నవ్వు తెప్పిస్తున్నా ఆందోళన కూడా కలిగిస్తున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న చాలా సమస్యలకు కారణమే కేంద్రంలోని మోడీ సర్కారు గనక వాటిని వారు మాట్లాడలేరు. కనక దేశ సమస్యలను పక్కనపెట్టి దేవుడి చుట్టూ వివాదాలు తిప్పుతుంటారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను అవమానించారని ఇప్పుడు బిజెపి కేంద్ర మంత్రులతో సహా గగ్గోలు మొదలెట్టారు. కాంగ్రెస్‌లో తగాదాల గురించి చెబుతూ హిందూ మతంలోనే ఎన్ని తేడాలున్నాయి. బ్రహ్మచారులు, బహు భార్యత్వం నెరిపిన దేవుళ్లు, తాగేవారు అందరూ వున్నారు కదా అని ఆయన అన్నారు. నిజానికి సురాపానం అంటే సారాయి వంటిదే. ఆంజనేయుడు, శ్రీకృష్ణుడూ కూడా దేవుళ్లే కదా. ఈ వైవిధ్యం గురించి చెబితే కినుక ఎందుకు? మేమే అధికారంలోకి రాబోతున్నామని చెప్పి మొన్న జూబ్లీ ఎన్నికల్లో సోదిలోకి లేకుండా పోయిన బిజెపి...రేవంత్ మాటలపై మతాలను రెచ్చగొట్టాలని బయలుదేరింది. ఇక వారి జూనియర్ పార్టనర్, సనాతన సేనాని పవన్ కల్యాణ్ ఇందుకు దిష్టి చుక్క పెడుతున్నారు. కోనసీమలో కొబ్బరి సమస్యలకు నరదృష్టి (దిష్టి) కారణమని ప్రవచించారు. విభజనకే కారణమైందన్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో కెసిఆర్ వంటివారు కోనసీమను తరచూ ప్రస్తావించిన మాట నిజమే గానీ దాని వల్ల ఏదో జరిగిందన్నట్టు మాట్లాడ్డం అశాస్త్రీయే గాక బాధ్యతా రాహిత్యం కూడా. వెంటనే అవతలివారు అందిపుచ్చుకుంటారు కదా. మీ దిష్టే హైదరాబాద్‌కు తగిలిందన్నట్టు బిఆర్‌ఎస్ మాజీ మంత్రులు మాట్లాడారు. మీరు వెంటనే మీ మాటలు ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పకపోతే సినిమాలు ఆడనివ్వం అంటూ ప్రస్తుత మంత్రులు హెచ్చరికలకు దిగారు. అచ్చంగా ఆ మాట అనలేదని ఏదో మాఫీ చేసేందుకు జనసేన ప్రకటన చేసింది గానీ నేరుగా ఉపసంహరించుకోవడం మంచిది కదా...పైగా ఈ మూఢ నమ్మకాల గోల దేనికి?

మహాకవీ మన్నించవా!

మొన్ననే గురజాడ అప్పారావు 110 వర్థంతి ఘనంగా జరిపి ఆయన మహత్తర సందేశం గుర్తు చేసుకున్నాం. ఆ సందర్భంలోనే ఆయన నివసించిన గృహాన్ని మరింత పటిష్టం చేసి దర్శనీయంగా ఉత్తేజకరంగా తీర్చిదిద్దాలనీ, ఆయన వారసులకు ప్రభుత్వం చేసిన వాగ్దానం నెరవేర్చాలని సూచించాం. గతంలో ఆయన ఇంటిలో దొంగతనం జరిగిందనీ ఈ సందర్భంగా స్థానికులు గుర్తు చేశారు. జనవిజ్ఞాన వేదిక, సాహితీ స్రవంతి మరో వంద ప్రజాసంఘాలు కలిపి నిర్వహించిన ఈ కార్యక్రమం గురజాడ పేరిట సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించింది. వీటిపై కార్యాచరణ ప్రణాళిక రూపొందుతున్నది. ఇంతలోనే అంటే ఆయన వర్థంతి సభల మరుసటి రోజునే పరిస్థితికి అద్దం పట్టే మరో ఘటన జరిగింది. గురజాడ గృహంపై మళ్లీ దాడి జరిగింది. దుండగులు ఆయన ఇంటి బాత్‌రూం తలుపులు విరగ్గొట్టారు. కొన్ని వస్తువులు కూడా మాయమైనట్టు గుర్తించారు. ఇలాంటి దాడి, దొంగతనం ఇది మూడోసారి. ఇప్పటికీ గురజాడ బోధించిన ఆధునికత మింగుడు పడని కొన్ని వర్గాలు, అరాచక శక్తులు ఆయన వారసత్వంపై దాడికి దిగుతున్నారా అనే సందేహం కలక్క మానదు. సత్యసాయిబాబా శతజయంతికి రాష్ట్రపతి నుంచి రాష్ట్ర పాలకుల వరకూ వెళుతున్నారు గాని గురజాడ అడుగుజాడలు మాత్రం విస్మరిస్తున్నారు. మొన్ననే నిర్ణయించుకున్నట్టు దీనిపై తప్పక పోరాడతామని సాంస్కృతిక కార్యకర్తలు చెబుతున్నారు.

★

ఐఎంఎఫ్ నివేదికతో బయటపడిన మోడీ ప్రభుత్వ మోసం : ఎఐకెఎస్

న్యూఢిల్లీ : అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) తాజా వార్షిక సమీక్ష నివేదికతో కేంద్రంలోని మోడీ ప్రభుత్వ మోసం బయటపడిందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) పేర్కొంది. ఐఎంఎఫ్ తన నివేదికలో భారత్‌కు చెందిన జాతీయ అకౌంట్స్ గణాంకాలకు 'సి' గ్రేడ్ ఇచ్చిందని, ఈ గ్రేడ్ ఐఎంఎఫ్ ర్యాంకింగ్ వ్యవస్థలోని రెండో తక్కువ ర్యాంక్ అని ఎఐకెఎస్ తెలిపింది. అలాగే, దేశ అకౌంట్స్ గణాంకాల యొక్క సమాచార మేజర్‌మెంట్‌లో 'మెథడాలజికల్ వీక్‌నెస్', 'గమనీయమైన వ్యత్యాసాలు' ఉన్నాయని ఐఎంఎఫ్ తన నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించిందని ఎఐకెఎస్ తెలిపింది. ఐఎంఎఫ్ ఇచ్చిన సి గ్రేడ్ దేశ అకౌంట్స్ గణాంకాలను రూపొందించిన జిడిపి, (గ్రాస్ వాల్యూ ఆడెడ్ (జివిఎ)) మొదలైన వాటికి వర్తిస్తుందని ఎఐకెఎస్ తెలిపింది. ఈ మేరకు ఎఐకెఎస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. మోడీ ప్రభుత్వం జిడిపి, ఇతర అంశాల్లో దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని రైతు, కార్మిక, ప్రగతిశీల సంఘాలు కొంతకాలం నుంచి చెబుతున్న విషయాన్ని ఐఎంఎఫ్ ఈ సందర్భంగా గుర్తు చేసింది. ఆర్‌ఎస్ఎస్-బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సమాచారాన్ని మానిప్యులేషన్ చేయడంలోనూ, శాస్త్రీయ సంస్థలను అణగదొక్కడంలోనూ మంచి రికార్డు కలిగి ఉందని ఎఐకెఎస్ విమర్శించింది. ఐఎంఎఫ్ కూడా గతంలో మోడీ ప్రభుత్వ మోసపూరిత విధానాలనుకు సహకరించిందని, అలాంటి ఐఎంఎఫ్ కూడా మోడీ ప్రభుత్వం జిడిపి అంశంలో దేశ ప్రజలను మోసం చేస్తుందని ప్రకటించడం గమనించాల్సిన విషయమని తెలిపింది. వాస్తవానికి జిడిపి సమాచారాన్ని ఎన్‌డిఎ ప్రభుత్వం తారుమారు చేసిందరనే అభిప్రాయి సమాజంలో ఉందని ఎఐకెఎస్ పేర్కొంది. సమాచారం తారుమారు విషయంలో వస్తున్న ఆరోపణలపై కేంద్రం నిజాలను వెల్లడించాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది.

అరటి రైతులను తక్షణమే ఆదుకోవాలి

- వైసిపి ఎంపి మిథున్ రెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో అరటి రైతులను తక్షణమే ఆదుకోవాలని వైసిపి ఎంపి మిథున్ రెడ్డి కోరారు. గురువారం లోక్‌సభలో జీర్ అవర్‌లో ఆయన మాట్లాడుతూ ఎపిలో అరటి రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, వారిని వెంటనే ఆదుకోవాలని కోరారు. ప్రస్తుత కిలో అరటి ధరతో ఒక బిస్కెట్, అగ్గిపెట్టి కూడా రాదని పేర్కొన్నారు. అరటి కోత ధర కూడా కనీసం రైతు దక్కడం లేదని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం రైతులకు ఉచితంగా పంటల బీమా ఇవ్వాలని, ఇన్‌పుట్ సబ్సిడి ఇవ్వాలని, అరటి పండ్ల సరఫరాకు ఎక్కువ రైళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అరటి రైతులకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అరటి పంట వేసే ప్రాంతాల్లో కేంద్ర బృందం సందర్శించి, అరటి పంట సంక్షోభం, రైతుల కష్టాలనుక స్వయంగా చూడాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

తీవ్ర సంక్షోభంలో అరటి పంట టిడిపి ఎంపి జి.లక్ష్మీనారాయణ

రాష్ట్రంలో అరటి పంట తీవ్ర సంక్షోభంలో ఉందని టిడిపి ఎంపి జి.లక్ష్మీనారాయణ అన్నారు. లోక్‌సభలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో 40 వేల హెక్టార్లపైన అరటి పంట సాగులో ఉందని తెలిపారు. ఈ సీజన్‌లో అరటి ధరలు పూర్తిగా పతనం అయ్యాయని, కనీసం రైతులకు కోతకు అయ్యే ఖర్చులు కూడా రావటం లేదని అన్నారు. రైతులను ప్రతి ఏడాది తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టే సమస్యలు ఉన్నాయని, నాణ్యమైన అరటిని పండిస్తున్న తమ రైతులకు జాతీయ మార్కెట్‌లో పోటీపడే శక్తి లేదని అన్నారు. దీనికి కారణం అరటి జాతీయ మార్కెట్‌లోకి తీసుకొచ్చే రైల్వే సదుపాయం అంతంత మాత్రంగానే ఉండటమేనని అన్నారు. ఉన్న గూడ్స్ రైళ్లకు ఖాళీ (ఎమ్మిటీ) ఛార్జీలు వేయడంతో రైతులు అదనపు భారం మోస్తున్నారని తెలిపారు. రవాణా భారం తగ్గించాలని, ఈ సీజన్‌లో నష్టాలను పూరించేందుకు ఆర్థిక సాయం చేయాలని కోరారు.

ఎస్ఐఆర్ ఎఫెక్ట్

తమిళనాడులో 85 లక్షల ఓటర్లు గల్లంతు

చెన్నై : వివాదాస్పద ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తమిళనాడులో పెద్ద ఎత్తున ఓటర్ల తొలగింపునకు కారణమవుతుందా? ఇప్పటి వెల్లడించిన సంఖ్యలు చూస్తే అవుననే సమాధానం వస్తుంది. ఇప్పటి వరకు 84.91 లక్షల ఫారాలను సేకరించలేని కారణంగా ఈ పేర్లు డ్రాఫ్ట్ రోల్స్‌లో కనిపించవని తెలుస్తుంది. సర్ ఎన్యుమరేషన్ ప్రక్రియకు ఇంకా ఎనిమిది రోజులే ఉన్నాయి. ఇంత తక్కువ సమయంలో భారీ సంఖ్యలో ఫారాల సేకరణ ఎలా సాధ్యమని బిఎల్ఓలు తలలు పట్టుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 84.91 లక్షల ఫారాలు సేకరించలేనికిగా నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 6.41 కోట్ల ఓటర్లలో ఇది 13.24 శాతం. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం... శాశ్వతంగా షిఫ్ట్ అయినవారు 44.22 లక్షలున్నారు . అలాగే మరణించినట్లు నమోదైనవారి సంఖ్య 26.18 లక్షలు, ఇంట్లో లేనివారు (ఆబ్సెంట్) 10.73 లక్షల మంది, డూప్లికేట్ లేదా ఇప్పటికే నమోదైనవారి సంఖ్య 3.5 లక్షలు ఉన్నారని, ఈ జాబితాను బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ)కు ఇచ్చి పారదర్శకతను నిర్ధారిస్తామని ఎన్నికల అధికారి కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. అయితే డిసెంబర్ 11లోగా ఫీల్డ్ ఎన్యుమరేషన్ పూర్తయిన తర్వాతే తుది జాబితా ఖరారుకానుంది. తమిళనాడులో జిల్లాల వారీగా చూస్తే, చెన్నైలో అన్‌కలెక్టబుల్ ఫారాలు అత్యధికంగా 31.78 శాతం (12.73 లక్షలు) ఉన్నాయి. అంటే రాష్ట్ర రాజధాని నగరంలో దాదాపు ప్రతి ముగ్గురు ఓటర్లలో ఒకరి నుంచి ఫారాల సేకరణ జరగలేదు. చెన్నై తర్వాతి స్థానంలో చెంగల్పట్టు ఉంది. ఇక్కడ 20.7 శాతం (5.78 లక్షలు) మంది వివరాలు ఇంకా అందలేదు. అరియలూరులో అన్‌కలెక్టబుల్ ఫారాలు 4.3 శాతం (23వేలు)గా ఉన్నాయి. కాగా డిసెంబర్ 16న డ్రాఫ్ట్ జాబితా తర్వాత కూడా జనవరి వరకు ఓటర్లు ఫారాలు దాఖలు చేసుకోవచ్చని సీఈఓ కార్యాలయం తెలిపింది.



3 వేల మందికి పైగా భారతీయులపై అమెరికా బహిష్కరణ వేటు

- రాజ్యసభలో మంత్రి జైశంకర్ వెల్లడి



న్యూఢిల్లీ : భారతీయులపై అమెరికా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత భారతీయులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికే వేలాది మందిని స్వదేశానికి పంపించిన ట్రంప్ సర్కార్ ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నే ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 3,258 మంది భారతీయులను అమెరికా నుండి పంపించేసిందని కేంద్రం వెల్లడించింది. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ విషయాన్ని వెల్లడించారు. '2009 నుంచి ఇప్పటి వరకు 18,822 మంది భారతీయుల్ని అమెరికా బహిష్కరించింది. 2023లో 617 మందిని, 2024లో 1,368 మందిని, 2025లో 3,258 మంది భారతీయులను అమెరికా బహిష్కరించినట్లు' వివరించారు. 'ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 3,258 మంది భారతీయులను అమెరికా వెనక్కి పంపింది. వీరిలో 2,032 మందిని అంటే సుమారు 62.3 శాతం మందిని సాధారణ వాణిజ్య విమానాల ద్వారా స్వదేశానికి పంపింది. మిగిలిన 1,226 మందిని (37.6 శాతం) యుఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించే చార్టర్ విమానాల్లో భారత్‌కు తరలించింది' అని జైశంకర్ వెల్లడించారు. గత ఐదేళ్లలో 62 మంది భారతీయ విద్యార్థులు అమెరికా వెళ్లకుండా ఇమ్మిగ్రేషన్ అధికారులు నిరాకరించారు. ఈ విషయాన్ని రాజ్యసభలో విదేశాంగ సహా మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. అలాగే 11 మంది విద్యార్థులను కిర్గిజ్‌స్తాన్‌కు వెళ్లకుండా నిరాకరించారు. అయితే గత ఐదేళ్లలో ఇంగ్లండ్ 170 మంది, ఆస్ట్రేలియా 114 మంది, రష్యా 82 మంది, అమెరికా 45 మంది, ఉక్రెయిన్ 13 మంది, ఫిన్‌లాండ్ ఐదుగురు భారతీయ విద్యార్థులకు అనుమతి నిరాకరించినట్లు మంత్రి చెప్పారు.

షాంఘై నుంచి బ్యూనస్ ఎయిర్స్‌కు...

- ఇరవై వేల కిలోమీటర్లు ప్రయాణించనున్న చైనా ఎంయూ745 విమానం



బీజింగ్ : చైనా ఎయిర్‌లైన్ విమానం గురువారం ఉదయం ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘ ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. గ్లోబల్ టైమ్స్ అందించిన వివరాల ప్రకారం...చైనా ఈస్ట్రన్ ఎయిర్‌లైన్స్ విమానం ఎంయూ745 షాంఘై పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ వైపు బయలుదేరింది. చివరికి అది అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్ చేరుకుంటుంది. సుమారు ఇరవై వేల కిలోమీటర్లు ప్రయాణించే ఈ విమానం తూర్పు, పశ్చిమ గోళార్ధాలతో పాటు ఉత్తర, దక్షిణ గోళార్ధాలను కూడా దాటుతుంది. ప్రపంచంలో ఒక వైపు (వన్ వే) సుదీర్ఘ ప్రయాణం సాగించే విమానంగా ఇది రికార్డు సృష్టించబోతోంది. దీని ద్వారా చైనా, దక్షిణ అమెరికా మధ్య ప్రయాణ కాలం నాలుగు గంటలకు పైగా తగ్గుతుంది. వారానికి రెండు సార్లు ప్రయాణించేలా దీని షెడ్యూలును రూపొందించారు.

షాంఘై నుంచి దక్షిణ అమెరికాలోని ప్రధాన నగరాలకు ఇప్పటి వరకూ నేరుగా విమాన సర్వీసులు లేవు. ఆ లోటును ఈ విమానం భర్తీ చేస్తుంది. విమానం తన ప్రయాణంలో మూడు ఖండాలను అనుసంధానించడం విశేషం. ఈ కొత్త మార్గం దక్షిణ కారిడార్‌ను ఉపయోగించుకొని మధ్యలో ఆక్లాండ్‌లో ఆగుతుంది. మొత్తంమీద ఈ మార్గం ప్రయాణ సమయాన్ని 30 నుంచి 25 గంటలకు తగ్గిస్తుంది.

తెలంగాణలో 395 సర్పంచి పదవులు ఏకగ్రీవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఈ నెల 11న జరగనున్న తొలి దశ సర్పంచి ఎన్నికల తుదిపోరులో సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు మొత్తం 81,020 మంది బరిలో నిలిచారు. ఎన్నికల సంఘం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మొత్తం 4,236 గ్రామాల్లో తొలి దశ పోలింగ్ జరగనుండగా 395 గ్రామాల్లోని సర్పంచి పదవులు ఏకగ్రీవమయ్యాయి. సర్పంచి పదవులకు నామినేషన్లు దాఖలు చేసినవారిలో 8035 మంది తమ పత్రాలను ఉపసంహరించుకున్నారు. అలాగే నామినేషన్లు దాఖలు కాని గ్రామాలు ఐదు ఉన్నాయి. మిగతా 3836 గ్రామాల్లోని సర్పంచి పదవులకు 13,127 మంది పోటీ పడుతున్నారు. అంటే ఒక్కో సర్పంచి పదవికి 3.42 మంది చొప్పున తుది పోటీలో నిలిచారు. ఆయా గ్రామాల్లో 37,440 వార్డులు ఉన్నాయి. ఇందులో 149 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

బంగ్లాదేశ్‌లో 4.1 తీవ్రతతో భూకంపం

ఢాకా : బంగ్లాదేశ్‌లో గురువారం ఉదయం 4.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో రాజధాని ఢాకా, సమీప జిల్లాల్లో ప్రకంపనలు వచ్చాయి. ఆస్థి నష్టం లేదా ప్రాణనష్టం సంభవించినట్లు ఎలాంటి వార్తలు రాలేదు. బంగ్లాదేశ్ కాలమానం ప్రకారం ఉదయం 6:14 గంటలకు ఈ భూకంపం సంభవించిందని, నర్సింగ్డి పట్టణానికి సమీపంలో 30 కి.మీ లోతును భూకంపం కేంద్రం ఉందని స్థానిక మీడియా సంస్థలు తెలిపాయి. భూకంప కేంద్రం లోతు తక్కువగా ఉండటం, తీవ్రత తక్కువగా ఉండటంతో స్వల్పంగానే ప్రకంపనలు సంభవించాయని తెలిపాయి.



రహదారిపై ఆందోళన చేస్తున్న పత్తి రైతులు, సిపిఎం నాయకులు

నిబంధనలతో పత్తి రైతుకు నష్టం

- మద్దతు ధరతో పంటను కొనుగోలు చేయాలి: సిపిఎం

ప్రజాశక్తి-గుత్తి

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనలను సడలించి రైతులు సాగు చేసిన పత్తిని ప్రభుత్వం గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. నిబంధనలను సడలించి రైతులకు మేలుచేసేలా పత్తి పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నాడు పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఎదురుగా రహదారిపై సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 72 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారన్నారు. ఎకరాకు రూ.50 వేలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టి రైతులు పంటలను సాగు చేస్తే అకాల వర్షాలతో దిగుబడులు రాక నష్టం వాటిల్లిందన్నారు. ఎకరాకు పది నుంచి 14 క్వింటాలు దిగుబడి రావాల్సి ఉంటే నాలుగు క్వింటాళ్లకు మించి పత్తి దిగుబడి రాలేదన్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.8,110 మద్దతు ధర ప్రకటించి పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పి జిల్లాలో గుత్తి, తాడిపత్రిలో మాత్రమే ఏర్పాటు చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కపాస్ కిసాన్ యాప్, సీఎం యాప్‌లలో స్లాట్ నమోదు చేయాలని వ్యవసాయ అధికారులు చెప్పడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు.

గుత్తి మార్కెట్ యార్డుకు 15 వాహనాల్లో రైతులు పత్తిని విక్రయించడానికి తీసుకువస్తే నాణ్యత లేదని సాకుతో ఏడు వాహనాల పత్తిని వెనక్కి పంపారన్నారు. చేసేది లేక రైతులు బయట దళారులకు క్వింటాళ్లకు రూ.6500తో విక్రయాలు సాగిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కపాస్ కిసాన్ యాప్ రద్దుచేసి సిసిఐ నిబంధనలను సడలించి ఈ క్రాప్ ఆధారంగా రైతులు సాగుచేసిన పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యకర్తలే సుప్రీం : మంత్రి లోకేష్

ప్రజాశక్తి - భామిని

పార్టీకి కార్యకర్తలే సుప్రీమని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. భామినిలోని లివిరి కూడలిలో ప్రత్యేక ప్రాంగణంలో భవనంలో టిడిపి కార్యకర్తల సమావేశ ం గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మరో 15ఏళ్ల వరకూ కలిసే ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వంలో కార్యకర్తలకే తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. చిన్న చిన్న సమస్యలపై సర్దుకుపోవాలన్నారు. కూటమి ప్రభుత్వం బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

నిధుల మళ్లింపుపై మీనమేషాలు!

- లెక్కలు తేలినా చర్యలు శూన్యం
- పశుసంవర్ధక శాఖ అవినీతిపై చర్యలేవీ..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా పశుసంవర్ధక శాఖలో వెలుగులోకి వచ్చిన అవినీతిపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇప్పటికే రాష్ట్ర ఆడిట్ అధికారులు కూడా నిధుల మళ్లింపుపై విచారణ చేపట్టి ప్రభుత్వ సొమ్మును ఏ రకంగా దుర్వినియోగం చేసారన్నది తేల్చింది. ప్రధానంగా నలుగురు వ్యక్తులు ప్రభుత్వ ఖజానాలో ఉండాల్సి నవి తమ సొంత ఖాతాల్లోకి మళ్లించడం, డ్రా చేయడం జరిగింది. ఈ రకంగా ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జులైలోపు రూ.1.01 కోటి రూపాయల నిధులను కాజేశారు. ఈ విషయాలను స్పష్టంగా తేలినప్పటికీ ఇప్పటి వరకు వారిపై కనీస చర్యల్లేకపోవడం గమనార్హం.

అనుమతుల్లేకుండానే రూ.1.01 కోట్లు డ్రా

అనంతపురం పశుసంవర్ధక శాఖకు సంబంధించి వివిధ పద్దుల కింద ఐదు బ్యాంకుల్లో ఖాతాలున్నాయి. వీటిల్లో వాడకుండా ఉన్న డబ్బులు కొన్నేళ్లుగా ఉంటూ వస్తున్నాయి. వాటిని వాడాల్సి ముందుగా అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఈ రకంగా ఐసిఐసిఐ, యాక్సిస్, స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కోటాక్ మహంద్రా బ్యాంకుల్లో ఖాతాలున్నాయి. ఈ ఖాతాల్లో నుంచి నలుగురు వ్యక్తులు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జులైలోపు ఎటువంటి అనుమతుల్లేకుండానే నలుగురు సిబ్బంది డబ్బులను డ్రా చేయడంతోపాటు నేరుగా ఇతర ఖాతాల్లోకి ఆర్‌టిజిఎస్ ద్వారా మళ్లింపు చేసిన దాఖలాలున్నాయి. మొత్తంగా రూ.1.01 కోటి రూపాయలు ఈ రకంగా మళ్లించారు. ఇందులో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతా నుంచి రూ.15 లక్షలు, ఐసిఐసిఐ బ్యాంకు నుంచి రూ.22 లక్షలు, యాక్సిస్ బ్యాంకు నుంచి రూ.27 లక్షలు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి రూ.15 లక్షలు డ్రా చేసినట్టు విచారణలోనూ గుర్తించారు.

నలుగురు పేరుతో నగదు డ్రా

పశుసంవర్ధక శాఖలో నిధులు కాజేసిన వ్యవహారంలో నలుగురు వ్యక్తుల పేర్లు బయటకొచ్చాయి. ఇందులో ఆంజినేయులు నాయక్ నేరుగా ఆయన పేరున డ్రా చేసిన మొత్తం రూ.11.94 లక్షలుంది. అదే కార్యాలయంలో పనిచేసే మరో మహిళా ఉద్యోగిని బి.సుశీల పేరున రూ.12.72 లక్షలు చేశారు. వీరు కాకుండా గాండ్ల దినేష్ పేరున రూ.16.09 లక్షలు, రమావత్ వంశీ పేరున రూ.12.25 లక్షలు నేరుగా డ్రా చేశారు. ఇక ఈఏడాది జులైలో ఎటువంటి అనుమతుల్లే కుండానే రూ.23.40 లక్షలు ఆర్టీజీఎస్ ద్వారా వేరే ఖాతాలకు మళ్లించారు. ఏప్రిల్‌లో ఆరు లక్షలు, జూన్‌లో రూ.6.50 లక్షలు వేరే ఖాతాల్లోకి మళ్లించారు. ఈ రకంగా మొత్తం రూ.1.01 కోటి ఇప్పటి వరకు మళ్లించినట్లు ఆధారాలున్నాయి. ఇవికాకుండా ఇతర పద్దుల కిందనున్న వాటిని మళ్లించినట్టు సమాచారం. దీనికి సంబంధించి ఆధారాలు లభించలేదు. ఈ మొత్తం వ్యవహారంలో చాలాకాలంగా ఇక్కడే పాతుకుపోయి పనిచేస్తున్న ఒక ఉద్యోగికి కీలకపాత్ర పోషించినట్టు ప్రచారం జరుగుతోంది.

ఇప్పటి వరకు చర్యలు శూన్యం

పశుసంవర్ధక శాఖలో ఇప్పటి వరకు ఇంత పెద్దఎత్తున నిధులను దారి మళ్లించి ప్రభుత్వ సొమ్మును కాజేసినప్పటికీ ఎటువంటి చర్యల్లేవన్న విమర్శలున్నాయి. నలుగురు నేరుగా నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేసినట్టు ప్రాథమిక విచారణలోనే స్పష్టమైంది. అయితే వీరిపై ఇప్పటి వరకు అధికారిక చర్యలేవి లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

రూప్‌చంద్ ధర ఢమాల్

- మేత, లీజు సొమ్ము సైతం రాని దుస్థితి
- తీవ్ర ఆందోళనలో చేపల సాగుదారులు



ప్రజాశక్తి - కాళ్ల

ఉప్పుటేరు, కొల్లేరు తీర ప్రాంతంలో చేపల సాగులో ముఖ్యమైన రూప్‌చంద్ ధర అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయింది. గత దశాబ్ద కాలంలో ఎన్నడూ ధర ఇంత దిగజారలేదని, ఈ ధర వల్ల రూప్‌చంద్ సాగు చేసే రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారు. జిల్లాలో చేపల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పెరిగిన ఫీడ్, సీడ్ ధరలకు తోడు నకిలీ సీడ్‌తో చేపల సాగు కుదేలవుతోంది. ఇదే సమయంలో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గించడంతో కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. ఈ పరిస్థితుల్లో చేపల సాగుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో చేపల సాగు ఉంది. ప్రస్తుతం దిగుబడులు తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లోని చేపల చెరువుల్లో కేజీన్నరకుపైగా బరువు పెరిగిన చేపలను పట్టుబడులు చేస్తున్నారు. ఆరు సంవత్సరాల నుంచి తెల్ల చేపలు సాగు చేస్తున్న రైతులు ఫీడ్ ధరలు అమాంతం పెరగడం, వ్యాపారులు కుమ్మక్కై ధరలు తగ్గించడంతో నష్టాలు చవి చూస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు చెబుతున్నారు. కిలో చేపల ధర రూ.80 నుంచి రూ.90కు తగ్గిపోవడంతో కనీసం పెట్టుబడులు రావడం లేదని, కనీసం కిలో ధర రూ.125కు విక్రయిస్తేనే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. కొత్తగా కొంతమంది రెండేళ్ల నుంచి రూపచంద్ చేపలు సాగు చేస్తున్నారు. ఏడాదిపాటు లాభాలు ఆర్జించారు. రెండోయేట నుంచి కిలో రూ.100 నుంచి రూ.80కి ధర తగ్గిపోవడంతో నష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

ఎకరానికి రూ.40 వేలు నష్టం

రూప్‌చంద్ సాగు చేపట్టిన మొదట్లో కిలో వంద రూపాయలకు వ్యాపారులు కోనుగోలు చేయడంతో రైతులకు గిట్టుబాటయ్యేది. ప్రస్తుతం కిలో రూ.80కి తగ్గించడంతో ఎకరాకు రూ.40 వేల నష్టం వస్తున్నట్లు చెబుతున్నారు.

అధికారుల పర్యవేక్షణేదీ..!

జిల్లాలో వందల సంఖ్యలో ఫీడ్, కెమికల్స్ దుకాణాలు ఉన్నాయి. వీటిపై మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడి నకిలీ ఫీడ్, కెమికల్స్ రాజ్యమేలుతున్నాయని చేపల రైతులు ఆరోపిస్తున్నారు. ఫీడ్‌ను చేపలకు వేయడం వల్ల పెరుగుదల లేదని, దీంతో బరువు రాక నష్టాలు వస్తున్నాయని చెబుతున్నారు.

ధర పతనం

ఈ సంవత్సరం జూన్ చివర నుంచి రూప్‌చంద్ ధర పతనం కావడం ప్రారంభమైంది. రైతు వద్ద రూ.114, రూ.115 పలికిన చేప ధర పతనమవుతూ ప్రస్తుతం కనిష్ట స్థాయి రూ.80కు దిగజారింది. ఒక లారీకి పది టన్నుల సరుకు పడితే రైతుకు సుమారు రూ.1.5ం లక్షలు నష్టం వస్తోంది. ఇలాగైతే సాగు ఎలా కొనసాగించగలమని రైతులు లబోదిబోమంటున్నారు. మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం ఈ ధర ఇంకా పతనమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇదే జరిగితే ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా ఆయకట్టు ప్రాంతంలో ఇక మీదట చేపల సాగుకు ప్రయత్నించలేదని దుస్థితి దాపురిస్తుందని వాపోతున్నారు.

అరువు లేదంటున్న ఫీడ్ కంపెనీలు, డీలర్లు

రూప్‌చంద్ చేప ధర కనిష్ట స్థాయికి చేరడంతో చేపలు పట్టడానికి రైతుల ముందుకు రావడం లేదు. గత సంవత్సర కాలం నుంచి చేపల చెరవులకు మేతల పెట్టుబడులు పెడుతున్న ఫీడ్ కంపెనీలు, డీలర్లు ఇక పెట్టుబడులు పెట్టలేక ఇబ్బందులు పడుతూ వెనుకంజ వేస్తున్నారు. ఫీడ్ కంపెనీలు, డీలర్లు మేతకు అరువు ఇవ్వకుండా సొమ్ము చెల్లిస్తేనే మేత పంపుతామని చెబుతున్నారు. ఇప్పటికే తాము చాలా సొమ్ము అరువుగా ఇచ్చామని, ఇక ఇవ్వలేమని, సొమ్ము చెల్లిస్తేనే మేత పంపగలమని తేల్చి చెబుతున్నారు. రెండు రోజులకోసారి మేత చల్లాల్సి ఉందని, ఈ విధంగానైతే చేప పెరుగుదల నిలిచి పోతుందని రైతులు ఆందోళన చెందుతుందన్నారు.

ధర పతనానికి కారణాలు

కార్తీక మాసం, షష్టి పండుగల ప్రభావమే రూప్‌చంద్ ధర తగ్గడానికి కారణమని ట్రేడర్స్ చెబుతున్నారు. మరో రెండు, మూడు నెలలు ఇదే పరిస్థితి ఉండవచ్చని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌కు వస్తున్న సరుకు ఎక్కువగా ఉండడం వల్ల ధర తగ్గుతుంది.



మృతిచెందిన కె.స్వాతి (ఫైల్)

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - విజయనగరం కంటోన్మెంట్

విజయనగరం అయ్యకోనేరు గట్టు సమీపంలో ఉన్న బిసి సంక్షేమ మహిళా కళాశాల వసతి గృహంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. శ్రీకాకుళం జిల్లా గార మండలం తోనంగి గ్రామానికి చెందిన కె.స్వాతి (17)ఎంఆర్ అటానమస్ కళాశాలలో బిజెడ్‌సి మొదటి సంవత్సరం చదువుతూ స్థానిక బిసి సంక్షేమ వసతి గృహంలో ఉంటున్నారు. గురువారం ఉదయం విద్యార్థులందరూ కళాశాలకు వెళ్లిపోయిన తర్వాత హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మధ్యాహ్నం భోజనానికి వచ్చిన విద్యార్థులు గమనించి వార్డెన్‌కు సమాచారం అందించారు. విజయనగరం టూటౌన్ పోలీసులకు ఆయన సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు.

నా మృతికి ఎవరూ కారణం కాదు

'నా మృతికి ఎవరూ కారణం కాదని స్వాతి లేఖ రాసింది. తల్లిదండ్రులు బాధపడవద్దు అని ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది. తన చావుకు ఎవరూ కారణం కాదని, అనారోగ్యం వల్లే ఆత్మహత్యకు పాల్పడుతున్నానని లేఖలో పేర్కొనట్లు తెలిసింది.



ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

అన్యాయంగా రోడ్డున పడేశారు

- న్యాయం చేయాలంటూ జోజినగర్ వాసుల ఆందోళన
- భవనాల కూల్చివేత సమయంలో అసభ్యంగా ప్రవర్తించారంటూ పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి- విజయవాడ సిటీ

చట్టపరంగా అన్ని అనుమతులు తీసుకుని పక్కా గృహాలు నిర్మించుకున్న తమను అన్యాయంగా రోడ్డున పడేశారని విజయవాడ జోజినగర్‌కు చెందిన బాధితులు ఆందోళనకు దిగారు. తమ ఇళ్లు నేలమట్టం చేసి 24 గంటలు కావస్తున్నా తమను ఎవ్వరూ పట్టించుకోలేదని ఎమ్మెల్యే సుజనా చౌదరి చౌదరి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తమ సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన తమను కార్యాలయం బయటే ఉంచి తలుపులు మూసివేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కార్యాలయం బయట బైఠాయించి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్, మరికొంతమంది నేతలు బాధితులతో మాట్లాడారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టికి మీ సమస్యను తీసుకువెళ్తామని వారు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. భవనాలు కూల్చివేత సమయంలో కొంతమంది పోలీసు సిబ్బంది, న్యాయవాదులు తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

సిపిఎం బృందం పరిశీలన

కూల్చివేసిన ఇళ్లను సిపిఎం ప్రతినిధి బృందం గురువారం పరిశీలించింది. తమ ఇళ్లను అన్యాయంగా కూల్చివేశారని సిపిఎం నేతల ఎదుట బాధితులు వాపోయారు. సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చినప్పటికీ ఆఘమేఘాల మీద ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గమన్నారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

త్వరలో 1050 కొత్త బస్సులు

- ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకాతిరుమలరావు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

త్వరలో 1050 కొత్త బస్సులు రానున్నాయని ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.ద్వారకాతిరుమల రావు తెలిపారు. స్థానిక జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపోను ఆయన గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్త్రీ శక్తి పథకం అమలు ఎలా ఉంది, బస్సులు సరిపోతున్నాయా, బస్సుల ఫిట్‌నెస్ ఎలా ఉంది అనే వివరాలు డిపో మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పల్లె వెలుగు బస్సులు కూడా కొత్తవి త్వరలో రానున్నాయన్నారు. బస్టాండ్‌లోని కొంతమంది ప్రయాణికులు బస్టాండ్‌లో ఆర్‌ఒ ప్లాంట్ పెట్టాలని, భీమవరం బస్సు మరొకటి ప్రారంభించాలని కోరారు. దీనిపై ఎమ్‌డి స్పందిస్తూ త్వరలోనే ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఇప్పుడున్న కొన్ని పల్లె వెలుగు బస్సులు పదేపదే మరమ్మతులకు గురవుతుండటంతో వాటి స్థానంలో త్వరలోనే కొత్త బస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలు బస్సుల్లో సంతోషంగా ప్రయాణిస్తున్నారన్నారు. త్వరలో వికలాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ప్రభుత్వం యోచిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ గంగాధర్‌రావు, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా..?

- అబద్దాలకు జగన్ అంబాసిడర్
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

అధికారం పోయేసరికి వైఎస్ జగన్‌కు రైతులు గుర్తొచ్చారా అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. టెక్కలి పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాటు జగన్ నడిపిన తుగ్లక్ పరిపాలనే వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయడానికి ప్రధాన కారణమని ఆరోపించారు. ఆ వైఫల్యాలను దాచిపెట్టేందుకు ఇప్పుడు అబద్దాలకు అంబాసిడర్‌లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు, పంట కొనుగోళ్ల వేగం, తక్షణ సహాయ చర్యలను వక్రీకరించి ప్రజల్లో గందరగోళం సృష్టించడం జగన్‌కు అలవాటైపోయిందన్నారు. జగన్ చేస్తున్న బాధ్యతారహిత ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రైతుల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం పారదర్శకంగా, శాస్త్రీయంగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయం, వ్యవసాయాధారిత రంగాలను దేశంలోనే ఆదర్శంగా నిలిపేలా పునరుజ్జీవింపజేస్తోందని చెప్పారు. రైతులకు తక్షణ మార్కెట్ జోక్యం అందించేందుకు 2025-26 బడ్జెట్‌లోనే రూ.300 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, అవసరాన్ని బట్టి ఇప్పటికే రూ.800 కోట్లకు పైగా మద్దతు ధరల రూపంలో ఖర్చు చేసిందని వివరించారు.

4 గంటల్లోనే ధాన్యం సొమ్ము జమ

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కనీస మద్దతు ధరను నామ మాత్రంగా పెంచితే కూటమి ప్రభుత్వం బస్తాకు రూ.1,792కు పెంచిందని, ధాన్యం కొనుగోలు చేసిన 4 గంటల్లోనే రైతుకు నగదు జమ చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కానూరులోని పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. గోనె సంచులను, టార్పాలిన్లను ఉచితంగా అందించామన్నారు. మూడు విడతల్లో అర్హత ఉన్న వారిందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్ అదించామని తెలిపారు. ఏడాదిలో ఈ పథకం కింద 2,85,93,721 మంది లబ్ధిపొందారని తెలిపారు. మొదటి విడతలో 97.63 లక్షలు, రెండవ విడతలో 94.73 లక్షలు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామని, రూ.2,406 కోట్లు ఈ పథకం కింద ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రజలను మభ్యపెట్టేలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అసత్యాలను ప్రచారం చేస్తున్నారని నాదెండ్ల పేర్కొన్నారు.

రైతులను ఆదుకున్నాం : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్కెట్‌లో పంటలకు ధరలు తగ్గినప్పుడు కూటమి ప్రభుత్వం రైతులకు ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుందని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. ఇందుకు పోగాకు రూ.271 కోట్లు, మామిడికి రూ.261 కోట్లు, కోకోకు రూ.14 కోట్లు, టమాటాకు రూ.12 కోట్లు రైతులకు అందజేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 2,140 కోట్లు కేటాయించి ఆ నిధుల్లో రూ.1,475 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. రూ.7,700 కోట్లు ఖర్చు చేసినట్లు అబద్దపు ప్రచారాలు చేసుకుంటుందని తెలిపారు.

పాముకాటుతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - కౌతాళం

పాముకాటుకు గురై విద్యార్థి మృతి చెందిన సంఘటన కౌతాళం మండలంలోని చిరుత పల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన లింగన్న, ఉరుకుందమ్మ దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. అర్జున్ (11) స్థానిక ఎంపిపి పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. గురువారం ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా పాముకాటుకు గురయ్యాడు. విషయం గుర్తించకపోవడంతో కడుపు నొప్పి ఉందని ఉరుకుందలోని ఒక ప్రయివేట్ వైద్యుని వద్దకు తీసుకెళ్లగా పాము కాటు కాటు వేసినట్లు గుర్తించి మెరుగైన చికిత్స కోసం ఆదోనికి తీసుకెళ్లాలని సూచించారు. ఆదోనికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో అర్జున్ మృతి చెందారు..

మొక్కజొన్న రైతులకు వ్యాపారి కుచ్చుటోపీ


సాలూరు : సాలూరు, పాచిపెంట మండలాల్లో పలువురు రైతుల నుంచి మొక్కజొన్న గింజలు కొనుగోలు చేసిన వ్యాపారి వారికి కుచ్చుటోపీ పెట్టిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొద్ది రోజుల క్రితం రైతులు మొక్కజొన్న విక్రయించిన డబ్బులు వ్యాపారి ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యాపారి పులగం వీర వెంకటరెడ్డి నమ్మకంగా గత కొంతకాలంగా రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే నమ్మకంతో వ్యాపారికి రైతులు అరువుపై మొక్కజొన్న విక్రయించారు. నెలలు దాటినా వ్యాపారి కనిపించకపోవడంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదంతా తెలుసుకున్న వ్యాపారి రైతులకు ఐపి నోటీసులు జారీ చేశారు. రైతులకు సుమారు 50లక్షల రూపాయల పైనే చెల్లించాల్సి వుండగా తన వద్ద 42 వేల రూపాయల విలువైన ఆస్తి వున్నట్లు చూపించారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఒక్కో రైతుకి రూ.20వేల నుంచి రూ.2.7లక్షల వరకు వ్యాపారి బకాయి వున్నట్లు తెలుస్తోంది.

రూట్ సెంచరీ

- స్టార్క్‌కు ఆరు వికెట్లు
- ఇంగ్లండ్ 325/9
- యాషెస్ సిరీస్ రెండో(పింక్ బాల్) టెస్ట్



రూట్ (135నాటౌట్)



స్టార్క్(6/71)

బ్రిస్బేన్: యాషెస్ సిరీస్ (పింక్ బాల్-డే/నైట్) రెండో టెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ సంచలన బౌలింగ్‌తో మెరిసాడు. తొలి రెండు సెషన్లలో ఇంగ్లండ్ బ్యాటర్లు ఆధిపత్యం చెలయించగా.. మూడో సెషన్‌లో స్టార్క్ మెరుపు బౌలింగ్ చెలరేగాడు. చివర్లో జో రూట్ సెంచరీకి తోడు జోఫ్రా ఆర్చర్ ఇంగ్లండ్ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ జట్టు 9వికెట్ల నష్టానికి 329 పరుగులు చేసింది. రూట్(135) సెంచరీకి తోడు ఆర్చర్(32) క్రీజ్‌లో ఉన్నారు. వీరిద్దరూ చివరి వికెట్‌కు అర్ధసెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అంతకుముందు ఓపెనర్ క్రాలే(76) మాత్రమే అర్ధసెంచరీతో రాణించగా.. బ్రూక్(31), కెప్టెన్(19), జాక్స్(19) ఫర్వాలేదనిపించారు. డకెట్, పోప్, స్మిత్ డకౌట్లయ్యారు.

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు తొలి రోజే షాక్ తగిలింది. పెర్త్‌లో పది వికెట్లు తీసి.. బెన్ స్టోక్స్ బృందాన్ని కుప్పకూల్చిన మిచెల్ స్టార్క్(6/76) మరోసారి పర్యాటక జట్టును దెబ్బకొట్టాడు. స్టార్క్ విజృంభణతో 5 పరుగులకే 2 వికెట్లు పడిన అనంతరం క్రీజులోకి వచ్చిన జో రూట్(135 నాటౌట్ 202 బంతుల్లో 15 ఫోర్లు, ఒక సిక్సర్‌తో)తో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ జాక్ క్రాలే(76)తో కలిసి స్కోర్‌బోర్డును నడిపించిన రూట్.. 181 బంతుల్లో కంగారూ గడ్డపై మొదటి శతకం సాధించాడు. ఈ ఫార్మాట్‌లో రూట్‌కిది 40వ సెంచరీ కావడం విశేషం.

264 పరుగులకే 9 వికెట్లు

క్రాలే, రూట్ ద్వయాన్ని నెసెర్ విడదీసి ఇంగ్లండ్‌ను కష్టాల్లో పడేశాడు. ఆ తర్వాత వచ్చిన హ్యారీ బ్రూక్(31)ను పెవిలియన్ పంపిన స్టార్క్.. డేంజరస్ జేమీ స్మిత్(0), విల్ జాక్స్(19), గస్ అట్కిన్సన్(4), బ్రైడన్ కార్సే(0)లను ఔట్ చేసి ఇంగ్లండ్‌ను ఆలౌట్ అంచున నిలిపాడు. 264 పరుగులకే 9 వికెట్లు పడినా రూట్ మాత్రం పట్టువదల్లేదు. చివరి బ్యాటర్ జోఫ్రా ఆర్చర్(32 నాటౌట్) సహకారంతో జట్టు స్కోర్ 300 దాటించాడు. వికెట్ కాపాడుకుంటూ చక్కని షాట్లు ఆడిన ఆర్చర్, రూట్ హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పారు. దాంతో.. తొలిరోజు ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 9 వికెట్ల నష్టానికి 325 పరుగుల చేసింది.

వాసిం అక్రం రికార్డు బ్రేక్

ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ ఒక రికార్డును బ్రేక్ చేశాడు. ఇంగ్లండ్‌తో ప్రారంభమైన పింక్‌బాల్ టెస్ట్‌లో ఆసీస్ ఎడమచేతి వాటం పేసర్ మిచెల్ స్టార్ పాకిస్తాన్ పేసర్ వాసీం అక్రం పేరిట ఉన్న ఒక రికార్డును బ్రేక్ చేశాడు. గబ్బా వేదికగా ఇంగ్లండ్‌పై తొలిరోజు ఆరు వికెట్లు తీసిన స్టార్క్.. టెస్టుల్లో సాధించిన వికెట్ల సంఖ్యను 418కు పెంచుకున్నాడు. స్టార్క్ కేవలం 102మ్యాచుల్లో 26.43సగటుతో ఇన్ని వికెట్లను పడగొట్టాడు. దీంతో ఎడమచేతి వాటం పేసర్లలో 418వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా వాసిం అక్రమ్ రికార్డును బ్రేక్ చేశాడు. వాసీం అక్రం 104 టెస్టుల్లో 414 వికెట్లు తీసి ఇంతకుముందు ఈ రికార్డును తన పేర లిఖించాడు.

స్కోర్‌బోర్డు...

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి)క్యారీ (బి)నెసెర్ 76, డకెట్ (సి)లబూషేన్ (బి)స్టార్క్ 0, పోప్ (బి)స్టార్క్ 0, రూట్ (బ్యాటింగ్) 135, బ్రూక్ (సి)స్మిత్ (బి)స్టార్క్ 31, స్టోక్స్ (రనౌట్)ఇంగ్లిస్ 19, స్మిత్ (బి)బోలండ్ 0, విల్ జాక్స్ (సి)స్మిత్ (బి)స్టార్క్ 19, అట్కిన్సన్ (సి)క్యారీ (బి)స్టార్క్ 4, కర్సే (సి)క్యారీ (బి)స్టార్క్ 0, ఆర్చర్ (బ్యాటింగ్) 32, అదనం 9. (74ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 325పరుగులు. **వికెట్ల పతనం:** 1/5, 2/5, 3/122, 4/176, 5/210, 6/211, 7/251, 8/264, 9/264. **బౌలింగ్:** స్టార్క్ 19-0-71-6, నెసెర్ 14-3-43-1, బోలండ్ 19-1-87-1, డోగెట్ 14-1-76-0, గ్రీన్ 8-1-43-0.

ఫలితం తేలేది విశాఖలోనే..

బ్యాటర్లకు స్వర్గధామం

రేపు దక్షిణాఫ్రికాతో మూడో, చివరి వన్డే



విశాఖ : టెస్ట్ సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన టీమిండియా.. వన్డే సిరీస్‌ను కోల్పోకుండా ఉండాలంటే విశాఖలో జరిగే వన్డేలో తప్పనిసరిగా గెలవాలి. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇరుజట్లు ఒక్కో వన్డేలో గెలిచి 1-1తో సమంగా నిలువగా.. మూడు, చివరి వన్డే విశాఖపట్నంలోని ఎసిఎ-విడిసిఎ క్రికెట్ స్టేడియంలో శనివారం జరగనుంది. గెలిచిన జట్టు వన్డే సిరీస్‌ను చేజిక్కించుకోనున్న దృష్ట్యా మూడో వన్డే ప్రాధాన్యత సంతరించుకుంది. విశాఖ స్టేడియం బ్యాటర్లకు అనుకూలం. దీంతో ఈ మైదానంలో బ్యాటర్లు చెలరేగడం ఖాయం. టెస్ట్ సిరీస్‌ను చేజార్చుకున్న టీమిండియా.. వన్డే సిరీస్‌ను పర్యాటక జట్టుకు కోల్పోకుండా ఉండాలంటే గెలుపు తప్పనిసరి.

టాస్ కీలకం..

టీమిండియాకు టాస్ గెలుపు తప్పనిసరిగా మారింది. 20సార్లు టాస్ ఓడి ప్రపంచ రికార్డు నెలకొల్పిన టీమిండియా.. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిస్తేనే ఫలితం మనవైపు రావడం ఖాయం. గత రెండు వన్డేల్లో టాస్ నెగ్గిన దక్షిణాఫ్రికా సారథి బవుమా ఛేదనకే మొగ్గు చూపాడు. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన జట్టుకంటే ఛేదనకు దిగే జట్టుకే విజయావకాశాలు మెండుగా ఉన్న క్రమంలో టాస్ కీలకంగా మారింది. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా భారత కెప్టెన్ కెఎల్ రాహుల్ టాస్ గెలవాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం!

భారీ లక్ష్యాన్ని ఛేదిస్తున్న సఫారీలు..

భారత పర్యటనకు వచ్చిన బవుమా సారథ్యంలోనే దక్షిణాఫ్రికా జట్టు గతంలోకంటే ఈసారి భిన్నంగా రాణిస్తోంది. రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో చేజిక్కించుకొని భారతగడ్డపై తొలిసారి టెస్ట్ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన ఉత్సాహంతో వన్డే సిరీస్‌లోనూ అదరగొడుతోంది. ఈ క్రమంలో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రాంచీ వేదికగా జరిగిన తొలి వన్డేలో టీమిండియా నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 332 పరుగులు చేసి కేవలం 17పరుగులో ఓటమిపాలైంది. ఇక రాయ్‌పూర్ వేదికగా బుధవారం జరిగిన రెండో వన్డేలో టీమిండియా నిర్దేశించిన 359పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 4బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఈ క్రమంలో మూడు వన్డేలోనూ గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భావిస్తోంది.

- స్పోర్ట్స్ కరస్పాండెంట్

హాట్ కేకుల్లా అమ్ముడైన టికెట్లు

వన్డేల సిరీస్ 1-1తో సమంగా ఉన్న క్రమంలో విశాఖలో జరిగే మూడు వన్డే కీలకంగా మారింది. మూడు వన్డే జరిగే విశాఖలోని ఎసిఎ-విడిసిఎ స్టేడియంలో శనివారం మధ్యాహ్నం 1.30 గం॥లకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లన్నీ హాట్‌కేకుల్లా అమ్ముడైనట్లు నిర్వాహకులు గురువారం ప్రకటించారు. సిరీస్ డిసైడ్ మ్యాచ్ కావడం, వారంతరం కావడంతో టికెట్లకు భారీ డిమాండ్ నెలకొన్నట్లు సమాచారం. ఈ మైదానంలో సుమారు 30వేల సామర్థ్యం కలిగి ఉంది. 2025 ఐపిఎల్ తర్వాత ఈ మైదానంలో అంతర్జాతీయ మ్యాచ్ జరగడం ఇదే తొలిసారి. దీంతో మ్యాచ్‌ను ఎప్పుడెప్పుడు చూద్దామా అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. శుక్రవారం ఉదయానికి ఇరుజట్ల ఆటగాళ్ల ఆటగాళ్లు విశాఖ చేరుకోనున్నారు.

ప్రసారభారతి ఛైర్మన్ రాజీనామా

న్యూఢిల్లీ : ప్రసారభారతి బోర్డు ఛైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్ తన పదవికి రాజీనామా చేశారు. ప్రసారభారతి చట్టంలోని సెక్షన్ 7 (6) ప్రకారం ఆయన రాజీనామాను కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆమోదించింది. సెహగల్ 1988 బ్యాచ్‌కి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. ఆయన ఉత్తరప్రదేశ్ కేడర్‌కు చెందిన వారు. గత సంవత్సరం మార్చి 16న ఆయనను ప్రసారభారతి బోర్డు ఛైర్మన్ గా ప్రభుత్వం నియమించింది. సెహగల్‌కు 35 సంవత్సరాల సుదీర్ఘ నాయకత్వ అనుభవం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అనేక కీలక విభాగాలకు ఆయన నేతృత్వం వహించారు. పరిపాలన, విధాన సంస్కరణల్లో తనదైన ముద్ర వేశారు. మీడియా, ప్రజా సంబంధాలు, సాధారణ పరిపాలన, ఫైనాన్స్, శాంతి భద్రతలు, పరిశ్రమ, భూ యాజమాన్యం, హోం వ్యవహారాలు వంటి అనేక రంగాలలో ఆయనకు అపారమైన అనుభవం ఉంది. 2023 జులైలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శిగా ఆయన పదవీ విరమణ చేశారు.

ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ వ్యాఖ్యలు

- ఏప్రిల్ 22వరకు సుప్రీం స్టే పొడిగింపు

న్యూఢిల్లీ : భారత్ జోడో యాత్ర సందర్భంగా 2022లో భారత సైన్యంపై వ్యాఖ్యలు చేసిన కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై ట్రయల్ కోర్టు ప్రొసీడింగ్స్‌ను నిలిపివేస్తూ జారీ చేసిన తాత్కాలిక ఆదేశాలను ఏప్రిల్ 22వరకు సుప్రీం పొడిగించింది. జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన బెంచ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాహుల్ గాంధీ పెట్టుకున్న పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన బెంచ్, దీనిపై సవివరంగా విచారణ జరుపుతామని తెలిపింది. ఈ కేసులో తనకు సమన్లు జారీ చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తోసిపుచ్చుతూ అలహాబాద్ హైకోర్టు మే 29న జారీ చేసిన ఆదేశాలను రాహుల్ సవాలు చేస్తూ పిటిషన్ వేశారు.

ప్రజా సమస్యలపై దేశవ్యాప్త ఆందోళనలు

- జనవరి 5,6 తేదీల్లో నిరసనలకు వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాల పిలుపు
- ఉపాధికి నిధులు, లేబర్ కోడ్స్ రద్దు, స్మార్ట్ మీటర్స్ , బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్



అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మికుల సంఘాల ఐక్య సమావేశంలో మాట్లాడుతున్న బి వెంకట్, విక్రమ్ సింగ్ తదితరులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వ్యవసాయ కార్మికులు, రైతులు, కార్మికులు, ప్రజల సమస్యలపై పోరుకు వ్యవసాయ కార్మిక సంఘాలు సిద్ధం అయ్యాయి. జనవరి 5, 6 తేదీల్లో దేశవ్యాప్త ఆందోళనకు పిలుపు ఇచ్చాయి. గురువారం ఢిల్లీలో అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాల ఐక్య సమావేశం జరిగింది. అనంతరం తెలంగాణ, ఆంధ్రా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు బి. వెంకట్, గోయల్, విక్రమ్ సింగ్, శ్రీనివాస్, కర్నల్ సింగ్, దేవేందర్ సమావేశ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంపై మోడీ సర్కార్ నిరంతరం దాడి చేస్తోందని విమర్శించారు. యుపిఎ హయాంలో కేంద్ర బడ్జెట్‌లో 4 శాతం నిధులు ఖర్చు చేస్తే, ఇప్పుడు మోడీ సర్కార్ 1.37 శాతానికి కోత పెట్టిందన్నారు. ఆధార్ అనుసంధానంతో కోటి ఉపాధి హామీ జాబ్ కార్డులను, ఏడు కోట్ల మంది ఉపాధి కూలీలను రద్దు చేసిందని పేర్కొన్నారు. చాలా ప్రాంతాల్లో మూడు నుంచి, ఆరు నెలల పాటు వేతనాలు అందలేదని అన్నారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా హాజరు పద్ధతి అమలు చేస్తున్నారని, దీనివల్ల కోట్ల మంది అవస్థలు పడుతున్నారని తెలిపారు. కొలతల వారీగా వేతనాలు ఇస్తున్నారని, అలాంటప్పుడు రెండు పూటల హాజరు ఎందుకో తెలియడం లేదని అన్నారు. ఎన్ఎంఎంఎస్ పేరుతో అమలు చేస్తున్న పోటీల పద్ధతి కోట్లాది మంది ప్రజలను ఉపాధి నుండి వెళ్లగొడుతుందని పేర్కొన్నారు. ఈకెవైసి పేరుతో లక్షల మంది ఉపాధి కార్డులు రద్దు చేస్తున్నారని విమర్శించారు. అక్టోబర్ 15 నుండి నవంబర్ 14 ఒక్క నెల మధ్య 27 లక్షల ఉపాధి కూలీలను రద్దు చేశారన్నారు. ఉపాధికి కేంద్ర బడ్జెట్‌లో రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాలని, ఈకెవైసి, రెండు పూటల ఫొటోస్ అప్లోడ్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రోజువారీ వేతనం రూ.600కు పెంచి, పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

అభివద్ధి పేరుతో పేదల భూములను లాక్కుంటున్నారు...

శ్రామిక వర్గం సుదీర్ఘకాలం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రవేటు రంగంలో రిజర్వేషన్ల అమలు చేయాలని, కనీస వేతనం రూ. 25 వేలకు తగ్గకుండా ఉండాలని డిమాండ్ చేశారు. అభివద్ధి పేరుతో పేదల భూములను లాక్కోవడం ప్రభుత్వ విధానంగా మారిందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా లక్షల ఎకరాల సాగు భూములు బలవంతంగా లాక్కుంటున్నారని, పాలకులే భూకబ్జాకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో బుల్డోజర్ విధానం చట్ట బద్ధమైందని విమర్శించారు. బలవంతపు భూసేకరణ ఆపాలని, పేదల భూములను స్వాధీనం చేసుకోవడం ఆపాలని డిమాండ్ చేశారు. సాధారణ రైతులు, గ్రామీణ పేదలు స్మాట్ మీటర్స్ వల్ల ఎక్కువగా నష్ట పోయే ప్రమాదం ఉందని అన్నారు. ఉచిత విద్యుత్ ఉండదని, రైతుల కరెంటు మీరట్లకు మీటర్స్ బిగిస్తారని అన్నారు. పేదలకు ఉచితంగా ఇచ్చే విద్యుత్ సబ్సిడీ రద్దు అవుతుందని, ఉచిత కరెంటు కాకండా స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించి అధిక ఛార్జీలు వసూలు చేస్తారని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు శ్రమ జీవుల నడ్డి విరుస్తున్నాయని, అందుకే ప్రజలంతా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని వారు కోరారు.

చికిత్స నిర్ణయంపై

బీమా సంస్థలకు అధికారం లేదు..!

- స్టార్ హెల్త్‌కు వినియోగదారుల కమిషన్ షాక్
- బాధితురాలుకు రూ.50వేలు చెల్లించాలని ఆదేశం



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

వైద్య బీమా రంగంలో కీలక సంస్థగా ఉన్న స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు వినియోగదారుల కమిషన్ భారీ షాక్ ఇచ్చింది. బీమా సంస్థలు వైద్య చికిత్స పద్ధతులను నిర్దేశించలేవని సంచలన తీర్పునిచ్చింది. కోవిడ్‌కు సంబంధించిన క్లెయిమ్‌ను తిరస్కరించినందుకు స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్‌కు వడ్డీతో పాటు దాదాపు రూ. 50,000, వ్యాజ్య ఖర్చులను చెల్లించాలని ఘజియాబాద్ జిల్లా కన్సూమర్ ఫోరం ఆదేశించింది. బాధితురాలు ఇంట్లో ఐసోలేషన్‌లో ఉంటే సరిపోతుందని బీమా సంస్థ క్లెయిమ్‌ను తిరస్కరించింది. దీనిపై వినియోగదారుల ఫోరం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది సేవలో లోపమని కమిషన్ స్పష్టం చేసినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా ఓ కథనాన్ని వెల్లడించింది.

వైద్య చికిత్స విధానాన్ని లేదా పద్ధతిని నిర్ణయించే అధికారం బీమా సంస్థకు లేదని తేల్చి చెప్పింది. కోవిడ్ సంబంధిత క్లెయిమ్‌ను తిరస్కరించిన స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదుపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. బీమా సంస్థ ఇప్పుడు దాదాపు రూ.50,000 మొత్తాన్ని సహా 6 శాతం వార్షిక వడ్డీతో పాటు రూ.2,000 వ్యాజ్య ఖర్చులను చెల్లించాలని స్టార్ హెల్త్‌ను కమిషన్ ఆదేశించింది. ఈ మొత్తాన్ని 30 రోజులలోపు చెల్లించాలని స్పష్టం చేసింది.

రోగికి కరోనా లక్షణాలు లేని కారణంగా రోగికి ఇంట్లోనే చికిత్స అందించాల్సిందని.. కాబట్టి ఆసుపత్రిలో చేరడం అవసరం లేదని స్టార్ హెల్త్ క్లెయిమ్ తిరస్కరించింది. దాద్రీ నివాసి అయిన నీతూ నగర్ 2022 సెప్టెంబర్ 1న జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (డిసిడిఆర్)కి ఫిర్యాదు చేశారు. నీతూనగర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె భర్త అజయ్ నగర్ 2018 నుండి స్టార్ హెల్త్ 'ఫ్యామిలీ హెల్త్ ఆప్టిమా ఇన్సూరెన్స్ పాలసీ' కింద కవరేజ్ కలిగి ఉన్నారు. ప్రతి సంవత్సరం ఎటువంటి అంతరాయం లేకుండా చెల్లింపులు చేశారు. 2022 జనవరిలో పాలసీ నాలుగో సంవత్సరం నడుస్తున్నప్పుడు నీతూ నగర్‌కు తీవ్ర జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడంతో గ్రేటర్ నోయిడాలోని యథార్థ్ ఆసుపత్రిలో చేరారు. ఆయనకు హాస్పిటల్‌లోనే సేవలు అవసరమని కుటుంబ సభ్యులు భావించారు. పాలసీ నిబంధనల ప్రకారం.. ఆసుపత్రిలో చేరడానికి ముందే బీమా సంస్థకు సమాచారం ఇచ్చారు. కొన్ని రోజుల్లో క్యాష్‌లెస్ క్లెయిమ్ ఆమోదించబడుతుందని కుటుంబానికి చెప్పారు. ఆసుపత్రి డిశ్చార్జ్ తర్వాత బిల్లులను చెల్లించడానికి స్టార్ హెల్త్ నిరాకరించింది. మొత్తం ఖర్చు రూ.49,423 కావడంతో కుటుంబం ఆ మొత్తాన్ని తమ సొంత డబ్బుతో చెల్లించి, రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసింది. దీంతో వారు కమిషన్‌ను ఆశ్రయించగా బీమా సంస్థ వాదనను కమిషన్ అధ్యక్షులు అనిల్ కుమార్ పుండిర్, సభ్యురాలు అంజు శర్మ తిరస్కరించారు. వైద్యుల నిర్ణయాన్ని బీమా సంస్థ ఎలా కొట్టిపారేస్తుందని స్పష్టం చేశారు. "వైద్య నిపుణులు ఆసుపత్రిలో చేరడం అవసరమని సూచించినప్పుడు.. చికిత్సను ఇంట్లోనే చేయాలని బీమా సంస్థ పట్టుబట్టకూడదు. రోగి ఇంట్లో ఐసోలేషన్‌లో చికిత్స పొందాల్సిందనే కారణంతో క్లెయిమ్‌ను తిరస్కరించడం సేవల్లో లోపమే." అని తేల్చారు. ఆసుపత్రి ఖర్చులతో పాటు వడ్డీ, కేసు ఖర్చులను రీయింబర్స్ చేయాలని స్టార్ హెల్త్‌ను ఆదేశించారు.

పాలక్కాడ్ ఎంఎల్‌ఎను బహిష్కరించిన కాంగ్రెస్

తిరువనంతపురం : లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న పాలక్కాడ్ ఎంఎల్ఎ రాహుల్ మమ్‌కూతహిల్‌ను కాంగ్రెస్ బహిష్కరించింది. ముందస్తు బెయిల్ కోసం ఎంఎల్ఎ పెట్టుకున్న పిటిషన్‌ను తిరువనంతపురం ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు తిరస్కరించిన తరువాత కాంగ్రెస్ పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. న్యాయస్థానమే తిరస్కరించిన నేపథ్యంలో ఇక ఆయనను సమర్థించుకోవడానికి పార్టీ నాయకత్వానికి అవకాశం లేకుండా పోయింది. ఆయన అరెస్టును నివారిస్తూ ఆదేశాలు జారీ చేయడానికి కూడా కోర్టు తిరస్కరించింది. ఎట్టకేలకు పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి రాహుల్‌ను బహిష్కరించినట్లు కెపిసిసి అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ ప్రకటించారు. పాలక్కాడ్ ఎంఎల్ఎపై అనేక ఫిర్యాదులు రావడం, పలు కేసులు పెండింగ్‌లో వున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్య తీసుకోవడానికి తీవ్ర జాప్యం చేశారని రాజకీయ పక్షాలు ఆరోపించాయి... కోర్టు నిర్ణయం కోసమే పార్టీ నాయకత్వం ఇప్పటివరకు ఎదురుచూస్తూ వచ్చిందని కాంగ్రెస్ సమర్థించుకునే ప్రయత్నం చేసింది.

భారత్ చేరుకున్న పుతిన్

(మొదటిపేజి తరువాయి)

వేళ పుతిన్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో అటు అమెరికాతో ఇటు రష్యాతో సంబంధాలను సమతూకం చేసుకోవాలని భారత్ ప్రయత్నిస్తోంది.

ఇదిలావుండగా, పెండింగ్‌లో వున్న మిలటరీ హార్డ్‌వేర్‌ను త్వరగా అందచేయాల్సిందిగా భారత్ గట్టిగా కోరుతుందని భావిస్తున్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆరంభమైన తర్వాత ఈ విషయంలో అసాధారణ రీతిలో జాప్యం జరుగుతోంది. ఐదు ఎస్-400 యూనిట్లు కోసం 2018లో 500కోట్ల డాలర్ల విలువైన ఒప్పందంపై భారత్, రష్యాలు సంతకాలు చేశాయి. వీటిలో మూడు వరకు అందచేయగా, మరో రెండింటిని వచ్చే ఏడాది మధ్య నాటికి అందచేస్తారని భావిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ వ్యవస్థలు సమర్ధవంతంగా పనిచేశాయి. ఇంధన భద్రతపై ప్రధానంగా చర్చ జరగనుంది. సరఫరాలు నిలకడగా కొనసాగేలా వుండేందుకు రష్యా ప్రయత్నిస్తున్నప్పటికీ భారత్ కొనుగోళ్లు కొద్ది కాలం పాటు తగ్గవచ్చని భావిస్తున్నట్లు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వ్యాఖ్యానించారు. పుతిన్, మోడీ సమావేశానికి ముందుగానే ఇరు దేశాల రక్షణ మంత్రులు సమావేశమై కీలకమైన మిలటరీ హార్డ్‌వేర్‌పై చర్చలు జరుపుతారని భావిస్తున్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధంపై అమెరికా తాజాగా జరిపిన దౌత్యచొరవల గురించి పుతిన్, మోడీకి తెలియచేస్తారని భావిస్తున్నారు.

కేరళపై కేంద్రం కుట్ర: సమగ్ర శిక్ష నిధులు నిలిపివేత

- మూడేళ్లగా రూ.1160 కోట్లు పెండింగ్
- మోడీ సర్కారు తీరు అన్యాయం : సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్



న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సమగ్ర శిక్ష పథకం కింద కేరళకు ఇవ్వాల్సిన రూ.1160 కోట్ల నిధులను ఇప్పటికీ విడుదల చేయలేదు. మూడేళ్లగా నిధులను పూర్తిగా విడల్చటం లేదు. సాక్షాత్తూ కేంద్రం పార్లమెంటులో ఈ విషయాన్ని వెల్లడించింది. సీపీఐ(ఎం) రాజ్యసభపక్ష నేత జాన్ బ్రిట్టాస్ గురువారం అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దీన్ని తెలిపారు. అయితే మంత్రి సమాధానంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన తన సమాధానంలో ప్రత్యక్షంగా చెప్పకపోయినా. పీఎం శ్రీ పథకంపై ఒప్పందం చేసుకున్న రాష్ట్రాలకు మాత్రమే నిధులు విడుదలవుతాయన్న సంకేతాన్ని ఇచ్చారు. కాంగ్రెస్ పాలిత మూడు రాష్ట్రాలు ఇప్పటికే సంతకం చేశాయని కూడా సభలో చెప్పారు. అంటే ఎల్‌డిఎఫ్ పాలనలో ఉన్న కేరళ కూడా పీఎం శ్రీ ఒప్పందం చేసుకుంటేనే నిధులు ఇస్తామన్న విషయాన్ని పరోక్షంగా మంత్రి వెల్లడించారని విశ్లేషకులు భావిస్తున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) పథకం అనేది విద్య కోసం కేంద్రం, రాష్ట్రం కలిసి నడిపే స్కీం. కేంద్రం దీనిని 2018లో ప్రారంభించింది. ఇందులో కేంద్రం, రాష్ట్రం వాటా 60:40గా ఉంటుంది. ఇది జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) - 2020 కింద అమలవుతోంది. కానీ 2022లో వచ్చిన పీఎం శ్రీ ఒప్పందం చేయకపోతే ఎస్ఎస్ఏ నిధులు ఇవ్వబోమని కేంద్రం షరతు విధిస్తోందని బ్రిట్టాస్ ఆరోపించారు. "రాష్ట్రాలు 40 శాతం వ్యయం భరిస్తున్న పథకానికి కొత్త పథకాల ఒప్పందం తప్పనిసరి చేయడం అన్యాయం. ఇది రాజకీయ జోక్యానికి నిదర్శనం" అని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా 2023-24, 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో కేరళకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు పూర్తిగా రాలేదు. కేంద్రం షేరు మొత్తంలో రూ.1160 కోట్లకు పైగా నిధులు ఇంకా విడుదల కాలేదని. కేంద్ర బకాయిల కోసం కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ గతంలో ఢిల్లీలో నిరసనవ్యక్తం చేశారు. అయినా మోడి ప్రభుత్వం స్పందించకపోవడం గమనార్హం.

విద్యార్థులకు అన్యాయం

కేంద్రం నుంచి నిధులు రాని కారణంగా దాని ప్రభావం రాష్ట్రంలోని విద్యా వ్యవస్థపై పడుతుంది. పాఠశాలల్లో ఇవ్వాల్సిన యూనిఫామ్‌లు, పుస్తకాలు, ప్రత్యేక సౌకర్యాలు, స్కూల్ బిల్డింగ్ మరమత్తులు, విద్యా హక్కు చట్టం కింద ఉపయోగపడే అనేక సేవలు తీవ్ర ఆటంకం కలుగుతుంది. ఎస్సీ, ఎస్టీ, దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉండే పిల్లలకు వచ్చే అనేక సదుపాయాలు ఆగిపోయాయి. రాష్ట్రం ఇప్పటికే కేంద్రం నిధులు లేకుండా పాఠశాలల నిర్వహణను సాగిస్తున్నది. తాము కేంద్రానికి అవసరమైన పత్రాలు అందించినప్పటికీ కేంద్రం మాత్రం నిధులు ఇవ్వడం లేదని కేరళ ప్రభుత్వం తెలిపింది. తమకు రావాల్సిన నిధులను ఇవ్వాలని కోరుతోంది. ఇప్పటికే ఈ విషయంలో గడిచిన నవంబర్‌లో రాష్ట్ర మంత్రి వి.శివన్ కుట్టి కేంద్రానికి ఒక భహిరంగ లేఖ రాశారు. మిగిలిన బకాయిలు విడుదల చేయాలని కోరారు. అయితే కేంద్రం తీరు విద్యార్థుల హక్కులను అవమానించేదిగా ఉందని పలువురు భావిస్తున్నారు.

ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు

(మొదటిపేజి తరువాయి)

తెలిపారు. పులివెందులలో 600 టన్నులతో కోల్డ్ స్టోరేజీ నిర్మిస్తే నిర్వహించడం లేదని అన్నారు. సూపర్‌సిక్స్ అమలు చేయలేదని, నిరుద్యోగభృతి, ఆడబిడ్డనిధి, 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. తల్లికి వందనంలో 30 లక్షల మందిని తగ్గించారని, రూ.30 వేలు ఇవ్వాల్సి ఉంటే రూ.10 వేలు చొప్పున ఇచ్చారని అన్నారు. ఉచిత సిలిండర్లు మూడు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. విద్యావ్యవస్థ దెబ్బతిందని, జిఇఆర్ తగ్గిందని, డ్రాపవుట్స్ పెరిగాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదని, 8 క్వార్టర్లు రూ.5600 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఉచిత బస్సు కొన్నిట్లోనే అనుమతి ఇస్తున్నారని, ఇది మోసం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్కూళ్లను నాశనం చేశారని, హాస్టళ్లలో కలుషిత ఆహారం, నీటివల్ల 18 నెలల్లో 28 మంది పిల్లలు చనిపోయారని అన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు బంద్ అయ్యాయని, రూ.5 కోట్ల టర్నోవర్ కూడా లేని సంస్థకు 108, 104 నిర్వహణ బాధ్యతలు ఇచ్చారని తెలిపారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించి అందులో పనిచేసే సిబ్బందికి రెండేళ్లపాటు ప్రభుత్వం జీతం ఇస్తుందని, ఇదో పెద్ద కుంభకోణమని పేర్కొన్నారు. లాభాలు ప్రైవేటుకు ఇచ్చి భారం ప్రభుత్వానికి వేస్తున్నారని వివరించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఈనెల 16న గవర్నర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డిఏలు పెండింగ్‌లో ఉంటే ఒకటి మాత్రమే ఇచ్చారని అన్నారు. డిఏ బకాయిలు పదవీవిరమణ తరువాత ఇస్తామని చెప్పిన ప్రభుత్వం చరిత్రలో లేదని అన్నారు.

ఎన్నో పోరాటాలతో ఏర్పడిన 'విశాఖ ఉక్కు'ను పద్ధతి ప్రకారం దెబ్బతిస్తున్నారని అన్నారు. ప్లాంటుకు సొంతగనులు కేటాయించాలని వైసిపి హయాంలో అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపామని, ఎన్నికల ముందు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు అడిగిన కార్మికులపై పిడి యాక్టు పెడతానని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. విశాఖ స్టీలు ప్లాంటు నష్టాలకు ఉద్యోగులు కారణం కాదని, సొంత గనులు కేటాయించకపోవడమేనని తెలిపారు. మిట్టల్ స్టీలుకు సొంత గనులు కావాలని కోరుతున్న చంద్రబాబు విశాఖ స్టీలుకు ఇవ్వాలని ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో యథేచ్ఛగా కేసులు పెడుతున్నారని అక్రమ కేసులో వేధిస్తున్నారని అన్నారు. టిటిడిలో బోలేబాబా డెయిరీని తీసుకొచ్చింది చంద్రబాబు ప్రభుత్వమని తెలిపారు. టిటిడిపై ఏర్పాటు చేసిన సిట్‌లో అందరూ తెలుగుదేశం నాయకుల బంధువులే ఉన్నారని అన్నారు. అప్పన్న అనే వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పిఏ అని, ఇప్పటికీ ఆయన వద్ద నుండే జీతాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. పరకామణి హుండీ లెక్కింపు కేసు కూడా అన్యాయంగా ఉందని పేర్కొన్నారు. సింహాచలంలో రూ.55 వేల దోపిడీ జరిగితే అక్కడ ఛైర్మన్‌పై ఎందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు తన కేసులు రద్దు చేయించుకుంటున్నారని తెలిపారు. స్కిల్ స్కాము కేసు మాఫీ అయిందని వివరించారు. అమరావతి కోసం 53 వేల ఎకరాలు తీసుకుంటూ సింగపూర్‌ను మించిపోతుందని చెప్పారని, కానీ అక్కడ నిర్మాణాలు కూడా లేవని పేర్కొన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ రాజధాని అని చెప్పి ఇప్పుడు అన్నీ అప్పులు చేస్తున్నారని విమర్శించారు.

ఢిల్లీ వాయు కాలుష్యం నియంత్రణకు తక్షణ చర్యలు

(మొదటిపేజి తరువాయి)

పన్నులు తగ్గించాలని కూడా ఆయన అభ్యర్థించారు. ప్రజలపై భారాలను తగ్గించడానికి నిత్యావసర వస్తువులపై పన్నులు తగ్గించాలని. కార్పొరేషన్లు, సంపన్న వ్యక్తులపై పన్నులు వేయాలని కోరారు. జిఎస్‌టి సెస్ దశలవారీగా ఎత్తివేసిన తర్వాత పొగాకుపై సుంకాలను పెంచే సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు 2025పై చర్చల సందర్భంగా ప్రాణాంతక పొగాకు ఉత్పత్తులను పూర్తిగా నిషేధించాలని సచ్చిదానందం పార్లమెంట్‌ను కోరారు. దీనిపై స్పందించిన సీతారామన్ కేంద్రం కొత్త 'హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్' వసూళ్లలో కొంత భాగాన్ని ఆరోగ్య పథకాల కోసం రాష్ట్రాలకు ఇస్తుందన్నారు పొగాకుతో సహా ఎక్సైజ్ సుంకాలను ఇప్పటికే రాష్ట్రాలతో పంచుకుంటుందని , ఇది వారికి అదనపు ఆదాయ మార్గాలను అందిస్తుందని సభలో తెలిపారు...

చరిత్రలో ఎన్నడూ లేనంతగా రూపాయి విలువ పతనం

డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఆల్ టైమ్ కనిష్ట స్థాయికి పడిపోవడంపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. యుఎస్ డాలర్‌తో పోలిస్తే చరిత్రలో ఎన్నడూ లేనంతగా రూ.90.43 వద్ద కనిష్ట స్థాయికి చేరుకుందని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. పార్లమెంట్ ఆవరణంలో రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే విలేకరులతో మాట్లాడుతూ "రూపాయి పడిపోతోందని నేను చెప్పాను. దీని అర్థం దేశ ఆర్థిక పరిస్థితి బాగా లేదని. అయితే దేశం అభివద్ధి చెందుతుందని , ఆర్థిక పరిస్థితి బాగుందని వారు ఎప్పుడూ చెబుతారు. కానీ రూపాయి పడిపోయినప్పుడు, అది మన ఆర్థిక పరిస్థితి ఏమిటో చూపిస్తుంది" అని అన్నారు. కొన్నేళ్ల క్రితం మన్మోహన్ సింగ్ హయంలో రూపాయితో పోలిస్తే డాలర్ విలువ ఎక్కువగా ఉన్నప్పుడు, బిజెపి నేతలు ఏమన్నారని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. మరి ఇప్పుడు నెలకొన్న పరిస్థితికి బిజెపి నేతలు ఏం సమాధానం చెబుతారన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి పతనం అవుతోందన్నారు. లోక్‌సభలో ఆరోగ్య భద్రత జాతీయ భద్రతా పన్ను బిల్లును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. మరోవైపు కేంద్ర ఎక్సైజ్ (సవరణ) బిల్లును రాజ్యసభ తిరిగి లోక్‌సభకు పంపడంతో పార్లమెంటు ఆమోదం పొందినట్లు ప్రకటించారు.

యాసిడ్ దాడికి పాల్పడే వారిపై సానుభూతి వద్దు

- యావత్ వ్యవస్థ స్పందించాలన్న సిజెఐ

న్యూఢిల్లీ : యాసిడ్ దాడులకు పాల్పడేవారిపై న్యాయస్థానాలు సానుభూతి చూపరాదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ గురువారం వ్యాఖ్యానించారు. వారికి వ్యతిరేకంగా 'మొత్తంగా వ్యవస్థ' స్పందించాలన్నారు.

యాసిడ్ దాడి నుండి బయటపడిన షాహీన్ మాలిక్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు పై వ్యాఖ్యలు చేసింది. వికలాంగుల హక్కుల చట్టం, 2016 కింద యాసిడ్ దాడికి గురైనవారిని నిర్దిష్ట అంగవైకల్యం గలవారిగా గుర్తించాలని ఆమె పిటిషన్‌లో కోరారుజ. కేంద్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చీఫ్ జస్టిస్ అభిప్రాయంతో ఏకీభవించారు. బాధితుల పట్ల యాసిడ్ దాడికి పాల్పడినవారు ఎంత నిర్దాక్షిణ్యంగా, కర్కశంగా వ్యవహరించారో అదే రీతిలో వారు కూడా ఈ కర్కశత్వాన్ని ఎదుర్కొనాల్సి వుందన్నారు. ఇందుకు సంబంధించి ఆర్డినెన్స్ తీసుకువచ్చే విషయాన్ని కేంద్రం పరిశీలించాలని చీఫ్ జస్టిస్ కోరారు. దీనిపై మెహతా స్పందిస్తూ పిటిషనర్ల ప్రయోజనాలను ఎవరూ వ్యతిరేకించరని, వారిని కూడా వికలాంగులుగా గుర్తించాల్సి వుందని, చట్ట పరిధి కిందకు వారిని కూడా తీసుకురావాల్సి వుందన్నారు. మాలిక్ కేసు గత 16ఏళ్ళ నుండి పెండింగ్‌లో వుందని తెలుసుకుని న్యాయస్థానం దిగ్భ్రాంతికి గురైంది. దాడి జరిగేనాటికి ఆమె వయస్సు 26ఏళ్లు. ఎంబిఎ చదువుతోంది. తాను పనిచేస్తున్న ప్రదేశం వెలుపలే ఆమె దాడికి గుకయ్యారు. ఆ తర్వాత ఆమెకు 25వరకు సర్జరీలు అయ్యాయి.

ప్రత్యేకంగా యాసిడ్ దాడి కేసులను ఏ రోజుకారోజు విచారించేందుకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని చీఫ్ జస్టిస్ ప్రతిపాదించారు. యాసిడ్ దాడి కేసుల్లో పెండింగ్‌లో వున్న విచారణలు వాటి వివరాలు, సంఖ్య అన్నీ తెలియచేయాల్సిందిగా రాష్ట్ర హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్స్‌ను కోర్టు ఆదేశించింది.

ప్రజాస్వామ్య సాంప్రదాయానికి పాతర

- రష్యా అధ్యక్షులు పుతిన్‌తో భేటీకి ప్రతిపక్షనేతకు అనుమతి నిరాకరణ
- రాహుల్ గాంధీ ఆగ్రహం

న్యూఢిల్లీ బ్యూరో: దేశంలో మోడీ సర్కార్ గద్దెనెక్కినప్పటి నుంచి ప్రజాస్వామ్య, పార్లమెంటరీ విలువలు, సాంప్రదాయాలపై దాడి చేస్తూ వస్తోంది. తాజాగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఆదర్శంగా ఉన్న దేశంలో ప్రజాస్వామ్య సాంప్రదాయానికి మోడీ సర్కార్ పాతర వేసింది. సాధారణంగా భారతదేశాన్ని ఎవరు సందర్శించినా, ప్రతిపక్షనేత సమావేశం నిర్వహించే సంప్రదాయం ఉంది. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం వరకు కూడా ఇలానే జరిగింది. ఇతర దేశాల అధ్యక్షులతో, నేతలతో ప్రతిపక్ష నేతల భేటీలు జరగడం సర్వసాధారణం. ఇతర దేశాల నేతలు భారతదేశంతో పర్యటించినప్పుడు, అలాగే ప్రతిపక్ష నేతలు ఇతర దేశాల్లో పర్యటించినప్పుడు ఆయా దేశాల నేతలతో ప్రతిపక్ష నేత భేటీ అవుతుంటారు. అంతేకాకుండా అది ఎప్పటి నుంచో వస్తోన్న ప్రజాస్వామ్య సాంప్రదాయం. ఇప్పుడు మోడీ ప్రభుత్వం మాత్రం ప్రతిపక్ష నేతలను కలవవద్దని ఇతర దేశాల నేతలకు, ప్రముఖులకు చెప్పింది" అని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "సాధారణంగా, విదేశాల నుంచి వచ్చే ఎవరైనా ప్రతిపక్ష నాయకుడిని కలవడం ఒక సంప్రదాయం. అటల్ బిహారీ వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల కాలంలో కూడా ఇది జరిగింది. కానీ నేడు, విదేశీ ప్రముఖులు, లేదా నేను విదేశాలకు వెళ్ళినప్పుడు, ప్రతిపక్ష నాయకుడిని కలవవద్దని ప్రభుత్వం వారికి సలహా ఇస్తుంది. ఈ విషయాన్ని మాకు ఆయా దేశాల నేతలే చెప్పారు"అని విమర్శించారు. "మాకు అందరితో సంబంధాలు ఉన్నాయి. ప్రతిపక్ష నాయకులు భిన్నమైన దృక్పథాన్ని కలిగి ఉంటారు. ఇది కేవలం ప్రభుత్వం మాత్రమే కాదు. ప్రతిపక్షం బయటి నుంచి వచ్చే వారిని కలవాలని ప్రభుత్వం కోరుకోవడం లేదు. మోడీ, విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ నియమాన్ని పాటించవు. ఇది వారి అభద్రత" అని మండిపడ్డారు. రాహుల్ గాంధీ ఆరోపణలపై కాంగ్రెస్ నేత శశి థరూర్ స్పందిస్తూ "ప్రతిపక్ష నేత తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించాలని నేను భావిస్తున్నాను" అని అన్నారు. "ప్రజాస్వామ్యంలో దేశాన్ని సందర్శించే ప్రముఖులు అందరినీ కలవడం మంచిది. ఇది ఒక ముఖ్యమైన సందర్శన అని నేను భావిస్తున్నాను. రష్యా, చైనా, అమెరికాలతో మన దేశం అనేక ముఖ్యమైన ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించాల్సిన అవసరం ఉంది. నిబంధనలను నిర్ణయించడానికి మనకు సార్వభౌమ స్వయంప్రతిపత్తి ఉండాలి. ఆ స్ఫూర్తితో మనం రష్యా, యూఎస్, చైనాతో వేర్వేరు సమయాల్లో మంచి సంబంధాలను కొనసాగించామని, భిన్నమైన ప్రాధాన్యతను కలిగి ఉన్నామని నేను నమ్ముతున్నాను.. ప్రతిపక్ష నేత తన అభిప్రాయంపై ప్రభుత్వం స్పందించాలని నేను భావిస్తున్నాను" అని అన్నారు.

అదనపు సిబ్బందిని నియమించాలి

- బిఎల్‌ఓల పని ఒత్తిళ్లపై సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టిన బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓ) తీవ్ర స్థాయిలో ఎదుర్కొంటున్న పని ఒత్తిడిని తగ్గించేందుకు అదనంగా సిబ్బందిని నియమించాల్సిందిగా సుప్రీం కోర్టు రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. బిఎల్‌ఓలపై ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద చర్యలు తీసుకోరాదంటూ ఇసిని ఆదేశించాల్సిందిగా కోరుతూ విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం (టివికె) తరపున దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు వెలువడ్డాయి. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బగ్చిలతో కూడిన బెంచ్ ఈ ఉత్తర్వులు వెలువరించింది. తమ రోజువారీ విధులు ముగిసిన తర్వాత బిఎల్‌ఓ కార్యకలాపాలు చేపట్టాల్సిందిగా అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లపై ఒత్తిడి తెస్తున్నారని టివికె తరపున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదించారు. వారి పని గురించి, వారు సాధించాల్సిన లక్ష్యాల గురించి అర్ధరాత్రి సమయాల్లో మెసేజ్‌లు వస్తాయన్నారు. ఇంత అధిక ఒత్తిళ్ళతో కూడిన పనుల వల్ల లక్ష్యాలను సాధించలేకపోతే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోరాదని శంకరనారాయణన్ వాదించారు. దేశవ్యాప్తంగా బిఎల్‌ఓల మరణాలు, ఆత్మహత్యల సంఘటనలను ఈ సందర్భంగా ఆయన కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు ఇసి అధికారుల ఒత్తిళ్లే కారణమని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలు, పరిస్థితుల వల్ల ఎవరూ ఈ ఒత్తిడికి లోనవడం లేదని, బిఎల్‌ఓ పనులు, పైగా ప్రాసిక్యూషన్ బెదిరింపులతో వారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఆయన వివరించారు. బిఎల్‌ఓల పనిని గణనీయంగా తగ్గించేలా రీజనల్ అధికారిని ఒకరిని రాష్ట్ర ప్రభుత్వాలు నియమించాలని చీఫ్ జస్టిస్ ఆదేశించారు. "నిర్దిష్ట కారణాల వల్ల ఏ ఉద్యోగిని అయినా బిఎల్‌ఓ కార్యకలాపాల నుండి మినహాయించాల్సి వస్తే, సంబంధిత ప్రభుత్వం ఆ ఉద్యోగి అభ్యర్ధనను ప్రత్యేకంగా పరిశీలించాలని, ఆ వ్యక్తి స్థానంలో మరో ఉద్యోగిని అందుకు నియమిం చాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొంది. ఎస్ఐఆర్ సాగుతున్నపుడు ఇసికి అవసరమైన సిబ్బందిని అందచేయాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వాలపై వుంటుందని సుప్రీం పునరుద్ఘాటించింది. అందువల్లబ బిఎల్‌ఓ పని ఒత్తిళ్లను తగ్గించేందుకు అదనపు సిబ్బందని మొహరించే అంశాన్ని రాష్ట్రప్రభుత్వాలు పరిశీలించాలని పేర్కొంది.

హెచ్-1బి వీసాలపై సెన్సార్ షిప్

- దరఖాస్తుల పరిశీలనలోనే వేటు వేయాలని నిర్ణయం
- ట్రంప్ ప్రభుత్వం ఆదేశం

వాషింగ్టన్ : అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, కార్మికుల హెచ్-1బీ వీసా దరఖాస్తులను మరింత వేగవంతంగా పరిశీలించాలని అమెరికా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిసింది. వాక్ స్వాతంత్ర్యానికి సంబంధించిన 'సెన్సార్‌షిప్'లో భాగస్వాములైన వారి దరఖాస్తులు తిరస్కరించాలని కూడా ట్రంప్ ప్రభుత్వం ఆదేశించింది. అమెరికా విదేశాంగ శాఖ కేబుల్‌ను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ ఈ విషయాన్ని తెలియజేసింది. భారత్, చైనా వంటి దేశాల నుంచి పెద్ద ఎత్తున నియామకాలు జరుపుతున్న అమెరికాలోని టెక్ కంపెనీలకు హెచ్-1బీ వీసాలు అత్యంత కీలకమన్న విషయం తెలిసిందే. ఈ కంపెనీల యజమానులు, సీఈఓలు గత సంవత్సరం జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికలలో ట్రంప్‌కు మద్దతు ఇచ్చి స్పాన్సర్ చేశారు. అమెరికా విదేశాంగ శాఖ కేబుల్ మంగళవారం దేశంలోని అన్ని సంస్థలకూ ఆదేశాలు పంపింది. హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులు, వారితో ప్రయాణించే కుటుంబ సభ్యుల లింక్డిన్ ప్రొఫైల్స్‌ను లేదా రెజ్యూమ్‌లను సమీక్షించాలని అందులో కాన్సులర్ అధికారులను నిర్దేశించింది. తప్పుడు సమాచారం, దుష్ప్రచారం, కంటెంట్ నియంత్రణ, నిజ నిర్ధారణ, సమ్మతి, ఆన్‌లైన్ భద్రత వంటి పనులను ఎవరైనా చేశారా లేదా అనే విషయాన్ని తెలుసుకోవడానికి ఈ సమీక్ష నిర్వహించాలని సూచించింది. 'దరఖాస్తుదారుడు అమెరికాలో సెన్సార్‌షిప్‌కు బాధ్యత వహించాడని లేదా అందులో భాగస్వామి అయ్యాడని తేలితే ఇమ్మిగ్రేషన్-జాతీయతా చట్టంలోని నిబంధనల ప్రకారం అనర్హుడిగా నిర్ధారించాలి' అని స్పష్టం చేసింది. అలాంటి కార్యకలాపాలలో ఎవరూ పాలుపంచుకోకుండా చూసేందుకు వారి ఉద్యోగ చరిత్రలను కూలంకషంగా పరిశీలించాలని చెప్పింది. ట్రంప్ ప్రభుత్వం తమ విదేశాంగ విధానంలో స్వేచ్ఛాయుత వాక్ స్వాతంత్ర్యాన్ని కేంద్ర బిందువుగా చేసుకుంది. అమెరికన్ల ప్రసంగాలను సెన్సార్ చేసే వారి వీసాలను నిషేధిస్తామని విదేశాంగ మంత్రి మార్కో రుబియో మేలోనే హెచ్చరించారు.

జీవన సౌరభం


పనిని సాధించడానికి సాధనపై గురి ఏర్పరచుకోవాలన్నదే జీవితంలో నేర్చుకోవాల్సిన గొప్ప పాఠం.

మీకోసం

ఒక కప్పు వేడినీటిలో చిటికెడు పసుపు వేసి రాత్రి పడుకునే ముందు తాగితే గొంతునొప్పి, జలుబు నుంచి ఉపశమనం కలుగుతుంది.



ఎదుగుదల



ఒక గురువు గారు శిష్యుణ్ణి పిలిచి, 'నేను స్నానం చెయ్యాలి. ఆ నీటి తొట్టె నీళ్లతో నింపు' అన్నారు. శిష్యుడు కుండ పట్టుకొని నదికి వెళ్లి రెండు మూడుసార్లు కుండ నిండా నీళ్లు తెచ్చి పోశాడు. చివరిసారి తొట్టెలో నీళ్లు పోస్తున్నపుడు తొట్టె నిండగా, మిగిలిన నీళ్లకింద పారబోసాడు.


గురువు అది చూసి బెత్తంతో శిష్యుడికి ఒక దెబ్బ వేశారు. 'తొట్టె నింపగా అవి మిగిలిన నీళ్లు గురువు గారు, అందుకే వాటిని పార బోసాను' అన్నాడు శిష్యుడు. 'ఆ మిగిలిన నీళ్ళే మొక్కలకు వేయొచ్చు కదా.. ఎందుకు కింద పడేయడం' అని గురువు గారు మరొక దెబ్బ కొట్టారు.

శిష్యునికి కోపం వచ్చింది. 'ఈ కొన్ని నీళ్ళు ఒక మొక్కకు పోసినంత మాత్రాన అది ఆకాశం అంత ఎత్తుకు ఎదగదు కదా' అన్నాడు పౌరుషంతో.

గురువు బెత్తంతో మరొక దెబ్బ వేసి 'ఒరేయ్! మొక్క ఎదగడానికి నిన్ను నీళ్లు పోయమనలేదు. నువ్వు ఎదగడానికి నీళ్లు పోయమన్నాను. రెండు మూడు నీటి చుక్కలు కూడా వృథా చేయకుండా అవసరమైన పనులకు వాడితే, భవిష్యత్తులో పనికి వచ్చే వేటిని కూడా నువ్వు వృథా చేయవు. అందుకే అలా చెప్పాను' అన్నారు.

తన తప్పు తెలుసుకున్న శిష్యుడు తల దించుకున్నాడు. కాలాన్ని, వస్తువులను, పాటించాల్సిన విలువలను వృథా చేయకుండా అనుసరిస్తేనే 'ఎదుగుదల' అని శిష్యుడికి అర్థమయింది. 'గురువు గారూ, ఇంకెప్పుడూ దేనినీ వృథా చేయను. ఈ విషయం నా స్నేహితులకు కూడా చెప్తాను' అన్నాడు.

- శివలెంక ప్రసాదరావు,
సాలూరు,
91829 41028.



ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని కూరగాయ బొమ్మలు ఇచ్చాం. కింద ఇచ్చిన గళ్లల్లో క్లూ ఆధారంగా వాటి పేర్లు రాయండి. ఎరుపు రంగు గళ్లల్లో వచ్చిన అక్షరాలతో ఏ కూరగాయ వస్తుందో ఆలస్యం చేయకుండా చివర్లో ఇచ్చిన బాక్సులో రాసేయండి.

నేను గీసిన బొమ్మ



కె.రిషిక,
3వ తరగతి,
ఎం.పి.పి.ఎస్.టి టెంపుల్,
విస్సన్నపేట,
ఎన్టీఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మత్తు.. బంధాలను చంపేస్తోన్న ముప్పు..

అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలు ప్రయోజకులైతే ఆ తల్లిదండ్రులకి ఎంత సంతోషం! చదువులో చురుకుగా ఉన్న పిల్లలని చూసి మురిసిపోని అమ్మానాన్న ఎవరైనా ఉంటారా! విద్యార్థులు ఉన్నత స్థానాలకి ఎగబాకితే ఆ ఉపాధ్యాయులకి ఎంత గర్వకారణం! కానీ ఇప్పుడు చాలా కుటుంబాల్లో ఆ సంతోషం ఆవిరైపోతోంది. తరగతి గదుల్లో విద్యార్థుల ప్రతిభ మసకబారుతోంది. వ్యసనానికి బానిసైన కొడుకు వికృత చేష్టలు చూసి ఓ అమ్మ భయపడుతోంది. జేబులో పెట్టిన డబ్బులు మాయం చేస్తున్నది కొడుకని తెలిసి ఆ తండ్రి గుండెలు పగిలేలా ఏడుస్తున్నాడు. అన్నని చూసి చెల్లి, తమ్ముడిని చూసి అక్క రాత్రుళ్లు ఒంటరిగా నిద్రపోలేకపోతున్నారు. భార్యభర్తలు జీవితంలో కలలు కన్న అందమైన ప్రపంచం ఉన్నట్లుండి అదృశ్యమవుతోంది. బంధాలను ఇంతలా బీటలు వారిస్తున్న ఈ మత్తు.. మనిషిని కాదు, అతని గుణాన్ని నిట్టనిలువునా చంపేస్తోంది. మనిషితో ఉన్న ప్రతి సంబంధాన్ని నాశనం చేస్తోంది. గంజాయి రూపంలో వికటాట్టహాసం చేస్తున్న ఈ వ్యసనానికి బలౌతున్న కుటుంబాలు ఎన్నో..



ఒక కుటుంబం కరిగిపోయింది

మనోజ్ (పేరు మార్చాం) చదువులో చురుకైన విద్యార్థి. చెల్లి అంటే ఎంతో ప్రేమ. ఎప్పుడూ అమ్మతో పాటే ఉండేవాడు. కానీ కొన్ని రోజుల నుండి మనోజ్ ప్రవర్తన మారిపోయింది. 'ఒకసారి రుచి చూస్తే ఏమవుతుంది' అనుకుని సరదాగా మొదలుపెట్టిన గంజాయి వ్యసనం ఆ కుటుంబంలో పెద్ద కల్లోలం తెచ్చిపెట్టింది. ఇప్పుడు ఆ కుటుంబంలో మునుపటి నవ్వులు లేవు. ఆటలు, సంతోషాలు లేవు. అంతా మౌనం.. మనోజ్ ఎవరితో మాట్లాడం లేదు. మౌనంగా తన గదిలో ఒంటరిగా గడుపుతున్నాడు. కొడుకులో వచ్చిన విపరీత ప్రవర్తన ఆ తల్లిదండ్రులకి కంటి నిండా నిద్రని దూరం చేసింది. బిడ్డ భవిష్యత్తు ఏమవుతోందని ఆ అమ్మానాన్న ఏడ్వని రోజు లేదు.

పెద్ద కల.. ఛిద్రమైన జీవితం

అవినాష్.. (పేరు మార్చాం) విశాఖపట్నం వాసి. ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారుల గారాల కొడుకు. ప్రముఖ టెక్నాలజీ కాలేజీలో అడ్మిషన్ కోసం విశ్వప్రయత్నం చేశాడు. అయితే ఎలా? ఎప్పుడు? మొదలైందో తెలియదు కానీ అతను డ్రగ్స్‌కి అలవాటు పడ్డాడు. ఈ వ్యసనం అవినాష్ లక్ష్యాన్ని నీరుగార్చింది. చదువులో ఏకాగ్రత తగ్గింది. దీంతో అమ్మానాన్న తమ పలుకుబడితో మేనేజ్‌మెంట్ కోటాలో సీటు సంపాదించారు. అయినా, వ్యసనం అవినాష్ చదువుని అర్థాంతరంగా ముగించింది.


ఉద్యోగం ఉన్నా కుటుంబం దూరం

తిరుపతికి చెందిన రాజేష్ (అసలు పేరు కాదు) విద్యార్థిగా ఉన్నప్పుడు వ్యసనపరుడు కాదు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నప్పుడు డ్రగ్స్‌కి అలవాటుపడ్డాడు. కోవిడ్ టైంలో ఇంటి వద్ద నుండే పనిచేసే వీలున్నా రాజేష్ ఇంటికి రావడానికి ఇష్టపడలేదు. అక్కడే 'రూమ్‌లో ఉండి పనిచేస్తా' అన్నాడు. అమ్మానాన్నకి ఏదో అనుమానం వచ్చింది. ఒకరోజు ఉన్నట్లుండి రాజేష్ ఉంటున్న ఫ్లాట్‌కి వెళ్లారు. అక్కడ రాజేష్, అతని స్నేహితులతో కలిసి డ్రగ్స్ సేవించి మత్తులో జోగుతున్నాడు. ఈ దృశ్యం అమ్మానాన్నకి తీరని వేదన మిగిల్చింది.

తాడేపల్లి విషాదాలు..

గుంటూరు జిల్లా తాడేపల్లిలో అమ్మానాన్న, ఇద్దరు కొడుకులతో ఓ అందమైన కుటుంబం నివసిస్తోంది. కాలేజీకి వెళుతున్న పెద్ద కొడుక్కి గంజాయి అలవాటైంది. పిల్లాడిలో వస్తున్న విపరీత ప్రవర్తనకి కలత చెందిన తండ్రి అనారోగ్యానికి గురై మరణించాడు. అతడు కన్నుమూసిన కొన్ని నెలలకే కొడుకుని మార్చలేక తల్లి కూడా ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడం, అన్న మత్తు పదార్థాలకి బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవడంతో స్కూల్లో చదువుతున్న తమ్ముడు, నానమ్మ ఇంట్లో తలదాచుకున్నాడు. వ్యసనం ఆ కుటుంబం మొత్తాన్ని చిన్నాభిన్నం చేసింది.

తాడేపల్లిలోనే మరో రెండు కుటుంబాల్లో సమాజం సిగ్గుపడే సంఘటనలు జరిగాయి. తీరిక లేని పనితో ఉద్యోగాలు చేసుకుంటున్న తల్లిదండ్రులున్న ఆ కుటుంబాల్లో పిల్లలకి ఎప్పుడు? ఎలా అలవాటైందో తెలియదు డ్రగ్స్‌కి బానిసలయ్యారు. మత్తులో ఉన్న ఆ పిల్లలు వావి వరసలు మరిచిపోయి ప్రవర్తించారు. తోబుట్టువులు గర్భవతులయ్యేదాకా ఆ విపరీతం వెళ్లింది.



దొంగతనాలతో మొదలు

వ్యసనం మొదట ఆ వ్యక్తిని, తరువాత అతని కుటుంబాన్ని, చివరికి సమాజాన్ని నాశనం చేస్తోంది. పై సంఘటనలు కేవలం ఆయా కుటుంబాల్లో జరిగిన కొన్ని ఘటనలు. బయటికి రానివి కోకొల్లలు.

డ్రగ్స్ కోసం నాన్న జేబులో డబ్బులు దొంగిలించడంతో మొదలయ్యే నేరం తరువాతి రోజుల్లో బైకులు, స్నేహితుల సెల్‌ఫోన్లు, అమ్మ నగలు, చెల్లి వస్తువులు మాయం చేసేంతవరకు వెళుతోంది. కొన్నిసార్లు దొంగతనాలు, దోపిడీల నుండి హత్యలు, అత్యాచారాలు చేసే తీవ్రరూపం దాల్చుతోంది. మత్తులో ఉండి తల్లిదండ్రులపై దాడి చేయడం, బంధువులతో, తోబుట్టువులతో అనుచితంగా ప్రవర్తించడం సాధారణంగా పరిగణించే స్థితికి సమాజం వచ్చేసింది. వ్యసనపరులైన విద్యార్థులతో టీచర్లు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కళ్ల ముందే ముక్కుపచ్చలారని పిల్లలు నాశనమైపోతుంటే ఆ ఉపాధ్యాయులు పడే బాధ వర్ణనాతీతం.

గణాంకాలేం చెబుతున్నాయి?

విజయవాడ, కృష్ణలంక, తాడేపల్లి పరిసర ప్రాంతాల్లో ఈ మధ్య నమోదవుతున్న నేరాల్లో నిందితులు చాలావరకూ మాదకద్రవ్యాలు వినియోగించేవారే అని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. వ్యసనం బారిన పడిన వారు ఎదుటివారికి హాని చేయడమే కాదు, తమని తాము హింసించుకోవడానికీ వెనుకాడడం లేదు. ఈమధ్యకాలంలో వరుసగా జరిగిన ఆత్మహత్యల కేసుల్లో డ్రగ్స్ వినియోగించే వారివే అధికంగా ఉన్నాయని రికార్డుల్లో ఉంది.

దేశంలో పట్టుబడుతున్న డ్రగ్స్ నిల్వల్లో అత్యధిక భాగం మన రాష్ట్రంలోనే నమోదవుతున్నాయి. అక్రమ రవాణానే కాదు వినియోగంలో కూడా ఆంధ్రప్రదేశ్ ముందుంది. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, కాకినాడ, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు వంటి నగరాల పరిసర ప్రాంతాల్లో నమోదయ్యే నేరాల్లో డ్రగ్స్ కేసులే ఎక్కువ.

సులభంగా డబ్బులు సంపాదించవచ్చని యువత ఎక్కువగా దీనికి ఆకర్షితులవుతున్నారు. మొదట విక్రయం, నెమ్మదిగా వినియోగం చేస్తున్నారు. ఫలితంగా నేరాలు పెరుగుతున్నాయి.

డ్రగ్స్ ఒకరి జీవితాన్నే కాదు, అతని కుటుంబాన్ని, వారి ఆశలని నేలమట్టం చేస్తోంది. కూలిపోతున్న ఇంట్లో అమ్మానాన్న కన్నీళ్లు కారుస్తున్నారు. భయం గుప్పెట్లో తోబుట్టువులు కాలం వెల్లదీస్తున్నారు. భవిష్యత్తు తుడిచిపెట్టుకుపోతోంది. వ్యసనం తలుపుతట్టిన ఇంట్లో నవ్వులు మాయం అవుతున్నాయి. బంధాలు విరిగిపోతున్నాయి. ఇది మత్తు కాదు.. భవిష్యత్తు కలలని నాశనం చేస్తోన్న ఘోర ముప్పు.

అఖండ 2 : తాండవం వాయిదా



బాలకృష్ణ, సంయుక్త మీనన్ జోడీగా తెరకెక్కిన 'అఖండ 2 : తాండవం' చిత్రం విడుదలను వాయిదా వేస్తున్నట్లు నిర్మాణ సంస్థ '14 రీల్స్' గురువారం రాత్రి ప్రకటించింది. ఇదివరకు షెడ్యూలు ప్రకారం..ఈ చిత్రం శుక్రవారం విడుదల కావాల్సివుండేది. అయితే సాంకేతిక కారణాల వల్ల తొలుత ప్రీమియర్ షోలను రద్దు చేసినట్లు ప్రకటించిన '14 రీల్స్' ఆ తర్వాత చిత్రం విడుదలను కూడా వాయిదా వేసినట్లు వెల్లడించింది. కాగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ 'అఖండ 2' టిక్కెట్ల రేట్లను పెంచుకోవటానికి ప్రభుత్వాలు అనుమతినిచ్చాయి. సింగిల్ స్క్రీన్‌లో రూ.50, మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 చొప్పున 3 రోజుల పాటు పెంచుకోవచ్చని తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో సింగిల్ స్క్రీన్స్‌లో రూ.75, మల్టీప్లెక్స్‌లో రూ.100 పెంచుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేశారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మించారు. ఎం తేజస్విని నందమూరి సమర్పించారు. 'అఖండ'కు సీక్వెల్‌గా 'అఖండ 2 : తాండవం' నిర్మించారు.

బాహుబలి కోసం జపాన్‌కు ప్రభాస్




బాహుబలి : ది ఎపిక్ జపాన్‌లో ఈనెల 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మేరకు నిర్మాతలు శని, ఆదివారాల్లో స్పెషల్ ప్రీమియర్స్ ఏర్పాటు చేశారు. ముందుగా ప్రకటించిన ప్రకారం జపాన్‌లో బాహుబలి : ది ఎపిక్ స్పెషల్ ప్రీమియర్‌ను వీక్షించేందుకు ఆయన హాజరవుతున్నారు. బాహుబలి ఫ్రాంచైజీ నిర్మాత శోభు యార్లగడ్డ కూడా హాజరు కానున్నారు. సందీప్ రెడ్డి వంగా ఇప్పటికే స్పిరిట్ మూవీ షూటింగ్ మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ప్రభాస్, తృప్తి డిమ్రిపై వచ్చే కొన్ని సన్నివేశాలను కూడా ఇటీవలే షూట్ చేశారు. జపాన్ నుంచి తిరిగి రాగానే మళ్లీ షూటింగ్‌లో పాల్గొంటారు. మారుతి-ప్రభాస్ కాంబోలో తెరకెక్కిన రాజాసాబ్ వచ్చే ఏడాది జనవరి 9న విడుదల కానున్నది.

'బ్యాడ్ బోయ్ కార్తీక్' నుండి 'పొమ్మంటే...' విడుదల




నాగ శౌర్య, విధి జంటగా నటిస్తున్న సినిమా 'బ్యాడ్ బోయ్ కార్తీక్'. తాజాగా ఈ చిత్రం నుండి 'పొమ్మంటే...' అంటూ సాగే పాటను గురువారం చిత్రబృందం విడుదల చేసింది. హ్యారీస్ జైరాజ్ సంగీతం సమకూర్చిన ఈ పాటని చంద్రబోస్ రాశారు. విజయ్ ఏసుదాస్, శక్తిశ్రీ గోపాలన్ పాడారు. శ్రీదేవి విజయ్ కుమార్ ఈ సినిమాలో నాగశౌర్య సోదరిగా నటిస్తున్నారు. సాయికుమార్, పూర్ణ కీలక పాత్రలను పోషిస్తున్నారు. వైష్ణవి ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మితమౌతున్న ఈ సినిమాను రామ్ దేసిన (రమేష్) డైరెక్ట్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు.



'మా ఇంటి బంగారం'లో బాలీవుడ్ నటుడు

బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య టాలీవుడ్ ప్రేక్షకులను పరిచయం కాబోతున్నారు. సమంత హీరోయిన్‌గా నటిస్తున్న 'మా ఇంటి బంగారం' సినిమాలో ఆయన నటించనున్నారు. ఈ సినిమాకు నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా గుల్షన్ దేవయ్య 'తాను సమంతతో నటించడానికి ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్నాన'ని పేర్కొన్నారు.

ఏవీఎం అధినేత శరవణన్ కన్నుమూత



కోలీవుడ్ నిర్మాత, ఏవీఎం ప్రొడక్షన్స్ అధినేత ఎం.శరవణన్ (86) కన్ను మూశారు. వయోభారంతోపాటు పలు ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న ఆయన గురువారం ఉదయం 3.30 గంటలకు చెన్నైలో తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఏవీఎం బ్యానర్‌పై తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో 300లకు పైగా సినిమాలను ఆయన నిర్మించారు. తెలుగులో 'సంసారం ఒక చదరంగం', 'ఆ ఒక్కటీ అడక్కు', 'మెరుపు కలలు', 'జెమినీ', 'శివాజీ' చిత్రాలను నిర్మించారు. డిసెంబరు 3 బుధవారమే ఆయన పుట్టినరోజు నిర్వహించుకున్నారు. ఆయన మరణం భారతీయ చిత్ర పరిశ్రమకు తీరని లోటని సినీ ప్రముఖులు నివాళులు అర్పిస్తున్నారు. శరవణన్ తండ్రి, ప్రసిద్ధ సినీ దిగ్గజం ఏ.వి. మేయ్యప్పన్ 1946లో ఏవీఎం స్టూడియోస్‌ను స్థాపించారు. శరవణన్ ఏవీఎం నిర్మాణ సంస్థ బాధ్యతలు చేపట్టి అనేక దశాబ్దాలపాటు సంస్థను ముందుకు నడిపించారు. అనేక భాషల్లో క్లాసిక్ చిత్రాలను తెరకెక్కించారు.

భారత హాకీ జట్టుకు కఠిన పరీక్ష

- నేడు క్వార్టర్స్‌లో బెల్జియంతో ఢీ
- ఎఫ్‌ఐహెచ్ జూనియర్ ప్రపంచకప్ హాకీ



చెన్నై: ఎఫ్‌ఐహెచ్ జూనియర్ ప్రపంచకప్‌లో భారత యువ జట్టు కఠిన పరీక్షను ఎదుర్కోనుంది. గ్రూప్-బి టాపర్‌గా నిలిచిన భారతజట్టు శుక్రవారం జరిగే క్వార్టర్‌ఫైనల్లో బెల్జియంతో తలపడనుంది. లీగ్ దశలో గ్రూప్-బిలో 29గోల్స్‌తో టాప్‌గా నిలిచిన భారతజట్టు కోచ్ పిఆర్ శ్రీజేశ్ నేతృత్వంలో పటిష్టంగా ఉంది. లీగ్ దశలో ఓటమి ఎరుగని యువ భారత్.. మూడో, చివరి లీగ్‌లో పటిష్ట స్విట్జర్లాండ్‌ను 5-0తో చిత్తు చేసి గ్రూప్ టాపర్‌గా నిలిచింది. దిల్‌రాజ్ సింగ్ 6గోల్స్, మన్‌మీత్ సింగ్ 5గోల్స్‌తో అద్భుత ఫామ్‌లో ఉన్నారు. భారతజట్టు ప్రధాన బలహీనత పెనాల్టీ కార్నర్‌లను గోల్‌గా మలచలేకపోతోంది. శారదానంద్ తివారి గత మ్యాచ్‌లో రెండు పెనాల్టీలను గోల్స్‌గా మలిచినా.. రోహిత్, అన్మోల్ ఎక్కా సమిష్టిగా రాణిస్తేనే బెల్జియం జట్టును నిలువరించగలం. బెల్జియంతో మ్యాచ్ అంటే భారత రక్షణ శ్రేణి మరింత పెంచుకోవాల్సి ఉంది. బెల్జియం జట్టు గ్రూప్-డిలో 2వ స్థానంలో నిలిచి క్వార్టర్స్‌కు చేరినా.. టోర్నీలో స్పెయిన్ తర్వాత ప్రమాదకర జట్లలో బెల్జియం ఒకటి. బెల్జియం జట్టు గ్రూప్-డిలో 22 గోల్స్‌తో 2వ స్థానంలో నిలిచినా.. ఆ జట్టు ఫీల్డ్ గోల్స్ కంటే పెనాల్టీ కార్నర్‌ల ద్వారా చేసిన గోల్స్ ఎక్కువ. దీంతో భారత డిఫెన్స్ నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్లో అత్యత కఠిన పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కెప్టెన్ రోహిత్, తలెం ప్రియోబర్తా, అలీమ్ అలీ నేతృత్వంలోనే డిఫెన్స్ యూనిట్ నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్లో ఏమేరకు ప్రదర్శన కనబరుస్తుందో చూడాల్సి ఉంది. బెల్జియంపై గెలవాలంటే భారత యువ హాకీ జట్టు అన్ని రంగాల్లో సమిష్టిగా రాణిచాల్సి ఉంది.

నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్స్ పోటీలు..

స్పెయిన్ × న్యూజిలాండ్	మ.12.30గం॥లకు
ఫ్రాన్స్ × జర్మనీ	మ. 3.00గం॥లకు
నెదర్లాండ్స్ × అర్జెంటీనా	సా.5.30గం॥లకు
ఇండియా × బెల్జియం	రా.8.00గం॥లకు

ఆంధ్ర ఖాతాలో మరో గెలుపు

- సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ

ఛండీగఢ్: సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు మరో విజయాన్ని నమోదు చేసుకుంది. గురువారం జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 8వికెట్ల తేడాతో ఛత్తీస్‌గఢ్‌ను చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఛత్తీస్‌గఢ్ నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 158పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 18.5ఓవర్లలో కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఆంధ్ర జట్టు బ్యాటర్లు షేక్ రషీద్(59నాటౌట్; 44 బంతుల్లో), అశ్విన్ హెబ్బర్(50; 40బంతుల్లో) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో రాణించారు. అంతకుముందు ఆంధ్ర బౌలర్లు యశ్వంత్(2/24), పృథ్వీ(2/35), శశికాంత్(2/36) సమిష్టిగా రాణించి ఛత్తీస్‌గఢ్‌ను కట్టడి చేశారు. ఈ గెలుపుతో ఆంధ్ర జట్టు ఎలైట్ గ్రూప్-ఎలో 16పాయింట్లతో 2వ స్థానంలో నిలిచింది.

జమ్ముకాశ్మీర్‌పై హైదరాబాద్ గెలుపు

ఇక గ్రూప్-బి స్టేజ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 4వికెట్ల తేడాతో జమ్ము కాశ్మీర్‌పై గెలిచింది. హైదరాబాద్ బౌలర్లు కట్టడిగా బౌలింగ్ చేయడంతో జమ్ము జట్టు 19.4ఓవర్లలో 112 పరుగులకే పరిమితమైంది. ఆ లక్ష్యాన్ని హైదరాబాద్ 15.1 ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. హైదరాబాద్ బౌలర్లు నితిన్ సాయి యాదవ్(3/17), మిలింద్(3/31), రక్షణ్(2/21) బౌలింగ్‌లో రాణించగా.. బ్యాటింగ్‌లో త్యాగరాజన్(50), ప్రజ్ఞయ్ రెడ్డి(31నాటౌట్) మెరిసారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నితిన్ సాయి యాదవ్‌కు దక్కింది. ఈ గెలుపుతో గ్రూప్-బిలో హైదరాబాద్ జట్టు 5మ్యాచ్‌లు ముగిసేసరికి 4విజయాలతో సహా 16పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68